V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
31-12-2024

సంపుటి : 01 I సంచిక : 239 I పేజీలు : 12 I వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## జిమ్మీ కార్టర్ గొప్ప రాజనీతిజ్ఞుడు

- ప్రపంచ శాంతి, సామరస్యం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు
- అగ్రరాజ్యానికి అధిపతిగా తనదైన ముద్ర వేశారు
- అమెరికా మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం తెలిపిన ప్రధాని మోదీ



2

## న్యూఇయర్ వేడుకలకు పోలీసుల ఆంక్షలు

- ఫ్లైఓవర్లు మూసివేత.. మెట్రో వేళల్లో మార్పులు
- ఓఆర్ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతి
- ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



2

దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. దేశాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేసిన గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ అంటూ కొనియాడారు సీఎం రేవంత్ రెడ్డి.. మాజీ ప్రధాని మన్మోహన్‌తో తెలంగాణకు ఉన్న బంధం ఎప్పటికీ మరిచిపోలేనిదన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తుండేలా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు.. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది.ఈసందర్భంగా భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ అసెంబ్లీ ఘన నివాళులు అర్పించింది.



### దేశాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేసిన గొప్ప

# ఆర్థికవేత్త

### మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలి

- ఉపాధి హామీ చట్టం, ఆర్టీఐ చట్టం ఘనత ఆయనదే
- తెలంగాణకు ఉన్న బంధం ఎప్పటికీ మరిచిపోలేనిది
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తాం:సీఎం రేవంత్ రెడ్డి
- ఆహార భద్రత చట్టం తీసుకువచ్చిన ఘనత మన్మోహన్‌దే: భట్టి విక్రమార్క
- నీతి, నిజాయితీ గల నాయకుడు, నిరాడంబరుడు: కేటీఆర్
- మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు అర్పించిన అసెంబ్లీ



4

### మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్ సమావేశం



2

## ఎర్ర జెండాలన్నీ ఏకమవ్వాలి

### కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యమైతే రాజ్యం మనదే

కమ్యూనిస్టు పార్టీ మరింత బలోపేతానికి కంకణబద్దులు కావాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**విశ్వంభర, నల్లగొండ:** శతాబ్ధి ఉత్సవాల సందర్భంగా కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కంకన-బద్దులు కావాలని, గ్రామ, గ్రామాన శాఖలను ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు పిలుపు-నిచ్చారు. ఎర్ర జెండాలన్నీ ఏకమవ్వాలని, కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యమైతే రాజ్యం మనదేనని, అప్పటివరకు కార్మిక రాజ్యం కోసం పోరాటం చేయాలని, రాజ్యం వచ్చిన తర్వాత కూడా పోరాటాలు కొనసాగుతాయని ఆయన

మిగతా4లో...

## కాంగ్రెస్ కేరాఫ్ కమీషన్ల సర్కార్

- 14 శాతం కమీషన్ ఇస్తేనే పెండింగ్ బిల్లులు మంజూరవుతున్నాయి
- ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టడంపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదు..
- మాజీ సర్పంచులకు బిల్లులివ్వకుండా నిండా ముంచింది
- కాంగ్రెస్ మెడలు వంచి బిల్లులు చెల్లించేలా చేస్తాం...
- అల్లు అర్జున్ కు, రేవంత్‌కు ఎక్కడో చెడింది
- పవన్ రేవంత్‌ను ఏమన్నాడో నాకు తెలియదు: బండి సంజయ్



2

## ఇకపై నెలలో 14 రోజులు

# ప్రజల్లోనే

### క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తే వచ్చే శక్తి వేరు

- ఇది వరకూ కార్యకర్తలు, వారి సమస్యల కోసం వెళ్లాను
- ఇప్పుడు ప్రజా సమస్యల కోసం వెళ్తున్నా
- అధికార వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తా
- మీడియాతో ఇష్టాగోష్టిలో పవన్‌కల్యాణ్



2



11

### పీఎస్ఎల్వీ- సీ60 ప్రయోగం విజయవంతం

నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన వాహకనౌక

ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ హర్షం

ప్రయోగంలో భాగస్వాములైన శాస్త్రవేత్తలను అభినందనలు తెలిపిన సోమనాథ్

## రైతుబంధు ఇవ్వాలన్న సోయి

# ప్రభుత్వానికి లేదు

### కేసీఆర్ కన్నబిడ్డలను చూసుకున్నట్లుగా ప్రజలను చూసుకున్నారు

- రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు
- రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారు
- రైతులను నరకయాతన పెట్టడానికి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చారు
- మేడిగడ్డ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలని.. ఎస్సారెస్పీని ఎండబెట్టారు
- నిజామాబాద్ జిల్లా అనాథగా మారింది
- జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరు
- ఆరు నెలల నుంచి పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణం
- విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత ఫైర్



**విశ్వంభర, నిజామాబాద్:** రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ కన్నబిడ్డలను చూసుకున్నట్లుగా ప్రజలను చూసుకున్నారన్నారు. కానీ, కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి

మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

### తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీ..

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



2



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 95 | రిటైల్ ₹ 117 |
| స్కిన్ ₹ 170 | స్కిన్ లెస్ ₹ 193 |

## ఏపీలో రూ.1,82,162 కోట్ల

# పెట్టుబడులు

- దాదాపు 2,63,411కుపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి
- పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే పలు సంస్థలు దరఖాస్తు
- ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం
- 2028నాటికి ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి: ఏపీ సీఎం చంద్రబాబు



2

## సీఆర్‌పీఎఫ్ నూతన డీజీగా వితుల్ కుమార్

- 1993 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి
- ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న వితుల్ కుమార్



4

## దర్యాప్తు పూర్తిచేశాం.. ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై అత్యాచారం ఘటనపై విచారణ జరిపిన నిజనిర్ధారణ కమిటీ



4

# బెట్టింగ్ యాప్‌లు ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి

**విశ్వంభర, హైదరాబాద్:** బెట్టింగ్ యాప్‌లు ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని టీజీఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ అన్నారు. కాసులకు కక్కుర్తిపడి వాటికి ప్రచారం చేయొద్దని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆయన సూచించారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.''రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని.. ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో విడుదల చేసే వీడియోల వల్ల అమాయకులు ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలవుతున్నారు. బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం ఎంత వరకు సమంజసం? సమాజ క్షేమం పట్టని మీ పెడధోరణులు క్షమించరానివి. కష్టపడకుండానే కాసులు పోగేసుకోవాలన్న ఆలోచన అనర్థమని యువత గుర్తించాలి. స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మి ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడకండి. ఇలాంటి సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండండి'' అని సజ్జనార్ పేర్కొన్నారు.

# తెలంగాణలో ఐపీఎస్‌ల బదిలీ..

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 2021, 2022 బ్యాచ్‌లకు చెందిన పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు ఏఎస్పీగా కాజల్, ఆసిఫాబాద్ ఏఎస్పీగా ఎస్. చిత్తరంజన్ నియమితులయ్యారు.

### బదిలీ అయిన మిగతా అధికారులు వీరే..

- కామారెడ్డి ఏఎస్పీగా బి.చైతన్యరెడ్డి
- జనగామ ఏఎస్పీగా పి.చేతన్ నితిన్
- భద్రాచలం ఏఎస్పీగా విక్రాంత్ కుమార్ సింగ్
- కరీంనగర్ రూరల్ ఏఎస్పీగా ఎన్.శుభం ప్రకాష్
- నిర్మల్ ఏఎస్పీగా రాజేష్ మీనా
- దేవరకొండ ఏఎస్పీగా పి.మౌనిక
- భువనగిరి ఏఎస్పీగా కంకణాల రాహుల్ రెడ్డి

# న్యూఇయర్ వేడుకలకు పోలీసుల ఆంక్షలు

**విశ్వంభర, హైదరాబాద్:** న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ఆంక్షలు విధించారు. డిసెంబరు 31 రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఐటీ కారిడార్‌లో ఫ్లైఓవర్లను మూసివేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్ఆర్‌పై భారీ వాహనాలు, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో స్పెషల్ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. సిగ్నల్ జంపింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతారని చెప్పారు. మద్యం సేవించిన వారికి పబ్‌లు, బార్ల యాజమానులు ప్రైవేటు వాహనాలు, డ్రైవర్లను అందుబాటులో ఉంచాలని పోలీసులు సూచించారు.

**31న రాత్రి ఉచిత ప్రయాణం**

న్యూఇయర్ వేడుకల దృష్ట్యా డిసెంబరు 31న రాత్రి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలంగాణ ఫోర్ వీలర్స్ సంఘం ప్రకటించింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 500 కార్లు, 250 క్యాబ్‌లు అందుబాటులో ఉంటాయని అసోసియేషన్ తెలిపింది. ప్రజలు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, రోడ్డు ప్రమాదాలు జరగకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

**మెట్రో ప్రయాణ వేళల్లో మార్పులు**


నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణ వేళల్లో ఎల్అండ్‌టీ మెట్రో రైలు మార్పులు చేసింది. జనవరి 1న తెల్లవారుజామున 12.30 గంటల వరకు మెట్రో రైలు సర్వీసులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. న్యూఇయర్ వేడుకల తర్వాత ప్రతి ఒక్కరూ రవాణా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తగా ఇళ్లకు చేరుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎల్అండ్‌టీ మెట్రో 'ఎక్స్' వేదికగా పేర్కొంది. ప్రతి కారిడార్‌లో చివరి మెట్రో స్టేషన్ నుంచి ఆఖరి సర్వీసు 12.30 గంటలకు బయలుదేరుతుందని పేర్కొంది.

# జిమ్మీ కార్టర్ గొప్ప రాజనీతిజ్ఞుడు

**ఢిల్లీ:** అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ (100) మృతిపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రపంచ శాంతి, సామరస్యం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని అన్నారు. భారత్-అమెరికాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో కార్టర్ సహకారం మరువలేనిదని వ్యాఖ్యానించారు. అగ్రరాజ్యానికి అధిపతిగా తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన కుటుంబసభ్యులు, స్నేహితులకు సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జిమ్మీ కార్టర్ అనారోగ్య కారణాలతో జార్జియాలోని ప్లెయిన్స్‌లో తుదిశ్వాస విడిచినట్లు ఆయన తనయుడు జేమ్స్ ఇ.కార్టర్ 3 తెలిపారు. 1924 అక్టోబరు 1న జన్మించిన కార్టర్ 1977-1981 మధ్య కాలంలో అగ్రరాజ్యానికి 39వ అధ్యక్షుడిగా పనిచేశారు. ఓ రైతుగా, నేవీ ఉద్యోగిగా, గవర్నర్, ప్రెసిడెంట్‌గా, అన్నింటికీ మించి ఓ మానవతావాదిగా ప్రపంచానికి ఆయన సుపరిచితులు. 2002లో నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. 1978లో భారత్ పర్యటనకు కార్టర్ వచ్చారు. ఆయన పర్యటనకు గుర్తుగా హరియాణాలోని ఓ గ్రామానికి కార్టర్‌పురిగా నామకరణం చేశారు.

# మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్ సమావేశం

**విశ్వంభర, హైదరాబాద్:** మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. సత్య నాదెళ్లను ఆయన నివాసంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీలో మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యం, ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ ప్రతిపాదనలు.. ఏఐ సిటీలో ఆర్అండ్‌డీ ఏర్పాటుకు సహకారంపై చర్చించారు. క్లౌడ్ కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చర్చిస్తూ.. క్లౌడ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కీలక పాత్ర పోషించాలని సీఎం కోరారు. ఓపెన్ ఏఐ నుంచి ఉచిత క్రెడిట్ ఇవ్వాలని మైక్రోసాఫ్ట్ సీఈవోకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నాలుగు డేటా సెంటర్లు, హైదరాబాద్ కేంద్రంగా విస్తరణ తదితర అంశాలపై సీఎం చర్చించారు.



# ఇకపై నెలలో 14 రోజులు ప్రజల్లోనే

**విశ్వంభర, మంగళగిరి:** గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార వ్యవస్థను చిందర వందర చేశారని, దాన్ని గాడిన పెట్టే పనిలోనే కూటమి ప్రభుత్వం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఇకపై నెలలో 14 రోజులు ప్రజల మధ్యే ఉంటానని, అందుకు అనుగుణంగా జిల్లా పర్యటనలు ఉంటాయని తెలిపారు. సోమవారం ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర విషయాలపై స్పందించారు.

**అభివృద్ధికి ఎవరు అడ్డుపడినా ఊరుకునేది లేదు**

''దశాబ్దన్నర కాలంగా నేను రాజకీయాల్లో ఉన్నా. ఇప్పుడు వచ్చింది సద్వినియోగం చేసుకోగలిగితే గొప్ప అవకాశమవుతుంది. కరిగిపోయిన ప్రతి సెకను తిరిగి రాదు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఉన్న సమయం సరిపోవడం లేదు. మేం కూడా నేర్చుకోవడానికి సమయంపడుతోంది. సమస్యలకు పరిష్కారాలు వెతికేలోపు వంద పిటిషన్లు వస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. చాలా మంది తమ సమస్య పరిష్కారమవుతుందని ఆశించి వస్తున్నారు. అధికార యంత్రాంగం కూడా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. వీటన్నింటినీ సమన్వయ పరిచిన తర్వాత నాకు అనిపించింది ఏంటంటే, మనకు స్ఫూర్తినింపే నాయకులు కావాలి. అప్పుడు స్వచ్ఛమైన, బాధ్యతయుతమైన ప్రభుత్వం ఇవ్వగలం. క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తే వచ్చే శక్తి వేరు. రాష్ట్రంలో 70శాతం మంది పంచాయతీల్లోనే ఉన్నారు. ఆ శాఖ నాకొక వరం. ఇది వరకూ కార్యకర్తలు, వారి సమస్యల కోసం వెళ్లాను. ఇప్పుడు ప్రజా సమస్యల కోసం వెళ్తున్నా. పనిచేస్తున్న అధికారులపై దాడులు జరుగుతుంటే వెళ్లాల్సి వచ్చింది. స్థానిక నాయకుల నిర్లక్ష్యం కూడా కనపడుతోంది. దాన్ని బద్దలు కొట్టడానికి కడపకు వెళ్లాను. అభివృద్ధికి ఎవరు అడ్డు పడినా ఊరుకునేది లేదనే సందేశం ఇవ్వాలనుకున్నా''



**నెలలో 14 రోజులు జిల్లాల్లోనే..**

''ఏజెన్సీ ప్రాంతాల్లో నేను చెప్పులు వేసుకుని నడుస్తుంటే, బురదలో ఇరుక్కుపోయాయి. తర్వాత వదిలేసి నడిచాను. ఈ అనుభవం ప్రతి నాయకుడికి అవసరం. నేను నడిచి చూపిస్తేనే ఇతరులకు ధైర్యం వస్తుంది. నా పేషీతో వెళ్లి జిల్లాల్లో కూర్చోవడం అవసరం. నేనేదో పనిమీద వెళ్లినప్పుడు చూడటం కాకుండా, అక్కడే క్యాంపు ఆఫీస్ పెడితే ప్రజల సమస్యలకు సత్వరం పరిష్కారం చూపగలం. అధికారులు బాధ్యతాయుతంగా ఉండాలి. నెలలో 14 రోజులు జిల్లా పర్యటనలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. అయితే, ఒక జిల్లానా? లేక రెండా? అనేది చూడాలి. సెక్యూరిటీ, బస, ఆహార వసతులను కూడా చూసుకోవాలి''

**అధికార వ్యవస్థ.. అన్నీ సరిచేస్తా!**

''అధికార వ్యవస్థలో స్పందన అనేది కరవైంది. ఇటీవల కాకినాడలో రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు యువకులు చనిపోయారు. అందులో ఒకబ్బాయి బ్రెయిన్ డెడ్ అయితే, అతడి అవయవాలను తల్లిదండ్రులు దానం చేశారు. వారు కోరుకున్నది ఏంటంటే, సింపుల్ సారీ. ఎవరు చేశారో కనుక్కోమని కోరుతూ కేసు ఫైల్ చేయమన్నారు. పోలీసు అధికారులు సరిగ్గా స్పందించలేదు. నా దృష్టికి రాగానే ఎస్పీతో మాట్లాడమని చెప్పా. నా పేషీలో ఉన్న అధికారులు మాట్లాడితే 'ఇవన్నీ జరుగుతుంటాయండీ.. పోలీసులంతే' అన్నారట. అలా ఎలా మాట్లాడతారు? మానవతా దృక్పథం లేకపోతే ఎందుకు? ఇలాంటి విషయాల్లో సమూల మార్పు తీసుకురావాలి''

''కొన్ని సమస్యల పరిష్కారం కోసం సీఎంగారు 14 గంటల పాటు అధికారులతో మీటింగ్ పెడతారు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే సక్రమంగా పనిచేయాలి. నాణ్యమైన పని చేసినప్పుడు సెలవులు కూడా తీసుకోవచ్చు. అధికార వ్యవస్థలో సమయపాలన సరిగా లేదు. అద్భుతంగా పనిచేయాలంటే 8గంటలు చేసినా చాలు. గత ఐదేళ్లలో ఏపీలో అధికార వ్యవస్థ పనితీరు అట్టడుగు స్థాయికి వెళ్లిపోయిందని ఇటీవల దిల్లీలో చెప్పారు. వర్క్ కల్చర్ తగ్గించేశారు. గత ఐదేళ్లలో నాణ్యత పరిశీలన లేకపోవడంతో ఇప్పుడది అలవాటు అయిపోయింది. ఆ అలవాటును మాన్పించడానికి మాకు సమయం పడుతుంది. ఈ క్రమంలో అధికారులు కొంత ఇబ్బంది పడొచ్చు. శని, ఆదివారాలు విశ్రాంతి తీసుకోవాలంటే, మిగిలిన రోజులు బాగా పనిచేయాలి. ఐదు రోజులు బలంగా పనిచేస్తే, సెలవు కూడా బాగుంటుంది. అధికార యంత్రాంగాన్ని పటిష్ఠం చేయడమే జిల్లాల పర్యటన ఉద్దేశం''

**ఆర్థికంగా రాష్ట్రాన్ని నలిపేశారు**

''అధికార వ్యవస్థను చిందర వందర చేశారు. 'తప్పు జరుగుతుంటే మీరెందుకు ప్రశ్నించలేదు' అని మేము అడుగుతుంటే, ఎవరూ నోరు మెదపడం లేదు. భయపడుతున్నారు. 'అధికారులం కదా మేమేం చేస్తాం' అనుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ తమని తాము సమీక్షించుకోవాలి. మా ఆర్నెల్ల పాలన, వాళ్ల తొలి ఆర్నెల పాలన పోల్చండి. మాకు చాలా సమస్యలు ఉన్నాయి. ఆర్థికంగా రాష్ట్రాన్ని నలిపేశారు. వర్క్ కల్చర్ చంపేశారు. ప్రజల అంచనాలు చూస్తే భారీగా ఉన్నాయి. ప్రతి నెల జీతాలు, పెన్షన్లు సమయానికి ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం. సివిల్ సప్లయ్‌లో కుంభకోణాలు బయటపెట్టాం''

**లంచం లేకుండా బదిలీ జరగలేదు**

''గత ఐదేళ్లలో లంచాల లేకుండా బదిలీలు జరగలేదు. మేము అధికారం చేపట్టిన తర్వాత మెరిట్ ఆధారంగా పోస్టులు ఇచ్చాం. కొంతమంది లిస్ట్‌లో తమ పేర్లు చూసుకుని ఆశ్చర్యపోయారు. పేరు తప్పు పడిందేమోనని అనుకున్నారు. నా పరిధిలో ఉండే అధికారులను చాలా స్పష్టతతో కేవలం మెరిట్ ఆధారంగా నియమించాం. దీన్ని కింది స్థాయి వరకూ తీసుకెళ్లాలి. 'ప్రతిభ ఆధారంగా మిమ్మల్ని ఏ స్థాయిలో ఉంచామో. మీ కింది వారినీ అలాగే తీసుకోండి' అని చెప్పాను. లంచాలు లేకుండా చూడాలని సూచించా. అవినీతి, లంచగొండితనం చాలా మందిలో జీర్ణించుకుపోయాయి. వీటిని ఎలాగైనా నిర్మూలించాలి'' అని పవన్‌కల్యాణ్ అన్నారు.

# రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదు

**మొదటిపేజీ తరువాయి**

వచ్చిందని.. రైతుబంధు ఇవ్వాలన్న సోయి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. రైతు కూలీలకు కూడా సాయం చేస్తామన్న ప్రభుత్వం.. ఇప్పటికీ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని.. రాష్ట్రంలో ప్రతీ మూడు గంటలకు మహిళలపై ఒక అత్యాచారం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీ ఐదు గంటలకు ఒక మహిళా కిడ్నాప్ అవుతోందని.. మహిళా భద్రత కోసం కేసీఆర్ షీటీమ్స్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు పోలీసులు కాంగ్రెస్ నేతలు చుట్టూ తిరగడం తప్పా.. ఏం చేయడం లేదని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పోలీసులు పీపుల్స్ ఫ్రెండ్లీగా ఉండేదని.. ఇప్పుడు కాంగ్రెస్ ఫ్రెండ్లీ పోలీసింగ్ జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేకపోవడం దారుణమని.. సీఎం రేవంత్ రెడ్డి మహిళా భద్రతపై ప్రత్యేకంగా సమీక్షించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం, రాజ్యాంగమంటూ తిరుగుతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఎప్పుడూ లేనట్లు రెండు పెద్ద ఎన్‌కౌంటర్లు జరిగాయని.. తుపాకీ మోతలు ఉండవద్దన్న లక్ష్యంతో పరిపాలన చేసిన వ్యక్తి కేసీఆర్ అని.. ఇవాళ రేవంత్ రెడ్డి శాంతి భద్రతలకు భగ్నం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం... బిల్లులు మాత్రం విడుదల చేసిందని.. రైతులను నరకయాతన పెట్టడానికి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిన ప్రభుత్వం రీసర్వే చేసే ముందు భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూముల రీసర్వే పేరిట ఒకరి పేరు మీద ఉన్న భూమిని మరొకరి పేరు మీద రాయన్న నమ్మకం ప్రజలకు, రైతులకు లేదని.. కాంగ్రెస్ పై ప్రజలు నమ్మకం కోల్పోయారన్నారు.




ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. రాబోయే రోజులు బీఆర్ఎస్‌వేనని.. నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని.. జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరని.. ఎంపీ ఉన్నా లేనట్లే.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదన్నారు. ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారన్నారు. నిజామాబాద్‌కు ఆరు నెలల నుంచి పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. ఏడాదికాలంలో ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదని.. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక కొత్త పని చేపట్టలేదన్నారు. ఎస్సారెస్పీ నుంచి నిజామాబాద్ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇవ్వలేదన్నారు. మేడిగడ్డ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న పిచ్చి ప్రయత్నంతో ఎస్సారెస్పీని ఎండబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల గురించి ప్రభుత్వాన్ని నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. షబ్బీర్ అలీకి నిజామాబాద్‌పై ఆలోచన లేదని, పట్టిలేదన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఇష్టానుసారంగా ఇసుక దందా జరుగుతోందని.. ఇప్పుడు మైనింగ్ శాఖ ఆదాయం తగ్గిందన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆదాయం పెరిగిందని.. ఇసుకు దోపిడీని అడ్డుకుంటామన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో కలిపి 3 లక్షల 79 మంది బీఆర్ఎస్ పార్టీ రుణమాఫీ చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కేవలం 2 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని.. నిజామాబాద్ జిల్లాలో ఇంకా లక్షా 2 వేల మందికి, కామారెడ్డి జిల్లాలో 75 వేల మందికి రుణమాఫీ కాలేదన్నారు. తెలంగాణ యూనివర్సిటీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని.. తక్షణమే నిధులు విడుదల చేసి... వర్సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని హితవు పలికారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కమిటీలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్‌లో హైడ్రా పెట్టినట్టు నిజామాబాద్‌లో నిద్రా పెడుతామని పీసీసీ అధ్యక్షుడు చెప్పడం దారుణమన్నారు. బుల్డోజర్‌తో ప్రజల ఆస్తులు కూలగొడుతామని హెచ్చరిస్తున్నారని.. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను తీసుకెళ్తే మేము ఊరుకోబోమని హెచ్చరించారు.

## ఏపీలో రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు..

**విశ్వంభర, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో 2,63,411 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా రాష్ట్రానికి రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ మేరకు సచివాలయంలో జరిగిన ఎస్ఐపీబీ సమావేశంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే పలు సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిపై ఎస్ఐపీబీ సమావేశంలో చర్చించారు.దరఖాస్తు చేసుకున్న ప్రాజెక్టుల్లో 9 కీలక ప్రాజెక్టుల స్థాపనకు సీఎం ఆమోదముద్ర వేశారు. ఈ 9 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.1,82,162 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. దాదాపు 2,63,411కుపైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇందులో ప్రధానంగా నెల్లూరు జిల్లా రామాయపట్నంలో బీపీసీఎల్ 6 వేల ఎకరాల విస్తీర్ణంలో రూ.96,862 కోట్ల పెట్టుబడితో భారీ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా దాదాపు 2,400 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 5 బ్లాకుల్లో ఈ రిఫైనరీ ఏర్పాటు కానుంది. వచ్చే 20 ఏళ్లలో ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రానికి రూ.88వేల కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. విశాఖ మిలీనియం టవర్స్‌లో రూ.80 కోట్ల పెట్టుబడితో కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు టీసీఎస్ ముందుకొచ్చింది. దీనికి సంబంధించి కూడా ముఖ్యమంత్రి ఆమోదముద్ర వేశారు. దీని ద్వారా దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ దాదాపు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అనకాపల్లి జిల్లాలో 106 ఎకరాల్లో రూ.1174 కోట్ల పెట్టుబడితో మరో సంస్థతో పాటు ఇంధన రంగానికి చెందిన పలు సంస్థల ప్రాజెక్టులకు సైతం సీఎం ఆమోదం తెలిపారు. గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా పలు సంస్థలు దాదాపు రూ.83 వేల కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.4వేల కోట్ల మేర ఆదాయం సమకూరనుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 2028నాటికి ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

# కాంగ్రెస్ కేరాఫ్ కమీషన్ల సర్కార్

**విశ్వంభర, కరీంనగర్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ బిల్లు మంజూరు కావాలన్నా 8 నుండి 14 శాతం కమీషన్లు దండుకుంటోందని ఆరోపించారు. కాంగ్రెస్ కేబినెట్ లో కొందరు నిజాయితీ మంత్రులున్నారని, వారికి ఈ విషయం ఏ మాత్రం నచ్చడం లేదన్నారు. ఈ కమీషన్లపై కాంగ్రెస్ లోనే అంతర్యుద్ధం నడుస్తోందని, ఎప్పుడైనా ఈ కమీషన్ల భాగోతం బద్దలు కావొచ్చని అన్నారు.. కమీషన్ల మోజులో పడి ఢిల్లీ కాంగ్రెస్ నేతలకు కప్పం కడుతూ తమ సీటును కాపాడుకోవడానికే కాంగ్రెస్ పాలకులు పరిమితమయ్యారే తప్ప ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పెండింగ్ బిల్లులు మంజూరు కాక రాష్ట్రవ్యాప్తంగా 12 వేలకు మాజీ సర్పంచులు రోడ్డున పడ్డా రేవంత్ రెడ్డి సర్కార్ కు చీమ కుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. మాజీ సర్పంచులకు కిషన్ రెడ్డి నాయకత్వంలో బీజేపీ అండగా నిలుస్తోందన్నారు. మాజీ సర్పంచుల పక్షాన అతి త్వరలోనే ఉద్యమిస్తామన్నారు. సోమవారం మధ్యాహ్నం తాజా మాజీ సర్పంచుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు అక్కినపల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జేఏసీ నాయకులు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి తరలివచ్చి బండి సంజయ్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ''ఈ రాష్ట్రంలో ఎన్నో సమస్యలపై పోరాడి పరిష్కారం చూపిన నాయకుడు బండి సంజయ్. మాజీ సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరిస్తారనే నమ్మకంతో కలిసి వినతి పత్రం సమర్పించాం. మేం ప్రజల కోసం పనులు చేసి అప్పుల పాలైతే... కనీసం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఇయాళ రోడ్డున పడ్డాం. మా పక్షాన పోరాడాలని సంజయన్నను కోరాం. అండగా ఉంటానన్న భరోసానిచ్చిన బండి సంజయ్ అన్నకు రుణపడి ఉంటాం ...''అని పేర్కొన్నారు. అనంతరం బండి సంజయ్ వారితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.. ఏమన్నారంటే.. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకత్వం ఎప్పుడు సమావేశమైనా తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల అంశం చర్చకు వస్తుంది. మాజీ సర్పంచుల ప్రజల కోసమే పనులు చేశారు. సొంత డబ్బు ఖర్చు పెట్టి అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులకు అండగా ఉండాలని నిర్ణయించాం. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా 12వేల 769 మంది తాజా మాజీ సర్పంచులున్నరు. వీళ్లందరికీ దాదాపు 13 వందల కోట్ల రూపాయలు బిల్లులు రావాలి. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకుగాను ఒక్కో సర్పంచుకు 3 లక్షల నుండి కోటి రూపాయల వరకు బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఇయాళ ఏ గ్రామానికి వెళ్లినా 1.పల్లె ప్రగతి 2.రైతు వేదిక 3. వైకుంఠ ధామం 4.డంపింగ్ యార్డ్ 5.పల్లె ప్రకృతి వనం 6.హరిత వనం 7.రెవిన్యూ ప్లాంటేషన్ 8.కమ్యూనిటీ హాల్ 9.హైమాస్ లైట్స్ 10.అంతర్గత సీసీ రోడ్లు 11.సీసీ డ్రైనేజీలు 12.మిషన్ భగీరథ 13.ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ 14.మన ఊరు..మన బడి వంటి అభివృద్ధి కార్యక్రమాలు కళ్ల ముందే కన్పిస్తున్నాయి. ఇవన్నీ జరిగాయంటే అది తాజా మాజీ సర్పంచులవల్లేనని ప్రజలకు తెలుసు. ఇయాళ సర్పంచులు లేకపోవడంతో గ్రామాల్లో తట్టెడు మట్టి పోయించేటోళ్లు కూడా లేరని చర్చించుకుంటున్నరు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బిల్లులన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్న రేవంత్ ప్రభుత్వం ఏడాదైనా నయా పైసా బిల్లు చెల్లించకపాయే. పాపం బిల్లుల కోసం ఈ తాజా మాజీ సర్పంచులు ఎక్కని గడప లేదు... దిగని గడప లేదు... ఎంపీడీఓ నుండి కలెక్టర్, చీఫ్ సెక్రటరీ వరకు.... ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రుల మొదలు ముఖ్యమంత్రి వరకు అందరినీ కలిసి మొర పెట్టుకున్నరు. అయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు... మాజీ సర్పంచులను రోడ్డున పడేశారు. ఇంకా చెప్పాలంటే... మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఎందుకు ఇవ్వాలనే భావనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. మాజీ సర్పంచులవైపు ప్రజలున్నారనే సంగతిని మర్చిపోతున్నరు. ప్రభుత్వాన్ని నమ్మి అభివృద్ధి పనులు చేస్తే వాళ్ల బతుకులను బర్ బాద్ చేయడం కరెక్ట్ కాదు... వాళ్లు ప్రజల్లోకి వెళితే... ఈ ప్రభుత్వాన్ని కాపాడటం ఎవరి తరమూ కాదనే సంగతి గుర్తుంచుకోవాలి.

తాజీ మాజీ సర్పంచులారా... కాంగ్రెస్ ను నమ్మి మీరు నిండా మోసపోయారు. ఇకనైనా కళ్లు తెరవండి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలు, జెండాలను పక్కనపెట్టి కాంగ్రెస్ ను ఓడించడమే ధ్యేయంగా పనిచేయండి. మీరు చేసే ఉద్యమానికి బీజేపీ పూర్తి అండగా ఉంటుంది. కిషన్ రెడ్డి గారితో ఫోన్ లో మాట్లాడాను. మద్దతు ప్రకటించాలని చెప్పారు.ఈ విషయంలో బీజేపీ ముందుండి మీ తరపున పోరాడతాం. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల సర్కార్. 8 నుండి 14 శాతం కమీషన్లతో నడుస్తోంది. పెండింగ్ బిల్లులు మంజూరు కావాలంటే వాళ్లకు 8 నుండి 14 శాతం కమీషన్లు ఇస్తే మీ నిధులన్నీ విడుదలవుతాయి. కమీషన్లు దండుకునేందుకు ప్రత్యేకంగా ముగ్గురు మంత్రులను పెట్టుకున్నరు. 14 శాతం కమీషన్లు ఎవరైతే ఇస్తారో... వాళ్లకే బిల్లులు మంజూరవుతున్నాయి. ఈ కమీషన్ల సొమ్మును ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు కప్పం కడుతూ తమ సీటును కాపాడుకుంటున్నరు. కప్పం కట్టకపోతే ఎన్నడూ ఆ సీట్లు ఎగిరిపోయేయి. రేవంత్ కేబినెట్ లో కొందరు నిజాయితీపరులైన మంత్రులు కూడా ఉన్నారు. కమీషన్ల గోల భరించలేక వాళ్లు లొల్లి పెడుతున్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ లో అంతర్యుద్ధం జరుగుతోంది. అది ఎప్పుడైనా బహిరంగం కావొచ్చు.అసలు ఈ ప్రభుత్వంపట్ల ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. ఫీజు రీయంబర్స్ మెంట్ చెల్లించకపోవడంతో లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నరు.వాళ్లకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. కాలేజీ యాజమాన్యాలు జీతాలు చెల్లించలేక కాలేజీలను మూసి వేస్తున్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సకు వచ్చే రోగులను చేర్చుకోవడం లేదు...ఇకనైనా ప్రభుత్వం దిగిరావాలి. లేనిపక్షంలో కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పేందుకు సర్పంచులతో కలిసి ఉద్యమిస్తాం...రాష్ట్ర ప్రభుత్వ మెడలు వంచి బిల్లులు చెల్లించేలా చేస్తామన్నారు.

**రాష్ట్రంలో క్రైం రేటు పెరిగిందనే అంశంపై అడిగిన ప్రశ్నకు.....**

22శాతం క్రైం రేటు పెరిగింది. మహిళలపై అత్యాచారాలు 28 శాతం పెరిగింది. శాంతి భద్రతలను కాపాడాలేని చేతగాని సర్కార్ నడుస్తోంది. వీళ్లకు ప్రజల బాధలు పట్టవు. ఢిల్లీకి పోయి కప్పం కట్టి పదవులను కాపాడుకోవడంపై ఉన్న శ్రద్ధ ప్రజలను ఆదుకోవాలని లేదు.6 గ్యారంటీలను అమలు చేయాలనే ధ్యాస లేదన్నారు.

రేవంత్ రెడ్డి గొప్పనాయకుడని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ వ్యాఖ్యానించారంటూ మీడియా అడిగిన ప్రశ్నకు....పవన్ కళ్యాణ్ ఏమన్నారో నాకు తెలియదు. నేను వినలేదు. నిజంగా గొప్ప నాయకుడని అని ఉంటే... ఆయనలో మరి ఏం కన్పించిందో.. 6 గ్యారంటీలను అమలు చేయలేదు. ఇచ్చిన హామీలను ఏవీ అమలు చేయలేదు? క్రైం రేటు పెరిగింది. మరి ఆయనలో గొప్ప నాయకుడు ఎట్లా కన్పించారో వారికే తెలియాలి.

**అల్లు అర్జున్ ఘటనపై...**

అల్లు సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్ అరెస్టై జైలుకు పోయి బెయిల్ వచ్చాడు. ఆ అంశం ముగిసింది. కానీ మళ్లీ అసెంబ్లీలో మరే సమస్య లేనట్లు ఈ అంశంపై గంటల తరబడి చర్చ జరపాల్సిన అవసరం ఏముంది? 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా దారి మళ్లించాలనే కుట్రలో భాగమే. నాకు తెలిసి రేవంత్ రెడ్డికి, అల్లు అర్జున్ కు మధ్య ఏదో చెడింది. పుష్ప 2 సినిమాకు 1700 కోట్ల రూపాయల వచ్చినయ్. పుష్ప 2 సినిమా ఇంకా స్టార్ట్ కాలేదు.. కానీ పుష్ప 3 సినిమా చూపించారు. నేనడుగుతున్నా... అల్లు అర్జున్ పై కేసును మృతురాలి భర్త వాపస్ తీసుకుంటున్నట్లు ప్రకటించాడు కదా... ఇంకా దీనిపై ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు. మన్మోహన్ సింగ్, అంబేద్కర్ లను బీజేపీ అవమానించిందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై..అంబేద్కర్ ను అడుగడుగునా అవమానించిందే కాంగ్రెస్ పార్టీ. ఆయనకు భారతరత్న ఎందుకు ఇవ్వలేదు? పంచ్ తీర్థ్ లను ఎందుకు ఏర్పాటు చేయలేదు? ఆయన లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడించేందుకు ఎందుకు ప్రయత్నించింది? మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు జరపకుండా ఎందుకు అవమానించారు? నాటి ప్రధాని వీపీ సింగ్ విషయంలో ఇట్లనే అవమానించింది నిజం కాదా? మన్మోహన్ సింగ్ ప్రధానిగాఉన్నన్నాళ్లూ..సోనియాగాంధీ సూపర్ పీఎంగా ఉంటూ రబ్బర్ స్టాంప్ గా తయారు చేసింది నిజం కాదా? కాంగ్రెస్ తీరును చూసి మన్మోహన్ సింగ్ ఆత్మ క్షోభిస్తోందన్నారు.



## ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష

# శక్తులన్నీ ఐక్యం కావాలి

- మతతత్వ శక్తుల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలి
- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా
- దేశంలోని ఫాసిజాన్ని ఓడించాలి: సురవరం సుధాకర రెడ్డి
- ఉత్సాహంగా నల్లగొండలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభ బహిరంగ సభ









**విశ్వంభర, నల్లగొండ:** భారతదేశం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు , మతతత్వ శక్తుల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాలని ప్రజలకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. ఇందుకు దేశంలోని అన్ని ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష శక్తులన్నీ ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. భారత స్వాతంత్ర్యఉద్యమంలో మహాత్మా గాంధీతో పాటు కమ్యూనిస్టు పార్టీ కూడా పోరాటం చేసిందని, అదే స్ఫూర్తితో మరోసారి బిజెపి, ఆర్ శక్తులకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని రాజా ఉద్ఘాటించారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పోరాటల ఖిల్లా నల్లగొండ జిల్లాలో భారీ బహిరంగసభను నిర్వహించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ముఖ్యఅతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా , మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు హజరయ్యారు. సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు, కె.శ్రీనివాస్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణ శంకర్, ఎం.బాలనరసింహా, ఇ.టి.నరసింహా, వి.ఎస్.బోస్ వేదికపై ఆసీనులయ్యారు. సభలో డి.రాజా ప్రసంగిస్తూ వందేళ్ళ కొంద స్థాపించబడిన భారత కమ్యూనిస్టు పార్టీ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని నినదించిన మొట్టమొదటి పార్టీ అని, వలసవాదులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేసిందని తెలిపారు. అదే వందేళ్ళ క్రితం ఏర్పాటైన ఆర్ భారత స్వాతంత్రోద్యమంలో, బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలసవాదులకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలో పాల్గొనలేదని విమర్శించారు. బిజెపి గురువు ఆర్ ఆర్ ఎస్ అని, దాని రాజకీయ విభాగమే బిజెపి అని అన్నారు. కమ్యూనిస్టు నాయకులు స్వాతంత్ర్యపూర్వమే భారతదేశ భవిష్యత్తు కోసం దేశాన్ని ముందుకు నడిపేందుకు దూరాలోచనతో రాజ్యాంగ సభ కావాలని తెలిపారు. భారతదేశం మతపరమైన దేశం కావొద్దని, భారతదేశం లౌకిక గణ తంత్ర, ప్రజాతంత్ర దేశంగా ఫరిగడవిల్లాలని తాము నాడు కోరుకున్నామని, మతతత్వ వాదులను, మతతత్వ సంస్థలకు చెందిన సభ్యులను సిపిఐ సభ్యునిగా చేర్చుకోవద్దని నిర్ణయించిన మొట్ట మొదటి పార్టీ సిపిఐ అని రాజా చెప్పారు. రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ సైతం భారతదేశాన్ని మతతత్వ దేశంగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని,హిందూదేశంగా మారితే భారతదేశానికి పెను విపత్తుగా పరిణమిస్తుందని హెచ్చరించారని తెలిపారు. ప్రస్తుతం రాజ్యాంగానికి, దేశానికి , ప్రజాస్వామ్యానికి బిజెపి, ఆర్ నుంచి పెనుప్రమాదం ఏర్పడిందన్నారు. వారి నుంచి దేశాన్ని పరిరక్షించడం, లౌకిక, ప్రజాస్వామ్య దేశంగా కాపాడుకోవడం పెద్ద సవాల్ మారిందన్నారు. అప్పుడు బ్రిటిష్ పోర్చుగీస్ నుంచి భారతదేశాన్ని విముక్తి చేసినట్టే, మతతత్వ, ఫాసిస్టులు, విభజన శక్తులైన బిజెపి, ఆర్ పారదోలే లక్షంగా చేసుకుని పనిచేయాల్సిన చారిత్రక కర్తవ్యం కమ్యూనిస్టులపై ఉందన్నారు.

### అంబేద్కర్‌ను తిడితే అమిత్ షా దేశంలో తిరగలేడు..

కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఇలాగే తిడితే భారతదేశంలో తిరిగే పరిస్థితి ఉండబోదని, ప్రజలు తిరగబడుతారని , పోరాటం చేస్తారని రాజా హెచ్చరించారు. అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పి, తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని , ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేయకపోతే ప్రధాని మోదీ హోంశాఖ మంత్రి పదవి







నుంచి అమిత్ షాను తొలగించాలని డిమాండ్ చేశారు. అమిత్ హోం మంత్రిగా ఉండేందుకు ఏ మాత్రం వీలు లేదని స్పష్టం చేశారు. విద్యా, ఉపాధి కల్పన, గృహవసతి, విద్యాహక్కు, ప్రాథమిక హక్కులు ఉండాలని రాజ్యాంగం చెబుతుందని, పౌరులు గౌరవంగా ఉండాలని, రోడ్లపైన ఎవ్వరూ అడుకోవద్దని, తిండిలేకుండా ఉండకూడదని రాజ్యాంగంలో పొందపర్చిన విషయాన్ని రాజా వివరించారు. ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం ఉండాలని రాజ్యాంగం చెబుతుందని, కానీ 75 సంవత్సరాల రాజ్యాంగ వార్షికోత్సవాలు జరుపుకుంటున్నప్పటికీ పేదలకు, సామాన్యులకు సమానత్వం , సౌభ్రాతృత్వం ఎక్కడ ఉన్నదని, ఎక్కడ న్యాయం అందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ క్రిస్టియన్లు, ముస్లింపైన దాడులు జరుగుతున్నాయని, దళితులు, ఆదివాసీలపైన అత్యాచారాలు జరుగుతున్నాయని విమర్శించారు. భారతదేశంలో ప్రస్తుతం దళిత,గిరిజన మహిళలకు, పిల్లలకు భద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

### అదానీ, అంబానీలను రక్షిస్తున్న మోదీ, బిజెపి..

అదానీ,అంబానీలను ప్రధాని మోదీ, బిజెపి రక్షిస్తోందని రాజా విమర్శించారు. అదానీ ప్రపంచ వ్యాపారవేత్తల్లోనే బిలినియర్ మారారని, ఆయనపై అమెరికా దేశంలో చార్జిషీట్ దాఖలు చేసినా, ఆయనపై చర్చకు, చర్యకు మోదీ అంగీకరించడం లేదని, ఆయనను కాపాడేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.పేదలు, కార్మిక, రైతులకు మోదీ, బిజెపి ప్రభుత్వం వ్యతిరేకమని, అదానీ, అంబానీ లాంటి ఆశ్రిత పెట్టుబడిదారులకు వారు అనుకూలమని, అందుకే దేశంలో ఆర్థిక అసమానతలు నెలకొన్నాయని అన్నారు. దేశంలో పిల్లలు,మహిళలు రక్తహీనతతో బాదపడుతున్నట్టు సాక్షాత్తు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని రాజా అన్నారు. ప్రధాని మోదీ ఒక వైపు వికసిత్ భారత్ అని చెబుతున్నారని, మరోవైపు పెరిగి న ధరలతో ప్రజలు బాధపడుతున్నారని, వికసిత్ భారత్ ఎక్కడ ఉన్నదని రాజా కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

### ప్రతి పల్లె, పట్టణాల్లో ఎర్ర జెండా ఎగరాలె..

భారతదేశంలో అంటరానితనానికి వ్యతిరేకంగా కుల, వర్గ రహిత నూతన సమాజం కోసం, సోసలిస్టు భారతదేశం కోసం పోరాటం చేయాలని, అదే మన ముందు ఉన్న లక్షం అని రాజా సూచించారు. శతాబ్ధి ఉత్సవవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఎర్రజెండా లేని పల్లెలు, పట్టణాలు ఉండరాదని, ప్రతి గ్రామ, మున్సిపాలిటీల్లో కమ్యూనిస్టు పార్టీ బలంగా ఎదగాలని, ఆ దిశగా కమ్యూనిస్టు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని బిజెపి, ఆర్ ఎస్ ఎస్ ప్రజా వ్యతిరేక పోరాటం నుంచి విముక్తి కలిపించేందుకు ఎర్ర జెండా ముందుండి పోరాడాలని, సిపిఐని మరింత బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్న మైందని రాజా సూచించారు. ఎర్ర జెండా మరింత ఉన్నతగా ఎదగాలని, పట్టణాలు, గ్రామాలకు చేరాలన్నారు. నాటి బ్రిటీష్ పాలకులు భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించకుండా మొగ్గలోనే తుంచేసేందుకు మీరట్, లాహోర్, కాన్పూర్ కుట్ర కేసులను మోపారని,వాటిని ఎదుర్కొని కమ్యూనిస్టు విప్లవకారులు భారత కమ్యూనిస్టు పార్టీని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వారి విప్లవ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తున్నందుకు మనకెంతో గర్వకారణమన్నారు. వందేళ్ల క్రితం ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ నాడు భారత దేశ స్వాతంత్ర్యం, బ్రిటీష్, పోర్చుగీస్, ఫ్రెంచ్ వలసపాలకుల నుంచి ప్రజలకు విముక్తి కోసం పోరాటం చేసిందన్నారు. అలాగే తెలంగాణలో నిజాం రాజచరిక, భూస్వామ్య వ్యవస్థ వ్యతిరేకంగా చారిత్రక సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిందని గుర్తు చేశారు. సభకు సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం స్వాగతం పలకగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లా నరసింహారెడ్డి,సీనియర్ నాయకులు ఉజ్జని రత్నాకర్ మల్లేపల్లి ఆదిరెడ్డి , మాజీ ఎంఎల్ ఉజ్జని యాదగిరి రావు, సిపిఐ యాద్రాది భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, హైదరాబాద్ జిల్లా ఎస్.ఛాయాదేవితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కార్యదర్శులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు వేదికపై ఆశీనులైయ్యారు.

### దేశంలోని ఫాసిజాన్ని ఓడించాలి: సురవరం సుధాకర రెడ్డి

సురవరం సుధాకర రెడ్డి మాట్లాడుతూ ఆదర్శవంత మైన, సూత్రబద్ధమైన కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యతను సాధించి, ఈ ప్రాతిపదికనపైన విశాలమైన ప్రజా తంత్ర, వామపక్ష పార్టీల ప్రత్యామ్నాయం ద్వారా దేశంలోని ఫాసిజాన్ని ఓడించాలని సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి పిలుపునిచ్చారు. తద్వారా దోపిడీని నిర్మూలించేందుకు శ్రామిక, రైతులు, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాల న్యాయబద్ధమైన హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కాగా సురవరం సుధాకర్ రెడ్డి మూడు రోజుల క్రితమే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అనార్యోగ కారణంతో ఆయనను నల్లగొండ సభకు వైద్యులు నిలువరించినప్పటికీ సురవరం సుధాకర రెడ్డి నల్లగొండ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాకర రెడ్డి మాట్లాడుతూ పోరుగడ్డ నల్లగొండకు లాల్ సలాం అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు బాగాలేవని, ఉక్రెయిన్ రష్యా, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు జరుగుతున్నాయని, థైలాండ్ చైనా యుద్ధం ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని, వీటితో తమకు సంబంధం లేదని ఇంట్లో కూర్చోవద్దన్నారు. ఇతర దేశాలతో భారతదేశ రాజకీయ సంబంధాలు అంత బాగాలేవన్నారు. దేశంలో పెరుగుతున్న ఫాసిజానికి వ్యతిరేకంగా యువశక్తితతో పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని, ఇలాంటి ఇబ్బందుల్లో కమ్యూనిస్టుల అవసరం ఎక్కువగా ఉన్నదని సుధాకర రెడ్డి అన్నారు. దోపిడీని, ప్రజా సమస్యల పరిష్కారానికి, అన్యాయాలను ప్రతిఘటించేందుకు ఎర్రజండా ఉండాలని తెలిపారు. వంద సంవత్సరాల్లో అడుగుపెడుతున్న భారత కమ్యూనిస్టు పార్టీని మరింత పటిష్టం, బలోపేతం చేయాలని సురవరం సుధాకర్ రెడ్డి సూచించారు.

### శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో పార్టీకి పునరంకింతం కావాలి - చాడ వెంకట రెడ్డి

సిపిఐ చరిత్ర ఘనమైందని, అయితే ప్రస్తుతం పార్టీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో పార్టీకి పునరంకింతం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ పూర్వ వైభావనికి పార్టీ శ్రేణులు మరింత సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభం సందర్భంగా నల్లగొండ కేంద్రంగా నిర్వహించిన బహిరంగ సభ ఓ మైలు రాయిగా నిలువనుందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు సమసమాజాన్ని అందించడమే లక్షంగా మిలిటెంట్ పోరాటాలకు సంసిద్ధం కావాలన్నారు.

### మతోన్మాద పార్టీని నిరోధించడంలో సిపిఐ క్రీయాశీల పాత్ర : పల్లా వెంకట రెడ్డి

తొలుత సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అధ్యక్షపాన్యాసం చేస్తూ 1961 నాటి వరకు కమ్యూనిస్టు పార్టీదే ఈ దేశంలో కీలక పాత్రగా ఉండేందని, పార్టీ చీలిన తర్వాత కొంత బలహీన పడిందన్నారు. అయినప్పటికీ అనేక ఆటుపోట్లు ఎదుర్కొంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ నిత్యం ప్రజల కోసం ప్రయాణాన్ని సాగిస్తున్నామన్నారు. కమమ్యూనిస్టు పార్టీ బలహీనపడినప్పటికీ గతంలో ఉన్న టిడిపి, టిఆర్ ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలు కమ్యూనిస్టులు బలహీనమవ్వడం దేశానికి నష్టమని ఆయన పేర్కొన్నారు. మతోన్మాద పార్టీని నిరోధించడంలో సిపిఐ క్రీయాశీల పాత్ర పోషిస్తున్నదన్నారు. బిజెపిని నిరోధించడానికి కమ్యూనిస్టులు బలంగా ఉండాలని అందరూ ఆకాంక్షిస్తున్నారన్నారు. గతంలో కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్ అభ్యుదయవాదులను బలపరస్తూ, అభివృద్ధి నిరోధకులను ఎండగట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇందిరాగాంధీ 20 అంశాలతో అధికారంలోకి రావడానికి సిపిఐ విస్తృత ప్రచారం చేయడం ద్వారా అభివృద్ధి నిరోధకులను నిరోధించామని చెప్పారు. శాస్త్రీయ సోషలిజం, కమ్యూనిజం రావాలని, ఎత్తిన జెండాను దించకుండా ముందుకు సాగుతున్నామన్నారు.

సభలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, ప్రధాన కార్యదర్శి నేదూనూరి జ్యోతి, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కె.కాంతయ్య, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద, ఎఐఎస్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా పాల్గొన్నారు.



# దేశాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేసిన

# గొప్ప ఆర్థికవేత్త



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

ఈనెల 26న కన్నుమూసిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు నివాళులు అర్పించేందుకు తెలంగాణ అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా సమావేశమైంది.. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను సభ గుర్తు చేసుకుంది. మన్మోహన్ తీసుకువచ్చిన కొన్ని చట్టాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడంతోపాటు.. నీతి, నిజాయితీ గల నాయకుడు అంటూ ప్రశంసించింది.. తెలంగాణ అసెంబ్లీ ప్రతేక సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.. మాజీ ప్రధాని మన్మోహన్‌కు తెలంగాణ ప్రజలు ఎప్పుడూ రుణపడి ఉంటారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.. ఆయనకు సంతాపం తెలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్‌కు భారత రత్న ఇవ్వాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తీర్మానానికి బీఆర్ఎస్ మద్దతు తెలిపింది.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని ప్రపంచంతో పోటీపడేలా చేసిన గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ అంటూ కొనియాడారు. మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరిలూదారని సీఎం వివరించారు. మన్మోహన్ సింగ్ ఎల్‌పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ''మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. తెలంగాణ ప్రజలు మన్మోహన్‌కు రుణపడి ఉంటారని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మాజీ ప్రధాని మన్మోహన్‌తో తెలంగాణకు ఉన్న బంధం ఎప్పటికీ మరిచిపోలేనిదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తుండేలా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. సభ్యుల సూచన మేరకు అవసరమైతే మరో చోటకు మారుస్తామంటూ పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం, ఆర్టీఐ చట్టం మన్మోహన్ సింగ్ ఘనత అని ప్రశంసించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారన్నారు.

**ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు..**

సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు.

**ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం**

2013లో భూసేకరణ చట్టం తెచ్చి నిరుపేదలకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగుతున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను 2 సభల్లో పాస్ చేయించిన సారథి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసింది: భట్టి విక్రమార్క**

మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలిపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు, సామాజిక పరిస్థితి అర్థం చేసుకుని చట్టాల ద్వారా ప్రజల్లో ధైర్యం నింపారన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని చెప్పారు. పాలనాపరమైన అంశాలను సామాన్యుడూ తెలుసుకునేలా 2005లో ఆర్టీఐ తెచ్చారని గుర్తుచేశారు. ఆయన తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసిందని పేర్కొన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని భట్టి విక్రమార్క చెప్పారు.

**రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్: మంత్రి ఉత్తమ్**

మన్మోహన్ సింగ్ హయాంలోనే విప్లవాత్మక భూసేకరణ చట్టం వచ్చిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ''దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్ సింగ్. సోనియా గాంధీ సూచనల మేరకు ఆయన గొప్ప చట్టాలు తెచ్చారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నవారు జవాబుదారీగా ఉండాలని సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారు. ప్రజల సొమ్ముతో చేసిన పనుల వివరాలు తెలుసుకొనే హక్కు దీని ద్వారా లభించింది. ఆకలి చావులు ఉండకూడదని ఆహార భద్రత చట్టం తెచ్చారు'' అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

**దేశాభివృద్ధికి అనేక గొప్ప విధానాలు తెచ్చారు: మంత్రి శ్రీధర్‌బాబు**

దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు. గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

**సింపుల్ లివింగ్.. హైథింకింగ్‌కు మన్మోహన్ పర్యాయపదం: కేటీఆర్**

ప్రధానిగా, కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మన్మోహన్ గొప్పతనం, సామర్థ్యాన్ని తొలిసారి గుర్తించింది తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని గుర్తుచేశారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

''పీవీ నరసింహారావు ప్రధాని ఆయన ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధం లేని ఆర్థికవేత్త అందుబాటులో ఉన్నారని గుర్తించి మన్మోహన్‌ను ఆర్థికశాఖకు మంత్రిగా నియమించారు. పీవీ నాయకత్వం, మన్మోహన్ సిద్ధాంతాలతో దేశంలో సమూల సంస్కరణలు, విప్లవాత్మక మార్పులను వచ్చాయి. సింపుల్ లివింగ్.. హైథింకింగ్ అనే మాటకు మన్మోహన్‌సింగ్ పర్యాయపదం. అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజాస్వామిక నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఫలించాలని కోరుకున్నారు**

మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే కేసీఆర్ ఆయన క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. మంత్రిత్వ శాఖ విషయంలో ఓ సమస్య వచ్చింది. మన్మోహన్ కేసీఆర్‌కు షిప్పింగ్ శాఖ కేటాయిస్తే భాగస్వామ్య పక్షంగా ఉన్న డీఎంకే నేతలు అభ్యంతరం తెలిపారు. ఆ శాఖ ఇస్తామని తమకు మాటిచ్చారన్నారు. దీంతో కేసీఆర్ ఒక్క క్షణం కూడా సంకోచించకుండా ఆ పోర్ట్ ఫోలియోను వదులుకున్నారు. తాను వచ్చింది పదవుల కోసం కాదని.. తెలంగాణ కోసమని చెప్పారు. ఆ సమయంలో మన్మోహన్ కేసీఆర్‌తో మాట్లాడారు. ఏ రాష్ట్రం కోసం వచ్చారో.. అది ఫలించాలని మనసారా కోరుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల పోరాటస్ఫూర్తితో మన్మోహన్ నాయకత్వంలోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగింది. దాన్ని మరిచిపోం. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా సంస్కరణల బాట నుంచి మన్మోహన్‌సింగ్ వెనక్కి తగ్గలేదు. ఎన్ని రకాలుగా ఆయన్ను అవమానించే ప్రయత్నం చేసినా ఆయన తొణకలేదు.

**పీవీకి దిల్లీలో స్మారకం నిర్మించాలి**

దిల్లీలో మన్మోహన్‌కు జరిగిన గౌరవప్రదమైన వీడ్కోలు.. పీవీ నరసింహారావుకు దక్కలేదు. మృతిచెందిన ప్రధానులకు దిల్లీలో స్మారక కట్టడాలు ఉన్నాయి. మన తెలంగాణ బిడ్డకు కేంద్రం సముచిత గౌరవం ఇవ్వాలి. పీవీకి దేశ రాజధానిలో స్మారక కట్టడం నిర్మించాలని సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి'' అని కేటీఆర్ అన్నారు.





## దర్యాప్తు పూర్తిచేశాం.. ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం

**చెన్నై:** తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై అత్యాచారం ఘటన ఆ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఘటనపై దర్యాప్తు జరిపి నిజనిర్ధారణ చేసేందుకు 'జాతీయ మహిళా కమిషన్ నియమించిన నిజనిర్ధారణ కమిటీ ' సోమవారం అన్నా యూనివర్సిటీకి వచ్చి విచారణ జరిపింది. ఉదయం యూనివర్సిటీకి చేరుకున్న కమిటీ సాయంత్రం విచారణ పూర్తిచేసి బయటకు వచ్చింది.అనంతరం కమిటీ సభ్యురాలు మమతా కుమారి మాట్లాడుతూ.. తాము విచారణ పూర్తిచేశామని, నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఆ తర్వాత నివేదిక జాతీయ మహిళా కమిషన్‌కు చేరుతుందని, తదనంతరం బాధితులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. విచారణలో భాగంగా కమిటీ యూనివర్సిటీ అధికారులను, బాధితురాలిని, బాధితురాలి కుటుంబాన్ని, ఎన్జీవోలను ప్రశ్నించింది. కాగా, అన్నా యూనివర్సిటీలో సెకండియర్ చదువుతున్న విద్యార్థినిపై ఈ నెల 23న ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి క్యాంపస్ వెనుకవైపు ఏకాంతంగా ఉన్న సమయంలో నిందితుడు అక్కడికి వెళ్లి వారిని వీడియో తీశాడు. బాధితురాలి స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటచెబితే వీడియో బయటపెడుతానని బ్లాక్‌మెయిల్ చేశాడు. అయినా బాధితురాలు భయపడకుండా తన స్నేహితుడితో కలిసి ఘటన గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతున్నది. నిందితుడికి నేర చరిత్ర ఉన్నదని, గతంలో కూడా అతను ఇలాంటి చర్యలకు పాల్పడ్డాడని, అయితే పరువుపోతుందన్న భయంతో ఎవరూ విషయాన్ని బయటికి చెప్పుకోలేదని పోలీసుల దర్యాప్తులో తేలింది.

## సీఆర్‌పీఎఫ్ నూతన డీజీగా వితుల్ కుమార్

**ఢిల్లీ:** సీనియర్ ఐపీఎస్ అధికారి వితుల్ కుమార్ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం సీఆర్‌పీఎఫ్ డీజీగా పనిచేస్తున్న అనీష్ దయాల్ సింగ్ మంగళవారం పదవీ విరమణ చేయనుండటంతో.. ఆయన స్థానంలో వితుల్ కుమార్‌ను నూతన డీజీ నియమించారు. వితుల్ కుమార్ 1993 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన సీఆర్‌పీఎఫ్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. 1988 బ్యాచ్ మణిపూర్ క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన అనీష్ దయాల్ సింగ్‌ను 2024 డిసెంబర్ 31 వరకు సీఆర్‌పీఎఫ్ డీజీగా నియమించారు. రేపటితో ఆయన పదవీకాలం ముగియనుండటంతో కొత్త డీజీని నియమించారు.

## రూపాయి గురించి స్పందించరేం.. ప్రధానిపై కాంగ్రెస్ విమర్శలు



**దిల్లీ:** రూపాయి విలువ క్షీణతను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. యూపీఏ పాలనలో రూపాయి విలువ పడిపోయినప్పుడు ప్రధాని నరేంద్ర మోదీప్రవర్తించిన తీరును గుర్తు చేసింది. ఇప్పుడు ఈ విషయంలో ఆయన వద్ద ఎటువంటి మాటలు లేవని విమర్శించింది. ''అమెరికా డాలరుతో పోలిస్తే మన దేశ కరెన్సీ రూపాయి విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయి (85.27)కి చేరుకుంది. దీనిపై కేంద్రం స్పందించడం లేదు. 2014లో ఇదే అంశంపై నాడు గుజరాత్ సీఎంగా ఉన్న మోదీ యూపీఏ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. యూపీఏ ప్రభుత్వం దేశ రక్షణ, రూపాయి విలువ గురించి పట్టించుకోవడం లేదని నాడు ఆయన ఆరోపించారు'' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ గుర్తు చేశారు. ''నాడు ఆయన చేసిన వ్యాఖ్యలను మరోసారి గుర్తు చేస్తున్నాం. సంక్షోభాలు వస్తాయి. ఆ సమయంలో ప్రభుత్వం నిస్సహాయంగా ఉంటే సంక్షోభం తీవ్రంగా మారుతుంది. ఇప్పుడు దేశ పాలకులు రక్షణ, రూపాయి విలువ పతనం గురించి ఆలోచించడం లేదు. కేవలం తమ కుర్చీని కాపాడుకునేందుకు మాత్రమే ఆలోచిస్తున్నారు'' అని విమర్శించారు. ''రాజకీయ ప్రయోజనాల కోసం నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. కానీ, ప్రస్తుతం రూపాయి విలువ క్షీణత విషయంలో ప్రధాని మోదీ వద్ద ఎలాంటి మాటలు లేనట్లుగా అనిపిస్తోంది'' అని అన్నారు. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ బిలియన్ల డాలర్ల విదేశీ మారక నిల్వలను వినియోగించిందన్నారు. ఇప్పటివరకు ఎన్ని రూ. వేల కోట్లు ఉపయోగించారని ప్రశ్నించారు.

## జనవరి 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తా: ప్రశాంత్ కిశోర్



**పాట్నా:** బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో గత పది రోజులుగా నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. వీరిపై ఆదివారం పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. లాఠీఛార్జి చేసిన విషయం తెలిసిందే. అభ్యర్థులపై పోలీసుల చర్యలను జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఖండించారు. పేపర్ లీక్‌పై పోరాడుతున్న యువతపై పోలీసులు అనుసరించిన వైఖరి సరికాదని వ్యాఖ్యానించారు. పోలీసుల చర్యలకు నిరసనగా జనవరి 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని ప్రకటించారు.

**లాఠీఛార్జి జరిగినప్పుడు మీరు ఎక్కడికి వెళ్లారు?**

కాగా ఆదివారం రాత్రి పోలీసులు విద్యార్థులపై లాఠీఛార్జి చేస్తున్న సమయంలో ప్రశాంత్ కిశోర్ అక్కడినుంచి వెళ్లిపోతునన్నట్లుగా పలు వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో విద్యార్థులకు, ఆయనకు మధ్య వాగ్వాదం నెలకొంది. తమపై పోలీసులు లాఠీఛార్జి చేసేటప్పుడు అక్కడ ఉండకుండా ఎందుకు వెళ్లిపోయారని అభ్యర్థులు ఆయనను ప్రశ్నించారు. నిరసన ప్రాంతం నుంచి ప్రశాంత్ కిశోర్ వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ.. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా విద్యార్థులు తనపై చేసిన ఆరోపణలను ప్రశాంత్ కిశోర్ ఖండించారు. వారి ఉద్యమానికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పోలీసులు లాఠీఛార్జి చేస్తుండడంతో విద్యార్థులను అక్కడినుంచి వెళ్లాలని సూచిస్తూ తాను మరో చోటికి వెళ్లానన్నారు.

## ఏపీలో ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

**విశ్వంభర, అమరావతి:** అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలోని మరో హామీని నెరవేర్చే దిశగా ఏపీ ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే దిశగా చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు పలువురు ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు కీలక చర్చలు జరుపుతున్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి, డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీఎండీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం అంశంపై తీసుకుంటున్న చర్యలపై సీఎం ఆరా తీశారు. ఈ విధానం అమల్లో ఉన్న కర్ణాటక, దిల్లీ, తెలంగాణ రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తామని అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను వీలైనంత త్వరగా అందజేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఉగాది నాటికి పథకం అమల్లోకి తెచ్చేలా పనులు వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు.

## ఎర్ర జెండాలన్నీ ఏకమవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేశారు. అధికారం కోసం అడ్డదారి తొక్కాల్సిన అవసరం కమ్యూనిస్టులకు లేదని, స్వచ్ఛందంగా పార్టీ కోసం నిత్యం ప్రజల మధ్య ఉంటూ, పార్టీ బలోపేతానికి రోజుకు ఒక గంట కష్టపడాలని సాంబశివరావు సూచించారు. పేదలు, ఇబ్బందులు, సమస్యల వద్దకే కమ్యూనిస్టులు వెళ్లాలని, తల్లిని మన గండెల్లో ఎలా పెట్టుకుంటామో, అలాగే కమ్యూనిస్టు పార్టీని కూడా తమ గుండెల్లో పెట్టుకుని పార్టీని పెంచి పోషించాలని తెలిపారు. భూమిపై సూర్య,చంద్రలు ఉన్నంత వరకు కమ్యూనిజం ఉంటుందని, అమరుల రక్తతర్పణంలో ఎరుపెక్కిన అరుణ పతాకం రెపరెపలాడుతూనే ఉంటుందని కూనంనేని సాంబశివరావు చెప్పారు. కమ్యూనిస్టు చరిత్రే దేశ చరిత్ర అని, దేశ చరిత్ర నుంచి కమ్యూనిస్టు చరిత్రను విడదీయడం సాధ్యం కాదని సాంబశివరావు అన్నారు. అనేక కేసులు, నిర్బంధాలను ఎదిరించి, దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ఉద్యమించింది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది అమరులైతే, ఇందులో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే మూడు వేల మంది ఉన్నారన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల కంటే మేధావులు ఉన్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని చెప్పారు. సురవరం సుధాకర్ రెడ్డి, గిరిప్రసాద్ లాంటి మేధావులు, ధైర్యవంతులు ఏ రాజకీయ పార్టీలో ఉన్నారని ఆయన ప్రశ్నించారు. అధికారం కోసం తాము గడ్డి తినబోమని, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అంతరాలు లేని సమాజమే కమ్యూనిస్టు పార్టీ లక్షమని, ఓట్లు, సీట్లతో తమకు సంబంధంలేదని అన్నారు. కమ్యూనిస్టులు ఎక్కడున్నారని ప్రశ్నిస్తున్న వారు ప్రస్తుతం ఏ రాజకీయ పార్టీలో ఉన్నారని, ఇంతకు ముందు ఏ రాజకీయ పార్టీలో ఉన్నారని, భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలో ఉంటారో కూడా వారికే తెలియదని కూనంనేని సాంబశివరావు ఎద్దేవా చేశారు. జనతాపార్టీ లాంటి అనేక రాజకీయ పార్టీలు వచ్చి, కనుమరుగయ్యాయని, కొన్ని పార్టీలకు పక్షవాతం సోకి, ఒకే రాష్ట్రానికి పరిమితమయ్యాయని , కానీ ఎర్ర జెండా ప్రపంచ వ్యాప్తంగా రెపరెపలాడుతోందని కూనంనేని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ అంటే ఒక పెద్ద కుటుంబం అని, ధైర్యం, త్యాగం, పోరాటం,అన్నింటికి సింబల్ ఒక సంపూర్ణ మనిషి అంటేనే కమ్యూనిస్టు అని అన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టులేనని ఆయన అన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారి**



**విశ్వంభర, మహబూబాబాద్:** ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. వీరబ్రహ్మాచారి అన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మాచారి సోమవారం ఉదయం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం ఆదేశాలను జారీ చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా నెల్లికుదురు మండలం మదనతుర్తి గ్రామానికి చెందిన బి.రజిని కుమార్, తాను నిరుపేద కుటుంబానికి చెందిన వాడను అని ఏదైనా ఉపాధి అవకాశం కల్పించాల్సిందిగా దరఖాస్తు చేశారు. మహబూబాబాద్ పట్టణంకు చెందిన గాండ్ల ముత్తయ్య, తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నారు. ఇనుగుర్తి మండలం, చిన్న ముప్పారం గ్రామానికి చెందిన దేవి, తనకు రుణమాఫీ వర్తింపచేయాలని దరఖాస్తు చేసుకున్నారు. మహబూబాబాద్ మండలం, రెడ్యాల గ్రామం కు చెందిన సిహెచ్ లింగం, ఉషాన్, లు గ్రామ పరిధిలో ఉన్న రైస్ మిల్లుల వ్యర్థాల వలన తమ వ్యవసాయ భూములలో వ్యవసాయం చేయడం కష్టంగా ఉందని చర్యలు తీసుకోవాల్సిందిగా దరఖాస్తు చేశారు. ఇలా వివిధ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 104 దరఖాస్తులు వచ్చాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డీసీఓ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో పురుషోత్తం, డీ ఆర్ డీ ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఈఓ రవీందర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, డీవీహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డీహెచ్ఓ మరియన్న, డిడి గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవం



**విశ్వంభర, లిబర్టీ హైదరాబాద్:** ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లిబర్టీ ప్లాజా ఆఫీసు లో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగులకు సన్మానం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐపీసీ నేషనల్ ప్రెసిడెంట్ కె బి శ్రీధర్, వకులభరణం కృష్ణమోహన్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ నరాగౌని వెంకటయ్య, గంధం రాములు, ఉదయ లక్ష్మి, పద్మిని, సుధాకర్, చిత్ర, అంజలీదేవి, మాధవి, అనితా, నాగేందర్ గుప్త, నవీన్ గుప్త, వెంకటేష్ గుప్త పాల్గొన్నారు.

## రెజ్లింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన తోట సంకీర్తన్ యాదవ్



**విశ్వంభర, ఎల్బీనగర్:** సీనియర్ సౌత్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్షిప్ లో సిల్వర్ మెడల్ సాధించిన తోట సంకీర్తన్ యాదవ్ జై భవాని వ్యాయమశాల గొల్లకిడికి అర్జున్ పైల్వాన్ ఉస్తాద్ నుండి చైతన్యపురి డివిజన్ కి చెందిన తోట సంకీర్తన్ యాదవ్ తెలంగాణలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్ పొంది తెలంగాణ నుండి సీనియర్ సౌత్ ఇండియన్ నేషనల్ రెజ్లింగ్ చాంపియన్షిప్ కు ఎంపికయ్యారు. అందులో 67 కేజీల గ్రీస్ రోమన్ విభాగంలో పోటాపోటీగా జరిగిన పోరులో సంకీర్తన్ సిల్వర్ మెడల్ సాధించాడు. చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్ కుమారుడు కావడంతో కుటుంబ సభ్యులు అందరూ ఆనందం వ్యక్తం చేశారు. తోట సంకీర్తన్ యాదవ్ ఇలాగే మరిన్ని పోటీల్లో విజేతగా నిలుస్తూ భవిష్యత్తులో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## మెగా హెల్త్ క్యాంపు అన్నప్రసాదంలో పాల్గొన్న ఉప్పల



**విశ్వంభర, ఎల్బీనగర్:** అమావాస్య సందర్భంగా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమావాస్య అన్నప్రసాద కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈసందర్భగా అన్ని దానాల కన్న అన్నదానం గొప్పది అని ఆయన అన్నారు. అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా ఆర్య వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు పాండు గుప్త, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రమేశ్, కోశాధికారి శ్రవణ్, ప్రధాన కార్యదర్శి పబ్బా శేఖర్, కటకం శ్రీనివాస్, ఐ వీ ఎఫ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాచం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# రెమ్యునరేషన్ చెల్లించాలి

- ఎస్ఎస్ఏ సమ్మె విరమింపజేయాలి
- టీపీటీఎఫ్ ఎంపీడీఓకు వినతి



**విశ్వంభర, నెల్లికుదురు:** కులగణన సర్వేలో పాల్గొన్న ఎన్యుమరేటర్లకు రెమ్యునరేషన్ చెల్లించాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు తీర్చి సమ్మె విరమింపచేయాలని కోరుతూ టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో బాలరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ మండలాధ్యక్షులు వై.యాకయ్య మాట్లాడుతూ.. గణనపూర్తై నెల కావొస్తున్నప్పటికీ రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం విడ్డూరమని, వెంటనే చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో ఎస్ఎస్ఏ ఉద్యోగులు 18 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వేతనాలు పెంచి రెగ్యులర్ చేయాలని 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టమన్నారు. డిమాండ్స్ పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు, సంపత్ కుమార్, కరుణాకర్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



**విశ్వంభర, పాత బస్తీ:** ఆర్యవైశ్య సంఘం లాల్ దర్వాజా గౌలిపుర ఆధ్వర్యంలో గత ఐదు సంవత్సరాలుగా అమావాస్య సందర్భంగా లక్ష్మనేశ్వర స్వామి దేవాలయం శివగంగా నగర్ చత్రినాక పరమ శివునికి రుద్రాభిషేకం గోగ్రసం నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సోమవారం హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు కూర జయరాములు గుప్తా, కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ ఛైర్మన్ చీల రాములు, గుగ్గిల అశోక్ కుమార్, సరాబు విశ్వేశ్వరయ్య, సంఘ అధ్యక్షులు స్వరాభి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి బుగ్గ శ్రీనివాస్ గుప్తా హాజరయ్యారు. గుగ్గిల సంతోష్ కుమార్, శ్రీరంగ సంతోష్ కుమార్, మాజీ అధ్యక్షులు కొరివి వెంకటేష్ గుప్తా, సంఘ సభ్యులు ముక్క శేఖర్, గౌరీశెట్టి విశ్వనాథం, కొత్త నరసింహ, పెద్ద నాగేష్, శివకృష్ణ, మరియు సంఘ సభ్యులు, బస్తీ వాసులు, దేవాలయ కమిటీ సభ్యులు అంతా కలిసి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇరుముడి పూజలో దేప భాస్కర్ రెడ్డి

విశ్వంభర, మహేశ్వరం: కందుకూరు మండలం కొత్తగూడ గ్రామం ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొక్క భూపాల్ రెడ్డి, పందుల వెంకటేష్ గౌడ్, పాండు గౌడ్, శేఖర్ గౌడ్, మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ముత్యం రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సదరం స్లాట్‌ల కోసం మీ సేవా సెంటర్‌లలో బుక్ చేసుకోవాలి

**జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన్ రాజు**

**విశ్వంభర, మహబూబాబాద్:** జనవరి–2025 మాసంలో జరిగే సదరం క్యాంపుల గురించి ఈ రోజు (31 డిసెంబర్ 2024) మధ్యాహ్నం 12:00 గంటలకు అన్ని మీ సేవ సెంటర్లలో స్లాట్లు ప్రారంభమగును. కావున సంబంధిత వారు స్లాట్ బుక్ చేసుకొని వారికి వచ్చిన తేదీన సదరం క్యాంపు జరిగే గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ మహబూబాబాద్ లో హాజరు కాగలరని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూదన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

# వెలమ సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా పద్మనాయక వెలమ అసోసియేషన్ వారి 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని జె.బి. గార్డెన్స్ లో జరగింది. సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ పనకంటి భాస్కర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సిర్పూర్ కాగజ్‌నగర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ లు హాజరై ప్రసంగించారు. ఎమెల్సీ రవీందర్ రావు మాట్లాడుతూ వెలమలు ఎక్కడ ఉన్నా ఇతర కులస్తులను గౌరవించి, సహాయపడే విధంగా ఉంటారన్నారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ వెలమలు ఎక్కడున్నా ధైర్యంగా, సాహసోపేతంగా ఉంటారని, ఇతరులకు సహాయపడే విధంగా ఎంత ఖర్చైనా చేసి మన దగ్గర డబ్బులు లేకున్నా కూడా ఇతరులకు సహాయపడే విధంగా ఉంటారని కొనియాడారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పొనుగోటి కృష్ణారావు, నల్లగొండ వెలమ సంఘం అధ్యక్షులు గోన మోహన్ రావు, ఏకాంబరరావు, మాజీ యంపీటీసీ మదూరి జ్యోతి, పొనుగోటి లోకేశ్వరరావు, సంధినేని ప్రభాకర్ రావు, పెండ్యాల వెంకటేశ్వరరావు, గోన వెంకటేశ్వరరావు, గోన ప్రభాకర్ రావు, గోన శ్రీధర్ రావు, రామలింగరావు పాల్గొన్నారు.

## మధ్యాహ్నా భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీఓ యాకుబ్ నాయక్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఎంపీడీవో బి.యాకుబ్ నాయక్ సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మంచి నాణ్యమైన భోజనాన్ని అందించాలని, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం తయారు చేసి విద్యార్థిని, విద్యార్థులకు అందించాలని తెలిపారు. వీరి వెంట పాఠశాల హెడ్మాస్టర్ విజయ మాధవి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శతాబ్ధి ఉత్సవాల బహిరంగ సభకు భారీగా కదం తొక్కిన కామ్రేడ్స్



**విశ్వంభర, రామన్నపేట:** సీపీఐ 100 సంవత్సరాల శతాబ్ధి ఉత్సవాలకు నల్లగొండలో జరిగే సిపిఐ బహిరంగసభకు వివిధ గ్రామాల కామ్రేడ్స్ భారీగా కదం తొక్కారు. సీపీఐ స్థాపించి 100 ఏండ్లు అయిన సందర్భంగా నల్లగొండ పట్టణంలో రాష్ట్ర స్థాయి బహిరంగ సభను ఏర్పాటు చేసామని, ఈ బహిరంగ సభ సీపీఐ భవిష్యత్తు కార్యాచరణకు వేదిక కాబోతోందని యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నర్సింహ అన్నారు. 100 సంవత్సరాలు ఒక పార్టీ నిలదొక్కుకుంది అంటే, దానికి కారణం సీపీఐ అవలంబించిన నీతి, నిజాయితీతో కూడిన సిద్ధాంతం, క్రమశిక్షణతో కూడిన నాయకులు, కార్యకర్తలేనని, వారు ప్రజల సమస్యల కోసం పోరాడిన విధానం, తీసుకున్న నిర్ణయాల మూలంగానే అని అన్నారు. నల్లగొండ బహిరంగ సభను ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బహిరంగసభకు బయలుదేరిన వారిలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, సీపీఐ సీనియర్ నాయకులు భగవంత, వీరమళ్ళ ముత్తయ్య, పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, రచ్చ యాదగిరి, ఉట్కూరి కృష్ణ, కళ్లెం దశరథ, కళ్ళెం రామచంద్రం, జగన్నాథం, జంపాల అంజయ్య, ఈసం గాలయ్య, ఎర్ర బిక్షపతి, పెండెం రవి, కళ్ళెం యాదగిరి, ఢిల్లి బాబు, పార్వతమ్మ, రుకునమ్మ, అండాలు తదితరులు ఉన్నారు.

# ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధిపై అవగాహన



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించి, ఆవిష్కరణలను ప్రోత్సహించి, భవిష్యత్ నాయకులుగా, వ్యవస్థాపకులుగా వారు ఎదగడానికి మార్గం సుగమం చేసేలా ఇటీవల మూడు కీలకమైన అవగాహన ఒప్పందాలను విడివిడిగా చేసుకుంది. చెన్నా డిజిటల్ సొల్యూషన్స్ (సీడీఎస్), స్ట్రక్చరల్ సొల్యూషన్స్ (ఎస్ఎస్), ఇంక్లైన్ ఇన్వెన్షన్స్ (ఐఐ)లతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. పరిశ్రమలో విశ్వవిద్యాలయ సంబంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ ఎంవోయూలపై సంతకం చేసింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, విద్యార్థులకు ఇంటర్న్ షిప్, ప్లేస్ మెంట్ అవకాశాలను అందించడంపై సీడీఎస్ తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం దృష్టి పెడుతుంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలను మెరుగుపరచి, వారిని ఆయా రంగాలకు తగ్గ నిపుణులుగా తీర్చిదిద్దడానికి స్ట్రక్చరల్ సొల్యూషన్స్ తోడ్పడుతుంది. గీతంలో సిలికార్ కోర్ ఏఐ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఇంక్లైన్ ఇన్వెన్షన్స్ ఏర్పాటు చేస్తుంది. ఇది సిస్టమ్–ఆన్–చిప్ (ఎస్ఓసీ) ప్లాట్ ఫారమ్ లలో కృత్రిమ మేథతో నడిచే వీడియో అనలిటిక్స్, ప్రసార పరిష్కారాలలో ప్రత్యేకత కలిగి ఉంది. మూడేళ్ల పాటు అమలులో ఉండే ఈ ఒప్పందాలపై గీతం రిజిస్ట్రార్ డాక్టర్ డి.గుణశేఖరన్, సీడీఎస్ ఎండీ డి.సత్యనారాయణ చెన్నప్రగడ, ఎస్ఎస్ ఎండీ ఈ.ద్వారకానాథ్, ఐఐ సహ–వ్యవస్థాపకుడు, సీటీవో డాక్టర్ బి.ప్రదీప్ కుమార్ సంతకాలు చేశారు. గీతం ప్రతినిధులు డాక్టర్ దివ్య కీర్తి గుప్తా, ఫక్రుద్దీన్ షేక్, దామోదర్ తదితరులు ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ భాగస్వామ్యాలు విద్య, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడంలో ముఖ్యమైన దశను సూచిస్తున్నాయని, పరిశ్రమ ప్రముఖులతో కలిసి పనిచేయడం ద్వారా గీతం విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు, వాస్తవ ప్రపంచ అనుభవంతో సన్నద్ధం చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ గుణశేఖరన్ పేర్కొన్నారు. ఆవిష్కరణ, వ్యవస్థాపకత, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సన్నద్ధం చేయడం కోసం ఈ అవగాహన ఒప్పందాలు ఉపకరిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తపరిచారు.

## అంబేద్కర్‌ను కించపరిచేలా మాట్లాడడం సరికాదు



**విశ్వంభర, నెల్లికుదురు:** భారతరత్న అంబేద్కర్ ను కించపరిచేలా అమిత్ షా మాట్లాడడం అత్యంత హేయమని వామపక్ష పార్టీల నాయకులు ఇసం పెల్లి సైదులు, పెరుమాండ్ల బాబుగౌడ్, ఆలకుంట్ల సాయిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐఎం న్యూ డెమోక్రసీ, మాస్ లైన్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దూరదృష్టితో అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తూ ఆయనను అవమానించిన అమిత్ షా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో పెరమాండ్ల పుల్లయ్య, ఈర్ల వెంకన్న, కొట్టం వెంకన్న, ఎల్లయ్య, ఆకుల సాయిలు, రామ్ కోటి పాల్గొన్నారు.

# ప్లాట్ల పట్టాలు కలిగినవారికి ఇంటి స్థలాలను చూపాలి



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో 6,7 సర్వే నెంబర్ గల భూమిలో 1998, 1999, 2000 సంవత్సరంలో అర్హులైన గ్రామ ప్రజలకు ప్లాట్ల పట్టాలు అధికారులు ఇచ్చారు. కానీ 2021 వరకు ఎక్కడ ఉన్నాయో స్థలం చూపడం లేదని తాసిల్దార్ కార్యాలయం ముట్టడి చేస్తూ ప్రభుత్వ పై వత్తిడి తీసుకు వస్తే 2023 లో పాత పట్టాలు ఉన్న వారికీ నూతన పట్టలు ఇవ్వడం జరిగింది. 2 సంవత్సరాలు గడిచి, ప్రభుత్వం మారి కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోక వచ్చినా కూడా పట్టుదారులకు ప్లాట్ల స్థలం చూపలేదు. అధికారులు, నాయకులు స్పందించి పట్టాదారులకు న్యాయం చేయాలని మండల బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ రోడ్డు పై ధర్నా చేయడంతో రెండు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడంతో ఎమ్మార్వో ధర్నా వద్దకు వచ్చి అర్హులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో బీజేపీ నాయకులు ధర్నాను విరమించారు. ఇచ్చిన హామీ నిలపెట్టక పోతే పెద్ద ఎత్తున అమరణ నిరాహార దీక్ష కు వెనకాడమని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు తిరుమని రవి గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు శానామాని పాండు, బక్కి కుమార్, నీలకంఠ పాండు, పెరుమాళ్ళ రాజు, పద్మ అనిల్ ముదిరాజ్, శాంతకుమారి యాదయ్య, శేఖర్ రెడ్డి, దుగ్గపురం కుమార్, హరికాంత్, సుదర్శన్, పోతుగంటి మహేష్, లబ్దిదారులు పాల్గొన్నారు.

## ఈ ఏడాది 1500 మంది బాధితులకు అత్యవసర చికిత్స

### సరైన సమయంలో అండగా నిలిచిన కామినేని హాస్పిటల్స్




**విశ్వంభర, ఎల్బీనగర్:** నగరంలో రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు విపరీతంగా పెరుగుతున్నాయని, తమ ఆస్పత్రికే నెలకు సగటున 120 నుంచి 150 కేసుల వరకు వస్తున్నాయని కామినేని ఆస్పత్రి క్రిటికల్ కేర్ నిపుణుడు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 సంవత్సరం మొత్తం మీద సుమారు 1500 నుండి 1600 మందికి పైగా ప్రాణాలను ట్రామా కేసుల నుంచి కాపాడనట్లు తెలిపారు. వీటిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు ఉంటున్నాయని, ఆ తర్వాతి స్థానంలో ఫ్యాక్టరీల్లో జరిగే ప్రమాదాలు, నిర్మాణ ప్రదేశాల వద్ద జరిగేవి, తాడిచెట్ల మీద నుంచి పడిపోయేవి, పొలాల్లో క్రషర్ల కారణంగా జరిగే ప్రమాదాలు ఉంటున్నాయన్నారు. వీటిలో అత్యంత ఎక్కువ వాటా మాత్రం రోడ్డు ప్రమాదాలదేనని ఆయన వివరించారు. గడిచిన సంవత్సరంలో జరిగిన ప్రమాదాలు, ఇతర దుర్ఘటనలు.. వాటికి చికిత్స అందిస్తున్న తీరు, తక్షణ స్పందన అవసరం, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ విభాగం ఇంచార్జి, కన్సల్టెంట్ డా. పి. నవీన్ రెడ్డి, క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డా. శృంగల దేవిజన్ పాల్గొన్నారు.

## ఇరుముడి పూజలో దేప భాస్కర్ రెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం కొత్తగూడ గ్రామం ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి ఇరుముడి కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు బొక్క భూపాల్ రెడ్డి, పందుల వెంకటేష్ గౌడ్, పాండు గౌడ్, శేఖర్ గౌడ్, మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ముత్యం రెడ్డి, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను కొనసాగిస్తాం

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాయితి ప్రభాకర్ రెడ్డి 48 వేలు, నీలం లింగమయ్యకు 60 వేలు, హిమ బిందు సాగరిక కు 19 వేలు చొప్పున సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు అయ్యాయి వాటికి సంబంధించిన చెక్కులను సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. ప్రజలకు ఆమోదయోగ్యమైన సంక్షేమ పథకాలను తప్పకుండా కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ, వరికుప్పల ఆంజినేయులు, అనిల్ కుమార్, మల్లేష్, సురేష్, తదితరులు ఉన్నారు.

## నేటితో ఇందిరమ్మ ఇండ్ల సర్వే ముగింపు



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను సోమవారం ఎంపీడీఓ కుసుమ మాధురి పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తు దారుల నుండి సర్వే అధికారులు సంబంధిత యాప్‌లో పొందుపరుస్తున్న వివరాలను ఆమె పరిశీలించి దరఖాస్తుదారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం హైదరాబాద్ లాంటి దూరప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న దరఖాస్తుదారులంతా 31లోపు తమ గ్రామాలలో సర్వే అధికారులకు సంబంధించిన ధృవపత్రాలు అందజేయాలని సూచించారు. తుది గడువు ముగిసిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ వివరాల నమోదు చేయడం జరగదని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, ఆయా గ్రామాల పంచాయతి కార్యదర్శులు, సర్వే అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# సంతోషాల నడుమ కొత్త సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలి

- శాంతి, భద్రతలకు భంగం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం.
- జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 30, 31 న విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు
- డిసెంబర్ 31 న డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లలో పట్టుబడితే జైలుకే
- మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానిపై కేసులు నమోదు.
- డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్స్ లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదు..
- జిల్లా ఎస్పీ రూపేష్




**విశ్వంభర, సంగారెడ్డి:** నూతన సంవత్సర వేడుకల పేరుతో ప్రజల శాంతి, భద్రతలకు విఘాతం కలిగించడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్.పి సూచించారు. 31 డిసెంబర్ వేడుకలకు సంబంధించి, ఎలాంటి అక్రమ మద్యం రవాణా జరగకుండా ఇప్పటికే వాహనాల తనిఖీలు ప్రారంభించడం జరిగిందని, డిసెంబర్ 31 సాయంత్రం పోలీస్ బృందాలు విస్తృత స్థాయిలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేస్తాయని, పట్టణ ప్రాంతాలు మొదలుకొని గ్రామీణ ప్రాంతాలలో రోడ్లపై తనిఖీలు ఉంటాయని తెలియజేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందన్నారు. నూతన సంవత్సర వేడుకలకు, పార్టీలకు, డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, పెద్ద శబ్దాలతో కూడిన డీజేలు, మైకులు ఏర్పాటు చేస్తే డీజేలను సీజ్ చేసి, సంబధిత వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తీసుకోవడంజరుగతుందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఇట్టి విషయాల్లో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే సంబందిత వాహన, కుటుంబ సభ్యులపై కూడా చర్యలు తప్పవని ఎస్ పీ హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా నిర్వహించుకునే ఎలాంటి కార్యక్రమాలైన తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తూ అనుమతులు తీసుకోవాలని, అలాగే ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్స్ లు ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని, అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

**జిల్లా ప్రజలకు సూచనలు..**

జిల్లా వ్యాప్తంగా 30, 30 ఎ పోలీసు యాక్ట్ అమలులో ఉందని, పోలీసుల ముందస్తు అనుమతిలేనిది, ఎలాంటి సభలు, సమావేశాలు, నైట్ పార్టీలు నిర్వహించరాదు. డిసెంబర్ 31 అర్థ రాత్రి పెద్ద శబ్దాలతో కూడిన డీజేలు, మైకులు, టపాసులు కాల్చి ఇతరులను ఇబ్బందులకు గురిచేయరాదు జిల్లా వ్యాప్తంగా డీజేలు నిషేధం, నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే సీజ్ చేసి, కేసులు నమోదు చేయడం జరుగుతుంది.మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం, వాహనాలు ఇష్టానుసారంగా వేగంగా, సౌండ్స్ చేస్తూ నడిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుంది. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే అట్టి వ్యక్తులపై చట్ట రిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. న్యూఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గంజాయి వంటి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలి, మైనర్లకు మద్యం అమ్మితే షాప్ యాజమానులపై కేసు నమోదు చేయడం జరుగుతుంది.బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవించకూడదు. పైన తెలుపబడిన సూచనలను ఎవరైన ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656739 కు సమాచారం అందించవలసిందిగా సూచించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలన్నారు. గడిచిన సంవత్సరానికి వీడ్కోలు చెపుతూ.. నూతన ఆశయాలతో కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ..ఆనందోత్సాహాలతో, తగిన జాగ్రత్తలతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు

# మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం స్థానిక పాత బస్టాండ్ లోని బ్రహ్మంగారి గుడి ఆవరణలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కన్నెకంటి వెంకటేశ్వరాచారి, మండల విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం అధ్యక్షులు మారోజు అనంతచారిలు మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఇనుప (వెల్డింగ్), కర్ర పని, పనులలో స్థానిక తయారీదారులకి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఇనుముతో లేదా కర్రతో తయారు చేయబడిన తలుపులు, దర్వాజలు, కిటికీలు, మొదలగు వాటికి సంబంధించిన పనులు స్థానిక తయారీదారులకు అప్పగించి, ప్రభుత్వం నిర్ణయించిన ధర తయారీదారుల ఖాతాలో జమ చేసేలా ప్రయత్నం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానికంగా చేతివృత్తులైన కమ్మర, వడ్రంగి, తయారీదారులకు కాకుండా కార్పొరేట్ సంస్థలకు ఈ తయారీని అప్పగించడం వల్ల స్థానికంగా చేతివృత్తుల పైన జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నది. కావున ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు అందించి, ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కాంజోజు శ్రీనివాసాచారి, గంధమల్ల దశరథచారి, ఆకవరం శ్రీనివాసచారి, మారోజు రాఘవాచారి, శానగొండ శ్రవణ్ చారి, కన్నెకంటి ప్రభాకరాచారి, మారోజు వెంకన్న, ఆకవరపు ఉదయ్ కుమార్ చారి,చోల్లేటి నరేష్ చారి, గిన్నెల సాయికుమార్ చారి, పడకంటి నరసింహచారి దేవరకొండ లక్ష్మీపతి, శానగొండ నాగరాజు, కూరెళ్ళ రామకృష్ణ, అక్కినపల్లి ఉపేంద్రచారి, కాంకోజు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

### – డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్



**విశ్వంభర, హసన్‌పర్తి:** ప్రతి నెల నిర్వహించే పౌర హక్కుల దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించి, కులాల మధ్య అసమానతలను తొలగించే విధంగా కులాలకతీంగా భారత రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తు దారుడికి ఇందిరమ్మ ఇండ్లను ఎటువంటి ఆంక్షలు లేకుండా మంజూరి చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుంచు రాజేందర్ కోరారు. సోమవారం మడిపల్లి గ్రామంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) ఫజీల్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ దళితులు తమ సమస్యలను మా దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. గ్రామంలో బాల కార్మికులు,వెట్టి చాకిరి ఉందాఅని,దళిత వాడలలో కరెంటు, మంచినీటి,డ్రైనేజి సమస్య ఉన్నదా అని అదే విధంగా జోగిని, భానమతి గురించి సమావేశంలో అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాల కొసం దరఖాస్తు చేసుకున్న అర్హ్వులందరికి పథకాలను అందిస్తామని అన్నారు. దళిత వాడలో మంచి నీటి సమస్య, ప్రమాదకర ఇనుప కరెంట్ పోల్ సమస్యపై కరెంట్ అధికారులతో మరియు మండల యంపివోకి పోన్ లో సమస్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో భూమి సమస్యలు సాదాబైనామా సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చిన వాటిని క్షేత్ర స్థాయిలో పరిక్షించి పరిష్కార మార్గం చూపుతామన్నారు. దళితులను ఇతర కులాల వారు సమానంగా చూడాలని కులవివక్షత చూపుతే చట్ట రీత్యా నేరమన్నారు. మనషులందరూ సమానమేనని ఆ దిశగా అందరూ అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ ఫజిల్, గ్రామ మాజీ సర్పంచులు కాందారి బాగ్యలక్ష్మి కృష్ణ మూర్తి, చిర్ర సుమలత విజయ్ కుమార్, దళిత వాధి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సందెల రవిందర్, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, ఉప సర్పంచ్ బుర్ర రంజీత్,వార్డ్ సభ్యులు చిట్యాల బాలరాజు, బాల చందర్, రాజు, కిరణ్, పరుశరాములు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పంచాయితి సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో గురు హాస్పటల్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిర కార్యక్రమాన్ని స్థానిక రామన్నపేట ఎస్సై పి.మల్లయ్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, భారతదేశంలో దాదాపు 10 శాతం రక్త కొరత ఉన్నదని దానిని అధిగమించడానికి యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. దేశంలో ప్రతిరోజు 1200 కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రాణాపాయ స్థితిలో వారికి రక్తం చేరవేసే విధంగా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని, అన్నదానం చేస్తే ఆకలి తీర్చుతుందని, అలాగే రక్తదానం చేస్తే ఒకరికి ప్రాణం నిలబడుతుందని, రక్తదానం చేయడం వల్ల అనేక రోగాలు దూరం అవుతాయని, ముఖ్యంగా గుండెపోటు, క్యాన్సర్, రక్తపోటును తగ్గిస్తుందని మానసిక ఒత్తిడి తగ్గిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 40మంది రక్తదాతలుగా గురు హాస్పటల్ నందు రక్తదానం చేయడం జరిగింది. గురు హాస్పిటల్ నిర్వాహకులు కళ్లెం సైదులు, వినయ్, రాంప్రసాద్, మాతృదేవోభవ పితృదేవోభవ వ్యవస్థాపక అద్యక్షులు కుర్మేటి నవీన్ కుమార్, సామాజిక కార్యకర్తలు నోముల యాదగిరి, వేముల సైదులు, మేడి రాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు అవసరం



**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని అమంగల్, కడ్తాల్, మాడుగుల సీఐలు ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి బండి నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. రోడ్లపై కేక్ కటింగ్, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో డీజేలు, సౌండ్ సిస్టంలు వినియోగిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి బృందాలుగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు.న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ ఆంక్షలు విధించింది. వైన్ షాప్లకు రాత్రి 12.00 గంటల వరకు.. బార్లు, రెస్టారెంట్లు రాత్రి 1.00 గంట వరకు మాత్రమే ప్రభుత్వం అనుమతించింది. వెంచర్లలో ఆరుబయట తిరుగుద్దని యువకులు సమయపాలన పాటించాలని, అర్ధరాత్రులు బండ్ల పైన తిరిగి న్యూసెన్స్ క్రియేట్ చేస్తే చాలాన్లు విధిస్తామని పోలీసులు తెలిపారు. 31వ తేదీ రాత్రి 10 గంటల నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేస్తామన్నారు.

## వైభవంగా పత్రీజీ ధ్యాన మహా యాగం



**విశ్వంభర, కడ్తాల్:** పత్రీజీ వీడియో సందేశాలు, సామూహిక వేణు గాణ ధ్యానం, గురువుల సందేశాలు, గురు సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో పత్రీజీ ధ్యాన మహా యాగం కార్యక్రమం వైభవంగా జరుగుతోంది. కడ్తాల్ మండలం అన్మాస్ పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్ లో పత్రీజీ ధ్యాన మహా యాగం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో 10 వరోజు ఉదయం యోగా మాస్టర్ వెంకటేష్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్రీజీ, స్వర్ణమాల పత్రీ వీడియో సందేశం, పరిమళ పత్రీజీ ఆస్ట్రేలియా, కెనడా పిరమిడ్ మాస్టర్లు సందేశాలు ఇచ్చారు. వాణి, రేవతి, రత్నకుమారి, అరుణ్ జ్యోతి, నరేంద్ర ముడల్కర్, పాల్గొన్నారు. మధ్యాహ్నం దీప్తి నాగేళ్ల కుమారి నివేదిత, కూచిపూడి నృత్యం, మిత్ర విద్య నాట్యాలయం సంస్కృతిక కార్యక్రమాలు హెల్త్, స్పిరుచ్యువల్ సైన్స్ విషయంలో పద్మశ్రీ కాదర్ వళి పాల్గొన్నారు. ఇందులో కాస్మిక్ వ్యాలీ, నందవరం ట్రస్ట్, ప్రొద్దుటూరు పిరమిడ్ ఏవి లను ప్రదర్శించారు. మేఘనా హెగ్డే, సంతోష్ కుమార్ శాస్త్రి సందేశాలు ఆహుతులను అలరించాయి. చిన్నారులు, సెలబ్రిటీలు, కళాకారులచే సాంస్కృతి కార్యక్రమాలు రాత్రి దాకా కొనసాగాయి.

## అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

### సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్



**విశ్వంభర, హైదరాబాద్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపరచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలిబండ చౌరస్తా నుంచి చార్మినార్ వరకు నిరసన ప్రదర్శన, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా అహంకారంతో అంబేద్కర్ ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి కేంద్ర మంత్రి పదవి అనుభవిస్తున్న విషయాన్ని మర్చిపోయి అమిత్‌షా దుర్మార్గమైన వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశానికి మనువాద, మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని బీజేపీ కుట్రలు చేస్తున్నదని అన్నారు. కుట్రలో భాగంగానే అంబేద్కర్ ని అవమానపరచారని అన్నారు. భారతదేశంలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, పేదవాళ్లపై దాడులు జరుగుతున్నాయి. అత్యాచారాలు జరుగుతున్నాయని రాజ్యాంగం లేకుండా పోతే ఈ ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని అన్నారు. ఒక కేంద్రమంత్రి అయి ఉండి పార్లమెంట్లో ప్రజా సమస్యలపై మాట్లాడ కుండా మతం పేరుతో దేశ నిర్మాతలను అవమానించడం సిగ్గుచేటని అన్నారు. దానిని వెనుకేసుకొస్తూ అంబేద్కర్ ని అవమానిస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలి అని అన్నారు. అవినీతిపరులకు దేశాన్ని దోచిపెడుతున్న బీజేపీ విధానాలను ప్రజలు తెలుసుకోవాలని అన్నారు. మనువాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన వసరం ఉందన్నారు. దేశంలో దళిత, గిరిజన, మహిళలపై దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోడీని అమిత్ షా వెనుకేసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ తరహా ధోరణులు పెత్తందారీ పోకడలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని. వామపక్ష పార్టీల దేశవ్యాప్త నిరసన భాగంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు విట్టల్, కోటయ్య, మీనా, శ్రావణ్, జిల్లా నాయకులు సత్తార్, కిషన్, శశికళ, కృష్ణ, లతీఫ్, బాబర్ ఖాన్, జంగయ్య, రామ్ కుమార్, యాకూబ్, గులాం నశీర్, అన్వర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**విశ్వంభర, పరిగి:** అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందనీ పరిగి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డి అన్నారు. సోమవారం పరిగి పట్టణంలో గల మార్కెట్ యార్డులో సయ్యద్ పల్లి గ్రామానికి చెందిన చాకలి రాములు కు పరిగి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పరశురాం రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగులపల్లి రామకృష్ణ 38 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని, అనారోగ్యాన్ని గురై ఆసుపత్రిలో చికిత్స పొంది వారి గ్రామానికి వచ్చిన తర్వాత ఆస్పత్రి ఖర్చులను సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం

**– ఆఫ్ కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్**




**విశ్వంభర, బషీర్ బాగ్:** చిత్రపురి కాలనీలో జరిగిన అక్రమాలను అరికట్టడానికి బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఆమ్ ఆద్మీ పార్టీ అండగా నిలుస్తుందని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. చిత్రపురి కాలనీలో జరిగిన అవినీతి అక్రమాలకు సంబంధించి గతంలో కోపరేటివ్ అధికారులుగా పనిచేసిన అందరికీ సంబంధాలు ఉన్నాయని వారందరి మీద చర్యలు తీసుకొని చిత్రపురి కాలనీ వాసులకి ఎవరైతే సభ్యులుగా ఉన్నారో వారందరికీ న్యాయం చేయాలన్నారు. సోమవారం ఫిలిం డైరెక్టర్, ప్రొడసర్, ఫిలిం డివిజన్ ప్రజా నాట్య మండలి కార్యదర్శి మద్దినేని రమేష్ బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ను పార్టీ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ చిత్రపురి కాలనీలో 2005 -2015 మధ్యలో ట్యాంపరింగ్, 129 మార్ఫింగ్ అలాట్మెంట్స్,1055 ఎక్స్ట్రా సభ్యత్వాలు, 250 ఫొటోస్ లేని ఓటర్ల జాబితాలు, కోట్ల రూపాయల కుంభకోణాలు వీటన్నిటిని రౌండ్ టేబుల్ ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పక్షాలను పిలిచి చర్చించి, తప్పనిసరిగా బాధితులకి న్యాయం చేస్తామని అన్నారు.ప్రజలందరికీ వినోదాన్ని పంచి ఇచ్చే కార్మికులకి న్యాయం చేసే వరకు ఆమ్ ఆద్మీ పార్టీ మీ వెంట ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు విజయ మల్లంగి, ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా వీంగ్ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యమున గౌడ్, డాక్టర్ వింగ్ అధ్యక్షురాలు డాక్టర్ లక్ష నాయుడు, పార్టీ అధికార ప్రతినిధి, జావిద్ షరీఫ్ రామన్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీల దుమ్ముతో ఇబ్బందులు




**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం లోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇసుక రీచ్ ల నుండి వందలాది ఇసుక లారీలు మహాదేవపూర్ మీదుగా పట్టణాలకు వెళుతున్న క్రమంలో మండల ప్రధాన రహదారిపై దుమ్ము ధూళి విపరీతంగా లేస్తుండడంతో పాదాచారులు, వాహనదారులు, వ్యాపార సముదాయాల వారు ఇబ్బందులు పడుతున్నారు. లేస్తున్న దుమ్ముతో ఆరోగ్యాలు చెడిపోవడంతో పాటు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా టీజీఎండీసీ ప్రాజెక్టు అధికారి శ్రీరాములు స్పందించి వెంటనే దుమ్ము సమస్య తలెత్తకుండా ఉండేందుకు ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలు కరెంటు సబ్ స్టేషన్ నుండి, పెట్రోల్ పంపు వరకు ట్యాంకర్ ద్వారా నీళ్లను కొట్టి దుమ్ము సమస్య తలెత్తకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

## ఘనంగా అయ్యప్ప ఇరుముడి పూజ



**విశ్వంభర, మేడిపల్లి:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో భజన కార్యక్రమాలతో స్వామివారి ఆటపాటలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యులు కాటపల్లి రాంచంద్రారెడ్డి,నాయకులు దానగళ్ళ యాదగిరి అయ్యప్ప స్వాములతో కలిసి పూజ కార్యక్రమంలో పాల్గొనీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం వారికి పండితులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మాయల మరాఠీలు

**బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**



**విశ్వంభర, వరంగల్:** అభివృద్ధికి మారుపేరు బీజేపీ అని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మాయల మరాఠీ పార్టీలని గంట రవికుమార్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వరంగల్ బస్టాండ్ పేరుతో నయవంచన చేస్తే.. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ అసమర్థతతో బస్టాండ్ నిర్మాణానికి నోచుకోవడం లేదని మండిపడ్డారు. చారిత్రక నగరమైన వరంగల్‌కు బస్టాండ్ నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో వరంగల్ ఆత్మగౌరవ పోరాటం పేరుతో సోమవారం బీజేపీ వరంగల్ బస్టాండ్ ఏర్పాటు ప్రాంతంలో మహా ధర్నా చేపట్టింది. వారు మాట్లాడుతూ రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్‌ను తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సర్కార్ కనీసం వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం లేదంటూ మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రిగా ఉన్నా పట్టించుకోకపోవడం ఆమె అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల ముందు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోట్ల రూపాయలతో కొత్త బస్టాండ్ నిర్మిస్తామంటూ ఇదిగో.. నమూనా బస్టాండ్ అంటూ మాయమాటలు చెప్పి ఉన్నదానిని కూల్చాడని మండిపడ్డారు. ఆ తర్వాత కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదన్నారు. కాకతీయుల ఆర్థిక రాజధానిగా, పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న వరంగల్‌కు కనీసం బస్టాండ్ లేకపోవడం ఏంటని పర్యాటకులు ముక్కుమీద వేలు వేసుకుంటున్నారని వాపోయారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హృదయ్, అమృత్, స్మార్ట్ సిటీ వంటి ఎన్నో పథకాలకు భారీగా నిధులు కేటాయించి వరంగల్‌ను ప్రగతిదారిలో నడిపిస్తుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రం ఓరుగల్లు చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నాయని తీవ్రంగా విమర్శించారు. వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనులు ఒక్కఅడుగు ముందుకు పడకపోయినా ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎందుకు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీలకు ఓట్లు తప్ప వరంగల్ అభివృద్ధిపై కనీస పట్టింపులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల భూముల్ని కబ్జా చేయడంలో సెటిల్‌మెంట్ పనుల్లో ఆ పార్టీల నేతలు బిజీబిజీగా ఉన్నారని, ఇక వారికి ప్రజా సమస్యలు ఏం పడతాయంటూ ఆరోపించారు. ఓరుగల్లు సమగ్రాభివృద్ధి, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం బీజేపీ పాటు పడుతుందన్నారు. ఓరుగల్లు అభివృద్ధి కోసం ఇక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి పాలన.. బీజేపీ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. బీజేపీ అభివృద్ధికి కట్టుబడి ఉందనడానికి నగరానికి కేటాయించిన నిధులే ఇందుకు నిదర్శనమన్నారు. బీజేపీ పనులు చేపడితే ఎలా ఉంటుందో వరంగల్ రైల్వే స్టేషన్ చూస్తే అర్థమవుతుందన్నారు. వరంగల్‌కు బస్టాండ్ లేక.. సరైన బస్సులు రాక రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ప్రయాణికులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ పాపం ముమ్మాటికీ బీఆర్ఎస్, కాంగ్రెస్‌దేనని విమర్శించారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో మాజీ మేయర్ టి రాజేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, గురుమూర్తి శివ, వన్నాల వెంకటరమణ, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు వంగాల సమ్మిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్ రాణా ప్రతాప్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్ జిల్లా పదాధికారులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, డివిజన్, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# సర్పంచ్ పదవికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించండి

**కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన గ్రామ యువత**



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండలం మాటూరు గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ యువ నాయకులు సోమవారం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్ మొదలైన 1995 నుండి 2024 వరకు సుమారు 30 సంవత్సరాలుగా మాదిగలకు రిజర్వేషన్ కల్పించకపోవడం గురించి నల్గొండ కలెక్టరేట్ గ్రీవెన్స్ లో కలెక్టర్ కు మరియు జిల్లా పంచాయితీ అధికారులకు అలాగే స్థానిక త్రిపురారం మండల పరిషత్తు అభివృద్ధి అధికారికి వినతి పత్రాలు అందజేశారు. వర్గ ప్రాతిపదికన ఎస్టీ తరువాత అత్యధిక ఓటర్లు ఉన్న మాదిగలకు రిజర్వేషన్ కల్పించకపోవడం, అలాగే మూడో స్థానంలో ఉన్న బి.సి వర్గం వారికి రిజర్వేషన్ ఇవ్వడం లాంటి అంశాల గురించి వారికి తెలియ పరిచి ఈసారి తప్పనిసరిగా రిజర్వేషన్ కల్పించాలని విన్నవించారు.ఈ కార్యక్రమంలో మాటూరు గ్రామానికి చెందిన యువ నాయకులు కలకొండ శ్రీనివాస్, మడుపు అభిరాం, కలకొండ శివశంకర మల్లయ్య, మడుపు నాగయ్య, కలకొండ పెద్ద యల్లయ్య, వడ్డే యేసు, వడ్డే నాగయ్య, ఇస్రాం సాయికృష్ణ, ఇస్రాం ఉదయ్ కిరణ, గన్నేపాక లక్ష్మయ్య, పడిశల చింటు, మడుపు నాగరాజు పాల్గొన్నారు.

# చేనేత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్ అధ్యక్షతన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో శాసన మండలి సభ్యుడు ఎలగందుల రమణ, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ లు మాట్లాడుతూ చేనేత కార్మిక సమస్యలను పరిష్కారం కోసం తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఐక్య కార్యచరణ కమిటీ ఏర్పాటు చేయాలని ఆత్మహత్యలకు గురై చనిపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నాడు. చేనేత కుటుంబాల చనిపోయిన వారికి ఆర్థిక సహాయం చేయాలని మా వంతు కూడా ఆర్థిక సాయం చేస్తామని ఎలాంటి సమస్యల పైన ఉద్యమించిన వారికి మా మద్దతు పూర్తిగా ఉంటుందని అన్నారు. మా ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఈ ప్రభుత్వంలో కొనసాగించే విధంగా మీరు పోరాడాలని, అదేవిధంగా చేనేత కార్మికులు ఎలాంటి ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. చేనేత పథకాలు అమలయ్యే వరకు ప్రభుత్వం మెడలు వంచే దాకా పోరాడాలి అన్నారు. శాసన మండలి సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘం గతంలో అనేక చేనేత సమస్యలపై పోరాడుతున్నది. అనేక పోరాటాలు చేసి 50 సంవత్సరాలకే చేనేత కార్మికులకు పింఛన్ యివ్వాలని డిమాండ్ చేసి పింఛన్ వచ్చే విధంగా పోరాడినామన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా చేనేత కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేయకుండా పథకాలను అమలు చెయ్యలేదు. కావున గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ఈ ప్రభుత్వం అమలు చేసే విధానం పోరాడాలిని అన్నారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ నరసింహారెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, ముషం నరహరి, చంద్రశేఖర్, వీరన్న, చిక్క దేవదాస్, గణేష్ పాల్గొన్నారు.

# జై కిసాన్ రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**– ఆవిష్కరించిన మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంజీవరెడ్డి**



**విశ్వంభర, మహబూబాబాద్:** కేసముద్రంలో జై కిసాన్ రైతు పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి మార్కెటింగ్ సంఘం లిమిటెడ్ వార్షిక క్యాలెండర్ ను కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి ఆ రైతు సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేకమంది వ్యవసాయంపై ఆధారపడుతున్నారని, కొందరు రైతులు కలిసి సంఘాలుగా ఏర్పాటు చేసుకొని వ్యవసాయాన్ని అభివృద్ధి పదంలో నడపడం చాలా గొప్ప విషయమని అన్నారు.మన రైతులకు అందుబాటులో దేశ ప్రఖ్యాతిగాంచిన వ్యవసాయ మార్కెట్ మన ఈ కేసముద్రం ప్రాంతంలో ఉన్నదని,అట్టి మార్కెట్ రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ,వారు పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర కల్పిస్తూ ముందుకు సాగుతుందని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,రైతు సంఘం నాయకులు,ట్రేడర్లు సమన్వయంతో పనిచేసి రైతును అభివృద్ధి పథంలో పయనించేలా చేయాలని అభిలాషించారు. అలాగే రైతులు కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ను సద్వినియోగం చేసుకొని, తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఛైర్మన్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షులు సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మూల భూలోక రెడ్డి, ప్రధాన కార్యదర్శి గండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి వంగాల కొమ్మల రెడ్డి, కోశాధికారి కొమ్మాల జహిందర్ రెడ్డి, మరియు సంఘం బాధ్యులు మార్తినేని పాపారావు, కొమ్మాల జహిందర్ రెడ్డి, ఆకుల సుధాకర్, కాంతల వెంకట్ రెడ్డి, బొబ్బల మహేందర్ రెడ్డి, బొడ్డు బిక్షం, చెన్నూరి అమరేందర్ రెడ్డి, వేం వీరారెడ్డి, ఎడవెల్లి వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ బహిరంగ సభకు తరలిన సీపీఐ కామ్రేడ్స్



**విశ్వంభర, చారకొండ:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం నాగర్ కర్నూలు జిల్లా చారకొండ మండల కేంద్రం నుండి సీపీఐ జిల్లా నాయకులు డాక్టర్ చిలువేరు శ్రీనివాసులు నాయకత్వంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వార్ల వెంకటయ్య. సీపీఐ కల్వకుర్తి తాలూకా ఇంచార్జి పులిజాల పరశు రాములు. జెల్ల బాలయ్య, మొగిల్ల శ్రీనివాస్, ఎసారం అశోక్, మద్ది నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, నెల్లికుదురు:** నల్గొండలో జరిగే సీపీఐ శత జయంతి ఉత్సవాల భారీ బహిరంగ సభ కు ఆ పార్టీ మండల నాయకులు సోమవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బైసా స్వామి మాట్లాడుతూ సీపీఐ తోనే కార్మిక కర్షక ప్రజా సమస్యలు పరిష్కారమతాయన్నారు. తరలి వెళ్లిన వారిలో తూటి వెంకటరెడ్డి, చిర్ర వెంకన్న గౌడ్, శ్రీరామ్, వెంకటేశ్వర్లు, పద్మ, రఫీ, గంట నాగన్న, కోల ఇత్తారి, సలీం ఉన్నారు.

## ఐదో తరగతి గురుకుల అడ్మిషన్లకు దరఖాస్తు ఆహ్వానం



**విశ్వంభర, మహేశ్వరం:** రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని మహేశ్వరం మండల కేంద్రంలోని జేజే కళాశాలలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతిబాపూలే తలకొండపల్లి రాజేంద్రనగర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శిరీష తెలిపారు. రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలు ఐదవ తరగతి ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష నోటిఫికేషన్ విడుదల అయిందని ఆమె తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులల్లో ప్రవేశం కల్పిస్తారని చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో మెరుగైన విద్యా బోధన ఉంటుందన్నారు. ఆన్లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక సెల్ ఫోన్ నెంబర్ తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు అవుతారని సూచించారు. ఈనెల 21 నుండి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అని వచ్చే ఫిబ్రవరి 2 వరకు చివరి అవకాశం ఉందన్నారు. ఫిబ్రవరి 23 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష రాసే సమయం ఉంటుందన్నారు. విద్యార్థులు దరఖాస్తు కొరకు తమ బర్త్ సర్టిఫికెట్, బోనో ఫైడ్, కులం, ఆదాయం, సర్టిఫికెట్లు ఆధార్, ఫోటో, సంతకంతో కూడిన ఫారం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శిరీష తెలిపారు.

## తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు




**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సంస్థాన్ నారాయణపురం తహసీల్దార్ మామిడి కృష్ణ కు వినతిపత్రం అందజేశారు. మేళ్లచెరువు తండా, నేల్దాంపాడు ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, మండల కేంద్రంలో గల పాత ఎమ్మార్వో ఆఫీస్ శిథిలావస్థకు గురవుతున్నదని దాని మినీ ఫంక్షన్ హాల్ కు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా మండలంలో నెలకొన్న మరికొన్ని సమస్యలను కూడ పరిష్కరించాలని కోరారు. అనంతరం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, మండల సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య,కలకొండ సంజీవ,వీరమళ్ళ యాదయ్య, పల్లె మల్లారెడ్డి, సింగపంగ మల్లయ్య, పందుల యాదగిరి, సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ స్కాలర్స్ స్కూల్లో ట్రెడిషనల్ డే



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్లో సెల్ఫ్ గవర్నింగ్ డే మరియు ట్రెడిషనల్ అండ్ కల్చరల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా చక్కటి అలంకరణతో ఉపాధ్యాయులుగా వివిధ హోదాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సెల్ఫ్ గవర్నమెంట్ డే లో ప్రిన్సిపల్ గా పి వైష్ణవి, కరస్పాండెంట్ గా పవన్ కుమార్, ఛైర్మన్ గా భార్గవి, డైరెక్టర్ గా కిషోర్, ఆరోగ్య శాఖ మంత్రిగా క్రిస్టినా, కలెక్టర్లుగా జి.యుక్తిక, ఆర్ శృతి మొత్తం 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కల్చరల్ అండ్ ట్రెడిషనల్ ఫెయిర్ లో 140 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేవతామూర్తులుగా,జాతీయ నాయకులుగా, డాక్టర్లు గా ఇంజనీర్లుగా, వివిధ వివిధ ప్రాంతాల సాంప్రదాయ దుస్తుల్లో, వివిధ వృత్తుల వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ చుక్క అల్లాజి గౌడ్, డైరెక్టర్ సావిత్రి, కరస్పాండెంట్ సుజాత, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి ఉపాధ్యాయులు చెన్నయ్య గౌడ్, హైమావతి, శ్రీజన్య, మమత, శ్రీశైలం, నవ్య, ఉష, మౌనిక, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబానికి బీఆర్ఎస్ నేతల ఆర్థిక సహాయం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల మండల కేంద్రానికి చెందిన రాయికంటి సాలమ్మ మూడు రోజుల క్రితం మృతిచెందింది. స్థానిక బీఆర్ఎస్ నేతలు వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఇతర నేతలతో కలిసి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున వైస్ ఎంపీపీ రూ. 5,000 లు మరియు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి రూ.5,000 ల చొప్పున వారి కుటుంబానికి 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, రైతు డైరెక్టర్ మంగళ పల్లి నర్సింహ్మా, మాజీ వార్డు సభ్యులు రామచంద్రయ్య, భిక్షపతి నాయకులు చెన్నయ్య, సురేష్, రమేష్, శ్రీరాములు, యాదయ్య, కరుణాకర్, రాఘవ పాల్గొన్నారు.

## సీఎం కప్‌ను సందర్శించిన జంగా రాఘవరెడ్డి



**విశ్వంభర, వరంగల్:** రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలను తెలంగాణ కోకో అసోసియేషన్ అధ్యక్షులు అండ్ తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి సందర్శించారు. ఈ టోర్నమెంట్ లో 33 జిల్లాల పురుషులు మహిళల జట్లు పాల్గొంటున్నాయి అని వరంగల్ జిల్లా డీ.వై.ఎస్.ఓ సత్యవాణి తెలిపారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే మంత్రి కొండా సురేఖ 33 జిల్లాల బాల బాలికల క్రీడలకు అవసరమయ్యే సదుపాయాలను కల్పించినందుకుగాను వారికి తెలంగాణ స్టేట్ కోకో తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోకో సెక్రటరీ కృష్ణమూర్తి గీసుగొండ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పట్టాభి, వరంగల్ జిల్లా కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట శ్యామ్ ప్రసాద్, వరంగల్ జిల్లా డీ.వై.ఎస్.ఓ ఖో ఖో కోచ్ అనిల్ ఫిజికల్ డైరెక్టర్లు పీఇటీ పాల్గొన్నారు.

## మర్రి జనార్దన్ రెడ్డి తండ్రికి ఘన నివాళులు



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ మాజీ శాసనసభ సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తండ్రి మర్రి జంగారెడ్డి ఏకాదశ దినకర్మ సందర్భంగా జనార్దన్ రెడ్డి నివాసంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. తలకొండపల్లి మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, బిఆర్ఎస్వి నాయకులు సిద్ధగొని నరేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని పాఠశాల ప్రహరీలో కలపాలి



**విశ్వంభర, ఉప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాల ప్రహరీకి అనుకొని ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమార్కులు కబ్జా చేసి గుడిసెలను వేస్తున్నారని, దీనిపై స్థానిక కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ ఫిర్యాదు మేరకు అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవిన్యూ అధికారులు పోలీసులు కూల్చివేశారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని వెంటనే పాఠశాల ప్రహరీ గోడతో కలిపి నిర్మాణం చేసి నట్లయితే విద్యార్థులు ఆడుకోవడానికి విశాలమైన ఆటస్థలం ఉంటుందన్నారు. దీంతో ప్రభుత్వం స్థలం కూడా కాపాడబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు.

## ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలు



**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగరవేసి రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ ఎల్ మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నాటి నుండి నేటి వరకు విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండి జావేద్, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్, అశోక రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్, శ్రీమన్, నాగేందర్, ప్రశాంత్ చరణ్, నాయకులు విగ్నేష్, రాజేష్, రజినీకాంత్, సహనా పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో ఉన్నత పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా చక్కటి అలంకరణతో ఉపాధ్యాయులుగా వివిధ హోదాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సెల్ఫ్ గవర్నమెంట్ డే లో ప్రిన్సిపల్ గా పి వైష్ణవి, కరస్పాండెంట్ గా పవన్ కుమార్, ఛైర్మన్ గా భార్గవి, డైరెక్టర్ గా కిషోర్, ఆరోగ్య శాఖ మంత్రిగా క్రిస్టినా, కలెక్టర్లుగా జి.యుక్తిక, ట్రెడిషనల్ ఫెయిర్ కార్యక్రమంలో భాగంగా దేవతా మూర్తులుగా, జాతీయ నాయకులుగా, డాక్టర్లు గా ఇంజనీర్లుగా, వివిధ వివిధ ప్రాంతాల సాంప్రదాయ దుస్తుల్లో, వివిధ వృత్తుల వేషధారణతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ చుక్క అల్లాజి గౌడ్, డైరెక్టర్ సావిత్రి, కరస్పాండెంట్ సుజాత, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి ఉపాధ్యాయులు చెన్నయ్య గౌడ్, హైమావతి, శ్రీజన్య, మమత, శ్రీశైలం, నవ్య, ఉష, మౌనిక, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజి జూనియర్ కళాశాల 11వ ఉత్సవాలు



**విశ్వంభర, హనంకొండ:** హనంకొండ జగతి గార్డెన్స్ రామారం నందు కాళోజి జూనియర్ కాలేజీ 11వ సంవత్సర వార్షికోత్సవాలం కనులపండుగగా కాళోజి యాజమాన్యం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షునిగా కళాశాల ప్రిన్సిపాల్ వైకేసీ అధ్యక్షత వహించ గా, ముఖ్య అతిథిగా యసి. శ్యాం సుందర్రెడ్డి హాజరయ్యారు. అనంతరం గత సంవత్సరం ఉత్తమ ఫలితాలు. సాధించిన, విద్యార్థిని విద్యార్థులును, తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్లు తిరుపతి రెడ్డి, ఈ. అనిల్ రెడ్డి, టి. మధుకర్ రెడ్డి, యం. సతిష్ కుమార్, విద్యార్థిని విదార్థులు పాల్గొన్నారు.

## ఎల్ఓసీ కాపీని అందించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండల పరిధిలోని జానంపేట గ్రామానికి చెందిన బి వెంకటేష్ మోకాలి సర్జరీ కోసం హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రికి సీఎం సహాయనిధి ద్వారా 90 వేల రూపాయల ఎల్ఓసీ కాపీని వెంకటేష్ కు సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అందజేశారు.

## సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు అవసరం

**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవాలని అమంగల్, కడ్తాల్, మాడుగుల సీఐలు ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి బండి నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. రోడ్లపై కేక్ కటింగ్, మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో డీజేలు, సౌండ్ సిస్టంలు వినియోగిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి బృందాలుగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేస్తామన్నారు.

# మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

- నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి
- డీఎస్పీ రాజశేఖర్



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడలో వార్షిక తనిఖీలలో భాగంగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ను డీఎస్పీ రాజశేఖర్ రాజ్ సోమవారం ఆకస్మికంగా తనికి చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పోలీస్ కిట్లులు, కేసు రికార్డుల పరిశీలన,కేసుల పరిశీలన పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన పిదప కేసుల పరిష్కారంలో వన్ టౌన్ స్టేషన్ సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు అని తెలిపారు. అలాగే డీజే ఏర్పాట్లకు ఎలాంటి అనుమతులు లేవు, నూతన సంవత్సర వేడుకలలో భాగంగా మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో 31న తనిఖీలు చేపడతాం, ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు, మిగతా అన్ని షాపుల వారు కూడా షాపులను మూసివేయాలి లేనియెడల కట్టిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు పూర్తిగా పోలీస్ సిబ్బందికి సహకరించాలని తెలియజేశారు.

# మరిపెడ తహసీల్దార్ కార్యాలయం ముట్టడి




**విశ్వంభర, మహబూబాబాద్ జిల్లా:** మరిపెడ మండల కేంద్రంలో యూఎస్ఎఫ్ఐ మరిపెడ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయాన్ని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్ద బోయిన వీరబాబు ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రియంబర్మెంటు స్కాలర్షిప్లు 8 వేలపై కోట్లు చిలుకు వెంటనే విడుదల చేయాలని, సమగ్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కస్తూర్బా గాంధీ విద్యార్థులు విద్య దూరం కాకుండా ప్రభుత్వం విచారణ జరిపి విద్యార్థులకు పాఠాలు బోధించే విధంగా ఏర్పాటు చేయాలని సమ్మె చేస్తున్న ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ బస్టాండ్ పనులు వేగవంతం చేయాలని గర్ల్స్ కాలేజీ, హాస్టల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మోడల్ పాఠశాల ఠాగూర్ కళాశాల బస్టాండ్ సెంటర్ కు వచ్చేటువంటి ఆడపిల్లలను ఆకతాయిలు ర్యాగింగ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వీరబాబు గుర్తుచేశారు. అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నాయకులు అక్షితు,చరణ్, మణికుమార్ మణికృష్ణ ఫర్హాన్,దివ్య,అఖిల, జోష్ణ, శృతి పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణ మన సామాజిక బాధ్యత



**విశ్వంభర, మహేశ్వరం:** రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ట్రాఫిక్ పోలీసులు, చలాన్లు రాస్తున్నారని సీటు బెల్ట్, హెల్మెట్ ధరించటం మంచి పరిణామమే అయినా సామాజిక బాధ్యతగా అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, యువకులకు అవగాహన కల్పించాలని కేఎల్ఆర్ కోరారు. తుక్కుగూడ కార్యాలయంలో 2024కు బైబై చెబుతూ 2025కు స్వాగతం పలికేందుకు ఆసక్తి చూపుతున్న యువతీ యువకులకు పలు సూచనలు చేశారు కే ఎల్ ఆర్. దేశవ్యాప్తంగా 1.70లక్షల మంది ఏడాదిలో ప్రాణాలు కోల్పోగా అందులో యువకులే 60 శాతమంది ఉన్నారని కిచ్చెన్న వెల్లడించారు. తెలంగాణలో ఈ ఏడాదిలో రోడ్డు ప్రమాదాలు 20,702 జరగ్గా 6 వేల 500 మంది ప్రాణాలు కోల్పోయి వేలాది మంది గాయపడ్డారని లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను గౌరవించటం, ట్రాఫిక్ రూల్స్ పాటించటం, స్కూల్ సహా యాక్సిడెంట్ స్పాట్లను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మెట్రో నగరాల్లోనే ఎక్కువ యాక్సిడెంట్స్ అవుతున్నాయని నిద్రలేని, రోడ్డు గుంతలు, పశువులు, పొగమంచు, అతివేగం సహా మద్యం మత్తులో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి చెప్పారు. విధిగా సీట్ బెల్ట్ పెట్టుకోవటం కనీస బాధ్యత అన్నారు. పోలీసులు, రవాణాశాఖ సంయుక్తంగా చేస్తున్న ప్రయత్నాలు, కఠిన నియమ, నిబంధనలు పాటిస్తే వాహనదారులు ప్రమాదాలకు దూరమై కుటుంబాలు సంతోషంగా ఉంటాయని కేఎల్ఆర్ తెలిపారు. 2025లో కొత్త ఆలోచనలతో యువత, పార్టీ నాయకులు భవిష్యత్ లక్ష్యాలు ఏర్పరుచుకోవాలని సూచించారు.

## ప్లాస్టిక్ ను నియంత్రించండి

**– ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య**



**విశ్వంభర, హైదరాబాద్:** నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు సమాజంలో పెద్ద ఎత్తున వస్తూ వ్యవస్థను తీవ్రమైన ఇబ్బందులకు, నష్టానికి గురి చేస్తున్నాయని, వాటిని నియంత్రించే చర్యలు చేపట్టాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య సోమవారం తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్య కార్యదర్శి రవి గుగులోతు ను కలిసి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్థానికంగా నిర్వహించే వారాంతపు సంతల్లో ఈ ప్లాస్టిక్ వినిమయం భయపెడుతోందని, అంతేగాక అనేక మంది చిరువ్యాపారులు పెద్దస్థాయిలో వీటి వాడకాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే అనేక సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన పొల్యూషన్ బోర్డు కార్యదర్శి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారని రంగయ్య తెలిపాడు.

## కాంగ్రెస్ మోసపు హామీలు: బీజేవైఎం



**విశ్వంభర, నెల్లికుదురు:** త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ పార్టీ ప్రజలను మరోసారి మోసం చేయడానికి సంక్షేమ పథకాలు తెరపైకితెస్తోందని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎంపీటీసీ గుగులోతు మదన్లాల్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం ఆ పార్టీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ..మహిళలకు రూ.2500 ఇవ్వలేదని, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అసత్య హామీలను ప్రజలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు వద్ది భవాని ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు నల్లాని పాపారావు, పర్నె ప్రభాకర్ రెడ్డి, తోట రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంధుల క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హన్మకొండ:** హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఆవిష్కరించారు. అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలి లిపిలో క్యాలెండర్ రూపొందించిన అంధ విద్యార్థులను ఎంపీ అభినందించారు. లూయిస్ బ్రెయిలీ 216వ జన్మదినోత్సవం సందర్భంగా జనవరి 4వతేదీన లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాల స్థాపకుడు దివంగత నలివేల కుమారస్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని పాఠశాల నిర్వహకులు, విద్యార్థులు ఎంపీ డా.కడియం కావ్య ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ నలివెల కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని అయ్యప్పకొండమీద వెలసిన అయ్యప్ప స్వామి దేవస్థానంలో మహా పడిపూజ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు జిల్లాలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన ఈ మహా పడిపూజ అయ్యప్ప దేవాలయ తంత్రి రంజిత్, రాజ గురు దేశ్ పాండే ఆధ్వర్యంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాముల శరణు ఘోష మధ్య ఆలయ మెట్లకు మరియు అయ్యప్ప స్వామికి ఘనంగా పూజలు చేశారు. మొదట ఆలయాన్ని విద్యుత్ వెలుగులమధ్య సర్వాంగ సుందరంగా ఆలయాన్ని అలంకరించారు. పడిపూజ సందర్భంగా స్వాముల భజన సంకీర్తనలతో అయ్యప్ప కొండ అయ్యప్ప స్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ మహా పడిపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు, గురుస్వాములు నాగిళ్ల అశోక్, మసున అప్పి, మామిడి శెట్టి యాదగిరి, స్వాములు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లా పోలీసు వార్షిక నివేదిక



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఈరోజు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ విలేకరుల సమావేశం నిర్వహించి జిల్లా పోలీసు వార్షిక నివేదికను వెల్లడించారు. సూర్యాపేట జిల్లా పోలీసు స్నేహపూర్వక పోలీస్ విధానం అవలంబిస్తూ బాధ్యతాయుతంగా పారదర్శకంగా పనిచేస్తూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణలో బాగా కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది బాగా పని చేశామని, పోలీసు నిధుల నిర్వహణలో నేరాల నివారణలో ప్రజలు పౌరుల భాగస్వామ్యమై పోలీసులకు సహకరించారని ఎస్పీ తెలిపారు.

## విశ్వకర్మ మనుమయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని విశ్వకర్మ మనుమయ సంఘము (చేతి వృత్తుల సేవా సంస్థ) నూతన కార్యవర్గాన్ని గౌరవ అధ్యక్షులు విశ్వనాథుల నరసయ్య ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం అధ్యక్షులుగా విశ్వనాథుల బ్రహ్మాచారి, ఉపాధ్యక్షుడిగా విశ్వనాథుల భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథుల రవీందర్, అలాగే కార్యవర్గ సభ్యులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విశ్వనాథుల బ్రహ్మాచారి మాట్లాడుతూ విశ్వకర్మ మనుమయ సంఘం అభివృద్ధికై ముందుకు తీసుకువెళ్లి విశ్వకర్మల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని అన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు తిరిగి అప్పగింత



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ గ్రామానికి చెందిన ఎండీ. ఇంతియాజ్ ఖాన్ వన్ ప్లస్ కంపెనీ మొబైల్ ఫోనును మరియు పెద్దంపేట గ్రామానికి చెందిన మరో వ్యక్తి రియల్ మీ కంపెనీ %జ%-55 మోడల్ మొబైల్ ఫోను ను పోగొట్టుకున్నారు. కాగా మహదేవపూర్ పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి మొబైల్ ఫోను గుర్తించి సోమవారం రోజున వారికి అప్పగించడం జరిగింది.మొబైల్ ఫోన్లను గుర్తించడంలో కృషి చేసిన కానిస్టేబుల్ నాగేంద్ర ప్రసాద్ ను ఎస్ఐ పవన్ కుమార్ అభినందించారు.

## ఫొటో గ్రాఫర్స్ యాదాద్రి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక




**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షులుగా పాలకుర్ల యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శిగా ఎస్కే పాషాను నియమిస్తున్నట్లు జిల్లా కమిటీ నియమక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్స్ సమస్యలపై పోరాడుతామని అన్నారు. ఈ పదవులు అప్పగించినందుకు రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలుపుతూ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ కృషికి తోడ్పడుతామని తెలిపారు.

## ఫాసిజం నిర్మూలన అరవింద్ మెమోరియల్ ఆధ్వర్యంలో సెమినార్




**విశ్వంభర, హైదరాబాద్:** 21వ శతాబ్దంలో ఫాసిజం: కొనసాగుతున్న అంశాలు, నూతన లక్షణాలు, సమకాలీన శ్రామిక వర్గ వ్యూహం అంశంపై జరుగుతున్న అరవింద్ మెమోరియల్ సెమినార్ లో సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు, మేధావులు సమావేశమయ్యారు. నేటి సెషన్‌లో ప్రముఖ సుప్రీంకోర్టు న్యాయవాది కాలిన్ గోన్సాల్వేస్ ప్రసంగించారు. ఫాసిజం ఉత్థానం నేపథ్యంలో చట్టం, న్యాయవ్యవస్థ పరిస్థితుల ప్రశ్నపై గోన్సాల్వేస్ మాట్లాడారు. దేశంలో అణగారిన వర్గాలకు అందుతున్న న్యాయం పై, దానిపై తన అరుదైన అనుభవాల గురించి గోన్సాల్వేస్ వివరించారు. అలాగే, సీపీఐ-ఎంఎల్ రెడ్‌స్టార్ నుండి పీజే జేమ్స్ రాసిన 'భారతదేశంలో ఆర్ఎస్ఎస్ ఫాసిజం, ప్రపంచ నియోఫాసిజం, ఫాసిస్ట్ వ్యతిరేక కార్యాచరణ' అనే అంశంపై ఆర్. మానసయ్య పేపర్ ప్రెసెంట్ చేశారు. రెండవ భాగంలో హైదరాబాద్‌కు చెందిన రాజకీయ కార్యకర్త ఆనంద్ సింగ్ 'భారతదేశంలో ఫాసిజపు ఉత్థానం: మూలం, పరిణామం, ప్రస్తుత దశ, శ్రామికవర్గ ప్రతిఘటనా వ్యూహం' అనే అంశంపై ప్రసంగించారు. ఆస్ట్రేలియా ఆసియా వర్కర్ లింక్స్ (ఏఏడబ్ల్యూఎల్) నుండి జీసేలే అన్నా, రాజకీయ కార్యకర్తలు శివానీ కౌల్, సన్నీ సింగ్, ప్రముఖ కవయిత్రి మరియు రాజకీయ కార్యకర్త కాత్యాయని, విద్యార్థి నికోలాయ్ మెస్సెర్స్మిత్ తమ పేపర్స్ ప్రెసెంట్ చేయనున్నారు. దీనితో పాటు, వివిధ రాష్ట్రాల నుండి అనేక మంది ప్రముఖ కార్యకర్తలు, మేధావులు, రచయితలు, ప్రొఫెసర్లు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. సమాజంలోని మెజారిటీ ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్ళపై వామపక్ష మేధావి, రాజకీయ కార్యకర్త అరవింద్ సింగ్ స్మృతిలో అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ సెమినార్లు నిర్వహిస్తుంది.

## కేజీబీవీల్లో విద్యార్థులకు ఆన్లైన్ తరగతులు



**విశ్వంభర, మహబూబాబాద్:** కేజీబీవీల్లో ఆన్లైన్ తరగతులు ఇంటర్ ఆక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డ్స్ లో నిర్వహిస్తున్నాం అని అదేవిధంగా మహిళా కానిస్టేబుల్లతో రాత్రి పూట భద్రత కల్పిస్తున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగులు గత 20 రోజులుగా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి జిల్లాలోని కేజీబీవీలలో రాత్రి పూట మహిళా కానిస్టేబుల్లతో భద్రతను ఏర్పాటు చేశామని డీఈవో ఏ రవీందర్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ డైరెక్టరేట్ నుంచి విద్యార్థులకు ఆన్లైన్ క్లాసులు ప్రారంభించేందుకు జిల్లాలోని 15 కేజీబీవీలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు నష్టపోకుండా ఎంఈఓలు, జెండర్ ఈక్వాలిటీ కోఆర్డినేటర్ క్వాలిటీ కోఆర్డినేటర్, డీఎస్ఓ అప్పారావు నిరంతరం కృషి చేస్తున్నారు.

# డబుల్ ఇంజిన్ పాలనలో యువతపై డబుల్ దౌర్జన్యాలు: ప్రియాంక గాంధీ

**ఢిల్లీ:** బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. వారిని అడ్డుకోవడానికి పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తీవ్రంగా ఖండించారు. డబుల్ ఇంజిన్ పాలనలో యువతపై డబుల్ దౌర్జన్యాలు చేస్తున్నార న్నారు. ఈ చలిలో విద్యార్థులపై జలఫిరంగులు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంఅమానుషమని ఆవేదన వ్యక్తంచేశారు. బిహార్‌లో మూడు రోజుల వ్యవధిలో ప్రభుత్వం రెండుసార్లు విద్యార్థులను చిత్రహింసలకు గురిచేసిందని మండిపడ్డారు. పరీక్షల్లో అవినీతి, రిగ్గింగ్‌లు, పేపర్ లీక్‌లను అరికట్టడం తమ బాధ్యత అనే విషయం మరిచిపోయిందన్నారు. తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడుతుంటే సహించలేక వారిని అణచివేయడానికి ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు.

**అభ్యర్థులపై పోలీసుల చర్య బాధాకరం..**

బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వియాదవ్ మాట్లాడుతూ.. అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా బాధాకరమని అన్నారు. "బీపీఎస్సీ అభ్యర్థులపై పోలీసుల చర్య చాలా దారుణం. చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. బయటకు వచ్చిన వీడియోలను చూస్తుంటే వారెంత బాధను అనుభవించారో అర్థమవుతోంది" అని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఇది నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణ..**

ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఈ సంఘటనను నిరంకుశ ప్రభుత్వ నియంతృత్వానికి ఉదాహరణగా అభివర్ణించారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న యువతతో పోలీసులు క్రూరంగా ప్రవర్తించడం ప్రభుత్వ నియంతృత్వాన్ని మరోసారి ప్రజలకు తెలియజేసిందని అన్నారు. విద్యార్థిగా ఎన్నో ఉద్యమాలు చేసి.. సీఎం స్థాయికి ఎదిగిన నీతీశ్ కుమార్ ప్రభుత్వంనుంచి ఈ ప్రవర్తనను తానెప్పుడూ ఊహించలేదని అన్నారు. విద్యార్థులతో అధికారులు చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు.బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ)ల్లో అవకతవకల విషయంలో ఆదివారం వేలాదిమంది అభ్యర్థులు పట్నాలోని గాంధీ మైదాన్ వద్ద నిరసనకు దిగారు. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విద్యార్థులకు పూర్తి మద్దతును ప్రకటించారు. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అభ్యర్థులను పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో కిశోర్‌తోపాటు పలువురు విద్యార్థులపైనా పోలీసులు కేసులు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు.



# అర్చకులకు నెలకు రూ.18వేల గౌరవ వేతనం ఢిల్లీ ఎన్నికల వేళ కేజ్రీవాల్ వరాల జల్లు




**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కీలక ప్రకటన చేశారు. ఆలయాలు, గురుద్వారాల్లో పని చేసే పూజారులు, గ్రంథీల కోసం కొత్త పథకాన్ని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే.. వారికి నెలకు రూ.18వేలు గౌరవ వేతనంగా అందజేస్తామని పేర్కొన్నారు."వారు మన ఆచారాలను భవిష్యత్ తరాలకు అందజేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. నిస్వార్థంగా సేవ చేస్తున్నారు. దురదృష్టవశాత్తూ వారి ఆర్థికస్థితిని ఎవరూ పట్టించుకోవడం లేదు" అని ఈ సందర్భంగా కేజ్రీవాల్ అన్నారు. ఈ పథకం రిజిస్ట్రేషన్ రేపటినుంచి ప్రారంభం అవుతుందని చెప్పారు. హనుమాన్ ఆలయంలో తానే ఈ ప్రక్రియను ప్రారంభిస్తానని చెప్పారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంతరాలు కలిగించొద్దని భాజపాను కోరారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయాల పరంపరను కొనసాగించాలని పట్టుదలతో ఉన్న కేజ్రీవాల్ వరుస సంక్షేమ పథకాలను ప్రకటిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే.. వృద్ధుల కోసం సంజీవని స్కీమ్, మహిళా సమ్మాన్ యోజన (పద్దెనిమిదేళ్లు దాటిన ప్రతి మహిళకు నెలనెలా రూ.2,100 ఆర్థికసాయం), ఇప్పుడు అర్చకులకు గౌరవ వేతనం వంటి హామీలు ఇచ్చారు.

# నా కాళ్లు పట్టుకుంటే పనులు కావు ఆసక్తిగా మారిన కేంద్ర మంత్రి హెచ్చరిక



**భోపాల్:** కేంద్ర మంత్రి ఒకరు తన కార్యాలయం ముందు పెట్టిన బోర్డు ఆసక్తిగా మారింది. కాళ్లు పట్టుకుంటే పని కాదంటూ తనదైనశైలిలో హెచ్చరిక చేశారు. ఇంతకీ ఆ మంత్రి పేరు వీరేంద్రకుమార్ . కేంద్ర సామాజిక న్యాయం, సాధికారికత శాఖ బాధ్యతలు చూస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని టికంగఢ్‌లోని తన కార్యాలయం బయట వీరేంద్రకుమార్ ఒక బోర్డు ఏర్పాటుచేశారు. "కాళ్లు పట్టుకోవడం పూర్తిగా నిషిద్ధం. అలా చేసేవారికి ఎలాంటి పనులు జరగవు" అని దానిపై రాయించారు. కాళ్లు పట్టుకోవడాన్ని గౌరవానికి గుర్తుగా భావిస్తుంటారు. ఈ తరుణంలో ఆయన చేసిన హెచ్చరిక ప్రత్యేకంగా నిలిచింది. ఆ ఆఫీస్‌కు వచ్చేవారు ఈ బోర్డును ఆసక్తిగా గమనిస్తున్నారు.తొలినుంచి వీరేంద్రకుమార్ సాదాసీదాగానే జీవిస్తున్నారు. తన నియోజకవర్గానికి వచ్చినప్పుడు ఇంటి నుంచి కలెక్టరేట్‌కు నడుచుకుంటూనే వెళ్తుంటారు. మార్గమధ్యలో స్థానికులను పలకరించుకుంటూ ముందుకువెళ్తుంటారు. ఈ వ్యవహారశైలే రాజకీయ జీవితంలో ఆయనకు ఓటమే లేకుండా చేసింది. 1996లో వీరేంద్ర రాజకీయ ప్రయాణం ప్రారంభమైంది. తొలిసారి సాగర్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. 2009లో టికంగఢ్‌కు మారిన ఆయన తన విజయాల పరంపర కొనసాగించారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# విమానయాన చరిత్రలో చీకటి నెలగా డిసెంబర్.. ఏడు ప్రమాదాల్లో 240 మంది మృతి



ఢిల్లీ: 2024 ముగింపుకు చేరింది. మరికొన్ని గంటల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రపంచం మొత్తం సిద్ధమవుతోంది. అయితే, ఏడాది చివరి నెల డిసెంబర్ విమానయాన చరిత్రలో 'చీకటి నెల'గా నిలిచింది. ఎందుకంటే డిసెంబర్ నెలలో ఏకంగా ఏడు ఘోరమైన విమాన ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. మొత్తం ఏడు ప్రధాన ఘటనల్లో ఏకంగా 240 మంది మరణించడం కలచివేస్తోంది. ఈ ఒక్క నెలలో జరిగిన విమాన ప్రమాదాలు విమానయాన భద్రతపై పలు ప్రశ్నల్ని లేవనెతుతున్నాయి.

**దక్షిణ కొరియాలో ఘోర విమాన ప్రమాదం.. 179 మంది దుర్మరణం**

దక్షిణ కొరియాలో ఆదివారం ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దాదాపు 179 మంది ప్రయాణికులు సజీవంగా దహనమయ్యారు. ల్యాండింగ్ అవుతున్న సమయంలో గేర్ పనిచేయకపోవడంతో విమానం వేగంగా రన్‌వేపై దూసుకువెళ్లి ఫెన్సింగ్ గోడను ఢీకొంది. వెంటనే విమానంలో మంటలు చెలరేగి అందులోని ఇద్దరు సిబ్బంది మినహా మొత్తం 179 మంది సజీవదహనం చెందారు. దక్షిణ కొరియా విమానయాన చరిత్రలోనే ఇది అత్యంత ఘోర ప్రమాదంగా భావిస్తున్నారు.డిసెంబర్ 25న అజర్‌బైజాన్ విమానం కూలిన ప్రమాదంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. అజర్‌బైజాన్ రాజధాని బాకు నుంచి రష్యాలోని గ్రోజ్నీకి బయల్దేరిన విమానాన్ని పొగమంచు కారణంగా కజకిస్థాన్‌లోని అక్టౌ విమానాశ్రయానికి మరలించారు. విమానం దానికి దగ్గర్లో ల్యాండ్ అవుతున్నప్పుడు పక్షి ఢీకొనడంతో కుప్ప కూలి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విమానంలో 37 మంది అజర్‌బైజాన్ వాసులు, 16 మంది రష్యన్లు, ఆరుగురు కజకిస్థానీలు, ముగ్గురు కిర్గిస్థానీ పౌరులు ఉన్నారు. ఈ ఘటనలో 38 మంది దుర్మరణం పాలయ్యారు. 27 మంది గాయపడ్డారు.

**డిసెంబర్ 22న మూడు ప్రమాదాలు.. 19 మంది మృతి**

డిసెంబర్ 22న బ్రెజిల్‌లో సంభవించిన విమాన ప్రమాదంలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. విదేశీ ప్రయాణికులతో వెళుతున్న ఓ బుల్లి విమానం ఆదివారం దక్షిణ బ్రెజిల్ టూరిస్ట్ సిటీ గ్రామాడోలోని దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో విమానంలో పది మంది ఉండగా.. వారంతా ప్రాణాలు కోల్పోయారు. క్రిస్మస్ పండుగకు కొద్ది రోజుల ముందు ఈ ఘటన జరిగింది. అందరూ పండుగ కోసం ముస్తాబవుతున్న నేపథ్యంలో ఈ ఘటన జరగడం స్థానికుల్లో విషాదాన్ని నింపింది.ఇక అదే రోజుటర్కీలో కూడా ఇలాంటి ప్రమాదమే సంభవించింది. వైద్యులతో బయల్దేరిన అంబులెన్స్ హెలికాప్టర్ ఘోర ప్రమాదానికి గురైంది. రోగిని తీసుకొచ్చేందుకు టేకాఫ్ అయిన హెలికాప్టర్ హాస్పిటల్ భవనాన్ని ఢీకొట్టి, కుప్పకూలింది. అందులో ఉన్న ఇద్దరు పైలట్లు, ఒక డాక్టర్, ఒక ఆరోగ్య సంరక్షకుడు చనిపోయారు. టర్కీ ఆగ్నేయప్రాంతంలోని ముగ్లా నగరంలో డిసెంబర్ 22 ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. డిసెంబర్ 22న పాపువా న్యూ గునియాలో నార్త్ కోస్ట్ ఏవియేషన్ నిర్వహిస్తున్న చిన్న విమానం కూలి అందులో ఉన్న 5 మంది ప్రాణాలు కోల్పోయారు.డిసెంబర్ 24న అర్జెంటీనాలో బార్డియర్ ఛాలెంజర్ 300 విమానం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. డిసెంబర్ 17న హవాయిలోని హొనోలులులోని ఇనౌయే అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఓ విమానం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు మరణించారు. విమానం లిఫ్ట్‌ఆఫ్ అయిన వెంటనే నియంత్రణ కోల్పోయి భవనాన్ని ఢీట్టింది.

# సిరియాలోని ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రంపై ఇజ్రాయెల్ కోవర్ట్ ఆపరేషన్..!



**సిరియా:** సిరియాలో ఇరాన్ మూలాలను పెకలించేసే పనిలో ఇజ్రాయెల్ నిమగ్నమైంది. తాజాగా కమాండోలతో ఓ కోవర్ట్ ఆపరేషన్ నిర్వహించి టెహ్రాన్‌ను దెబ్బతీసింది. సిరియాలో రహస్యంగా ఇరాన్ నిర్వహిస్తున్నక్షిపణి తయారీ కేంద్రాన్ని ఇజ్రాయెల్ కమాండోలు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆదివారం మైసాఫ్ నగరంలోచోటుచేసుకొంది. ఈ విషయాన్ని కేఏఎన్ న్యూస్ వెల్లడించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ నిర్వహిస్తున్న సిరియన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ సైన్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్, భూగర్భ క్షిపణి తయారీ కేంద్రాన్ని ఇజ్రాయెల్ కమాండోలు లక్ష్యంగా చేసుకొన్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించి అమెరికాకు ముందుగానే సమాచారం అందజేశారు. దాదాపు పదేళ్ల నుంచి సిరియన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ సైన్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌పై ఇజ్రాయెల్ దృష్టిపెట్టింది. ఈనేపథ్యంలో ఇరాన్ నుంచి ప్రిసెషన్ క్షిపణుల తయారీకి అవసరమైన సామగ్రిని తీసుకొచ్చే ప్రాజెక్ట్ ఫెసిలిటీని గుర్తించి దాడి చేసింది. తాజాగా అక్కడ ఉన్న క్షిపణులను హెజ్‌బొల్లాకు సరఫరా చేసేందుకు తయారుచేసినవిగా భావిస్తున్నారు. ఈ కేంద్రం నుంచి భారీ ఎత్తున మొదలుపెట్టే అవకాశం ఉందని ఇజ్రాయెల్ ఆందోళన చెందుతోంది.

# ఘోర ప్రమాదం.. 71 మంది మృతి



**ఇథియోపియా:** ఇథియోపియాలోని బోనాల జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సిదామా ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి నదిలో పడటంతో 71మంది మృతి చెందినట్లు అధికారులుతెలిపారు. డామా ప్రాంతంలోని అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ఆదివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో ప్రయాణికులతో సిదామా ప్రాంతంలో వెళ్తున్న ట్రక్కు అదుపు తప్పడంతో రోడ్డుపై నుంచి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 68 మంది పురుషులు, ముగ్గురు స్త్రీలుమృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామన్నారు. మృతుల్లో కొందరు స్థానికంగా ఓ వివాహానికి హాజరై, తిరుగు ప్రయాణమైనట్లు సమాచారం.పేద దేశమైన ఇథియోపియాలో సరైన రోడ్డు సదుపాయాలు లేవు. అక్కడ రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతుండడంతో వందల సంఖ్యలో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని స్థానిక పోలీసు అధికారులు పేర్కొన్నారు.

# భోపాల్ నుంచి 377 టన్నుల కాలకూటం తరలింపు ప్రారంభం



**భోపాల్:** భోపాల్ గ్యాస్ దుర్ఘటన తర్వాత యూనియన్ కార్బైడ్ సంస్థ ఆవరణలో దాదాపు 40 ఏళ్లుగా పడివున్న 377 టన్నుల విషపదార్థాల తరలింపు కార్యక్రమం మొదలైంది. ఆదివారం జీపీఎస్ అమర్చిన దాదాపు అరడజను ట్రక్కులు, అత్యంత పకడ్బందీగా తయారుచేసిన కంటైనర్లు అక్కడికి చేరుకొన్నాయి. మరోవైపు పీపీఈ కిట్లు ధరించిన సిబ్బంది, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, డాక్టర్లు, నిపుణులు అక్కడికి చేరుకొన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో పోలీసు బలగాలను మోహరించారు. వీటిని ఇండోర్ సమీపంలోని పీతంపుర్ ప్రాంతానికి తరలించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఈ వ్యర్థాల తరలింపులో జాప్యంపై రాష్ట్ర అధికారులకు హైకోర్టు మొట్టికాయలు వేసింది.కోర్టు ధిక్కార నేరం కింద కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించడంతో అధికార వర్గాల్లో చలనం వచ్చింది. న్యాయస్థానం కూడా వీటిని తరలించడానికి నాలుగువారాల డెడ్‌లైన్‌ను విధించింది. అధికారులజడత్వం మరోవిషాదానికికారణంకావచ్చని ఆందోళనవ్యక్తం చేసింది.

**చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం..**

భోపాల్ గ్యాస్ విషాదఛాయలు దాదాపు 40 ఏళ్ల తర్వాత కనుమరుగు కానున్నాయని.. వాటిని సురక్షితంగా పీతంపుర్‌కు తరలించనున్నట్లు రాష్ట్ర గ్యాస్ రిలీఫ్ అండ్ రిహాబిలిటేషన్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ స్వతంత్రకుమార్ సింగ్ వెల్లడించారు. ఈక్రమంలో వీలైనంత వేగంగా వ్యర్థాలను తరలించేందుకు గ్రీన్ కారిడార్ ఏర్పాటుచేశామన్నారు. అక్కడి డిస్పోజల్ యూనిట్‌లో తొలుత కొంత మొత్తాన్ని ప్రత్యేకంగా దహనం చేస్తామని వెల్లడించారు. తర్వాత వచ్చే బూడిదలో కూడా ఏమైనా రసాయనాలు ఉన్నాయేమో శాస్త్రీయంగా పరీక్షలు జరుపుతామన్నారు. అంతా సురక్షితమని నిర్ధరించుకొన్న తర్వాతే మిగిలినవాటిని దహనం చేస్తామని తెలిపారు. వచ్చిన బూడిదను రెండంచెల్లో భద్రపరిచి భూస్థాపితం చేస్తామని చెప్పారు. ఈ బూడిద ఎక్కడా భూమిని తాకకుండా జాగ్రత్తలు తీసుకొంటామన్నారు. 2015లో యూనియన్ కార్బైడ్ నుంచి తరలించిన 10 టన్నుల వ్యర్థాలను పీతంపుర్ తీసుకెళ్లి దహనం చేసి ఆ బూడిదను మట్టిలో కలపడంతో కొన్నాళ్లకు అక్కడి జలాలు కలుషితమైనట్లు ప్రచారం జరిగింది. తాజాగా సింగ్ ఆ ఆరోపణలను తోసిపుచ్చారు. 2015లో జరిగిన పరీక్షల ఆధారంగానే తాజాగా వాటిని తరలిస్తున్నట్లు చెప్పారు. పీతంపుర్‌లో దాదాపు 1.75 లక్షల జనాభా ఉంది. వారు ఆదివారం ఆందోళన చేపట్టారు. అంతేకాదు.. ఈ వ్యర్థాల దహనానికి ముందే అక్కడి గాలి నాణ్యతను పరీక్షించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. దహనం ప్రక్రియలో ఏమైనా ప్రమాదం జరిగితే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

**మరువలేని విషాదం..!**

1984 డిసెంబరు 3న (డిసెంబరు 2 అర్ధరాత్రి దాటిన తర్వాత) నగర శివార్లలోని యూనియన్ కార్బైడ్ పురుగుమందుల కర్మాగారంలోని ట్యాంకు నుంచి 40–45 టన్నుల అత్యంత ప్రమాదకర మిథైల్ ఐసోసైనేట్ (ఎంఐసీ) వాయువు లీకైంది. చుట్టుపక్కల ప్రాంతాలను అది గ్యాస్‌ఛాంబర్లుగా మార్చేసింది. పీల్చేకొద్దీ విషవాయువే ఊపిరితిత్తుల్లోకి చేరింది. ఆసుపత్రులకు పరుగులు తీస్తూ చాలామంది రోడ్లపైనే ప్రాణాలు కోల్పోయారు. గ్యాస్ లీకేజీ కారణంగా తొలి 3 రోజుల్లో దాదాపు 10 వేలమంది మృత్యువాత పడగా.. మొత్తంగా పాతిక వేలమంది వరకు మరణించినట్లు అంచనా. గాయపడ్డవారి సంఖ్య దాదాపు 6 లక్షలు! ఇక గ్యాస్ లీకైన నాడు కర్మాగారానికి 100 కిలోమీటర్ల దూరంలోపు ఉన్న మహిళల గర్భంలోని పురుష సంతానానికి క్యాన్సర్ల ముప్పు 27 రెట్లు అధికంగా ఉన్నట్లు ఓ అధ్యయనం తేల్చింది. 1984 డిసెంబరు 6న యూనియన్ కార్బైడ్ ఛైర్మన్ వారెన్ అండర్సన్ భోపాల్‌కు వచ్చారు. ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి.. కంపెనీ అతిథిగృహంలో నిర్బంధంలో ఉంచారు. అక్కడినుంచి అమెరికాలోని పెద్దలతో ఫోన్‌లో అండర్సన్ సంప్రదింపులు జరపడం.. కొన్ని గంటల్లోనే రూ.25 వేల పూచీకత్తుతో బెయిలు దక్కించుకొని ప్రత్యేక విమానంలో భారత్ విడిచి వెళ్లిపోవడం చకచకా జరిగిపోయాయి.

# మన్మోహన్ సింగ్ అస్తికలను యమునా నదిలో కలిపిన కుటుంబ సభ్యులు



**ఢిల్లీ:** మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మరణించిన విషయం తెలిసిందే. ఈనెల 26న ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుదిశ్వాస విడిచారు. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఆయన అంత్యక్రియలు జరిగాయి. కేంద్రం అధికార లాంఛనాలతో ఆయనకు తుది వీడ్కోలు పలికింది. మన్మోహన్ పెద్ద కూతురు ఉపిందర్ సింగ్ తన తండ్రికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో తాజాగా మన్మోహన్ అస్తికలను కుటుంబ సభ్యులు యమునా నదిలో కలిపారు. మజ్ను కా తిలా గురుద్వారా సమీపంలోని అష్ట్ ఘాట్ వద్ద సిక్కు సంప్రదాయాలను అనుసరించి ఆదివారం ఆయన అస్తికలను నదిలో నిమజ్జనం చేశారు. మన్మోహన్ సింగ్ సతీమణి, ముగ్గురు కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**స్మారక నిర్మాణానికి నిర్ణయం**

మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారకాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనువైన స్థలాన్ని త్వరలోనే నిర్ణయిస్తామని పేర్కొన్నది. కాగా, స్మారక నిర్మాణం జరగనున్న స్థలంలోనే అంత్యక్రియలు జరపాలని అంతకుముందు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మన్మోహన్ అంత్యక్రియలు, స్మారకానికి స్థలాన్ని నిర్ణయించకుండా బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే దేశ తొలి సిక్కు ప్రధానమంత్రిని అవమానిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది.

# ఇజ్రాయెల్‌లో భారీగా ఉపాధి.. పాలస్తీనా వర్కర్స్ స్థానంలో భారతీయులు..!



**జెరూసలెం:** ఇజ్రాయెల్‌పై హమాస్ అక్టోబర్ 7 దాడి తర్వాత పాలస్తీనా పనివాళ్లను రాకుండా పూర్తిగా నిలిపేశారు. దీంతో వేల సంఖ్యలో వర్కర్ల కొరత ఏర్పడింది. ఇప్పుడు వారి స్థానాలను భర్తీ చేయడానికి ఇతర ఆప్షన్లను ఇజ్రాయెల్ ఎంచుకొంది. ఇప్పుడు అక్కడ స్థానిక వర్కర్స్‌తో పాటు..భారతీయులు,చైనీయులు అధికంగా కనిపిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో పనిచేయడానికి ఇతర దేశాలకు చెందిన వర్కర్స్ భయపడటం లేదు. తాజాగా భారత్‌కు చెందిన రాజు నిషాద్ అనే 35 ఏళ్ల ఉద్యోగి మాట్లాడుతూ ఇక్కడ భయపడేందుకు ఏమీ లేదు. ఏమైనా గగనతల దాడులు జరుగుతుంటే తాము సురక్షిత ప్రదేశాలకు వెళతామని.. అవి ముగిసిన తర్వాత తిరిగి పనులు మొదలుపెడతామని వెల్లడించాడు. స్వదేశంలో కంటే అక్కడ మూడు రెట్లు అధిక ఆదాయం లభిస్తుందని వెల్లడించాడు. భవిష్యత్తు కోసం తాను డబ్బులు దాచుకొంటున్నట్లు తెలిపాడు.

**నిర్మాణరంగంలో కొత్త అవకాశాలు..**

ఏడాదికాలంలో భారత్ నుంచి 16,000 మంది ఉద్యోగులు ఇక్కడికి వచ్చారు. మరింతమందిని తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారతీయులు దాదాపు కొన్ని దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌కు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే వేల మంది కేర్‌గివర్స్ వృద్ధ ఇజ్రాయెలీలను చూసుకొంటున్నారు. వజ్రాల వ్యాపారులు, ఐటీ ఉద్యోగులు కూడా ఉన్నారు. కానీ, గాజా వార్ తర్వాత మాత్రం నిర్మాణరంగ కార్మికులను కూడా ఇజ్రాయెల్ పిలిపించుకొంటోంది. ఢిల్లీకి చెందిన డైనమిక్ స్టాఫింగ్ సర్వీసెస్ సంస్థ అధిపతి అక్టోబర్ సమీర్ ఖోస్లా తర్వాత నెల రోజులకు ఇజ్రాయెల్ వెళ్లారు. అక్కడి మార్కెట్ గురించి తనకు అంతగా తెలియదని తెలిపారు. భారత్‌తో ఉన్న సంబంధాల రీత్యా.. మనవారికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారన్నారు. దాదాపు 10 వేల మందిని అక్కడికి పంపించాలని లక్ష్యంగా పెట్టుకొన్నారు.మరోవైపు యుద్ధానికి ముందు పాలస్తీనా వర్కర్స్ స్థాయిలో ఇంకా భారతీయులు రాలేదని అక్కడి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హమాస్ దాడికి ముందు నిత్యం 80,000 మంది పాలస్తీనా వాసులు నిర్మాణరంగంలో పనిచేసేవారు. వీరితోపాటు మరో 26 వేల మంది విదేశీ పనివారు కూడా ఉండేవారు. ప్రస్తుతం కేవలం 30,000 మంది విదేశీయులు మాత్రమే అక్కడ పనిచేస్తున్నారు.

# ఇంట్లో వంట గదికి కిటికీలు వద్దు.. తాలిబన్ల కొత్త రూల్

**అఫ్గానిస్థాన్:** అఫ్గానిస్థాన్‌ను చేజిక్కించుకున్న తాలిబన్లు .. అక్కడి మహిళల హక్కులను కాలరాస్తున్నారు. తాజాగా ఆ దేశ పాలకులు తీసుకువచ్చిన డిక్రీ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నూతనంగా నిర్మించే ఇళ్లల్లో మహిళలు బయటివారికి కనిపించేలా వంట గదికి కిటికీలు ఏర్పాటుచేయొద్దని ఆదేశాలు ఇవ్వడం నివ్వెరపరుస్తోంది. "వంట గదులు, ఇంటి ఆవరణ, నీటికోసం బావుల వద్దకు వచ్చిన మహిళలు బయటివారికి కనిపిస్తే అభ్యంతరకర చర్యలకు దారితీసే వీలుంది. వారు కనిపించకుండా గోడలు కట్టాలి. ఇప్పటికే స్త్రీలు బయటకు కనిపించేలా నిర్మాణాలు ఉంటే వాటిని మూసివేయాలి" అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈనేపథ్యంలో మున్సిపల్ అధికారులు కొత్త నిర్మాణాలను పరిశీలించి, ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించనున్నారు. మతపరమైనఆచారాల ముసుగులో మహిళల హక్కు లు, స్వేచ్ఛపైఉక్కుపాదం మోపుతున్న తాలి బన్ ప్రభుత్వం.. ఇప్పటికే జిమ్‌లు, పార్కుల్లోకి మహి ళల ప్రవేశంపై నిషేధం అమలుచేస్తోంది.మిడిల్ స్కూల్, హైస్కూల్ విద్యకు బాలికల్ని దూరంచే యడం..పలు రంగాల్లో మహిళల ఉద్యోగాలను పరిమితం చేయడం, ఆటలాడటంపై నిషేధం, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తల నుంచి కాలి వరకు దుస్తులు ధరించాలని ఆదేశించడం వంటి అనేక కఠిన ఆంక్షలు విధించారు. తాలిబన్ ప్రభుత్వం తీసుకుంటున్ననిర్ణయాలను గతం లో ఐరాస ఖండించింది. జన జీవన స్రవంతి నుంచి మహిళల్ని క్రమపద్ధతిలో దూరం చేసే ఇలాంటిచర్యలు సరికాదనిఆందోళన వ్యక్తంచేసింది.

# గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు

## సంధ్య థియేటర్ ఘటనపై అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించిన పవన్‌కల్యాణ్

**విశ్వంభర, అమరావతి:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని వ్యాఖ్యానించారు. "తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడు. కిందిస్థాయి నుంచి ఎదిగారు. వైసీపీ విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2 'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుంది. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సింది". "అల్లు అర్జున్ తరఫున ఎవరో ఒకరు బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉంటే బాగుండేది. ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు. మేమంతా అండగా ఉన్నామని ముందే చెప్పి ఉండాల్సింది. తమ ప్రమేయం లేకుండా తప్పు జరిగి పోయిందని విచారం వ్యక్తం చేయాల్సింది. ఈ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సింది. పరామర్శించకపోవడం వల్లే ప్రజల్లోఆగ్రహం వచ్చింది. తన వల్లే ఒకరు చనిపోయారనే వేదన అర్జున్‌లో ఉంది""సినిమా అంటే టీమ్.. అందరి భాగస్వామ్యం. అల్లు అర్జున్ ఒక్కడినే దోషిగా మార్చడం కూడా కరెక్ట్‌కాదు. తొక్కిసలాట ఘటన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్పందించారు. కొన్నిసార్లు పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయి. చిరంజీవి కూడా గతంలో అభిమానులతో కలిసి సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. కాకపోతే ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు"

### క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి..

"సినిమా పరిశ్రమలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలోని వారందరూ కూర్చొని మాట్లాడాలి. రాష్ట్రంలో పాపికొండలు వంటి చక్కటి లొకేషన్లు ఉన్నాయి. విజయనగరం అటవీ ప్రాంతంలోనూ అందమైన ప్రదేశాలున్నాయి. ఈ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు అవసరం. ఇండస్ట్రీలో క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి. స్టోరీ టెల్లింగ్ స్కూల్స్ రావాలి. అప్పుడే మంచి సినిమాలు సాధ్యం" అని పవన్‌కల్యాణ్ అన్నారు.



### నాగబాబుకు మంత్రి పదవిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

విశ్వంభర, అమరావతి: రాజకీయాల్లో పని తీరే ప్రామాణికమని, కలిసి పనిచేసిన వారిని గుర్తించాల్సిన బాధ్యత తనకు ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. సోమవారం మంగళగిరిలో ఆయన మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. సోదరుడు, జనసేన నాయకుడు అయిన నాగబాబుకు మంత్రి పదవి ఇచ్చే విషయమై స్పందించారు."మాకు బ్యాక్‌గ్రౌండ్ లేకున్నా అన్నయ్య సొంతంగా ఎదిగారు. ఇప్పుడు మా తర్వాత తరం పిల్లలకు ఒక బ్యాక్‌గ్రౌండ్ ఉంది. మనతో ప్రయాణం చేసి, పనిచేసిన వారిని నేను గుర్తించాలి. నాగబాబు నాతో పాటు సమానంగా పనిచేశారు. వైసీపీ నేతలతో తిట్లు తిన్నారు. పార్టీ కోసం నాగబాబు నిలబడ్డారు. ఇక్కడ కులం, బంధుప్రీతి కాదు.. పనిమంతుడా కాదా? అన్నది చూడాలి. ఎంపీగా ప్రకటించి, మళ్లీ నాగబాబును తప్పించాం""మనోహర్, హరిప్రసాద్ మొదటి నుంచి పార్టీ కోసం పనిచేశారు. ఎవరికి ప్రతిభ ఉందో చూసి, వాళ్లకు పదవులు ఇస్తాం. ఈ విషయంలో మీరెందుకు జగన్‌ను అగడలేదు? కేవలం పవన్‌కల్యాణ్‌ను మాత్రమే ఎందుకు అడుగుతున్నారు? నాగబాబు ఎమ్మెల్సీగా ఎంపికవుతారు. మంత్రి పదవి విషయంలో తర్వాత చర్చ చేస్తాం. నాగబాబు త్యాగం గుర్తించి రాజ్యసభకు అనుకున్నాం. కుదరలేదు కాబట్టి, ఎమ్మెల్సీ అనుకున్నాం. కందుల దుర్గేష్ ఏ కులమో నాకు తెలియదు. ఆయన పనితీరు నచ్చి మంత్రి పదవి ఇచ్చా. రాజకీయాల్లో కులం కాదు.. పని తీరే ప్రామాణికం" అని పవన్‌కల్యాణ్ అన్నారు.

## రేషన్ బియ్యం మాయం కేసులో పేర్ని నాని భార్యకు మరోసారి నోటీసులు



**విశ్వంభర, కృష్ణా:** రేషన్ బియ్యం మాయం కేసులో మాజీ మంత్రి పేర్ని నాని భార్య జయసుధకు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మరోసారి నోటీసులు జారీ చేశారు. గోదాములో బియ్యం మాయంపై ఇటీవల ప్రాథమిక విచారణ చేపట్టిన పౌరసరఫరాలశాఖ అధికారులు తొలుత 185 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం షార్టేజీ వచ్చినట్లు గుర్తించారు. దీనికిగానూ ఇప్పటికే ఆమె రూ.1.68 కోట్లు జరిమానా చెల్లించారు. అయితే, తాజాగా ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టిన అధికారులు మొత్తంగా 378 మెట్రిక్ టన్నుల బియ్యం మాయమైనట్లు తేల్చారు. దీంతో పెరిగిన షార్టేజీకి కూడా జరిమానా చెల్లించాలని తాజాగా మరోసారి నోటీసులు జారీ చేశారు. అదనంగా మరో రూ.1.67 కోట్లు చెల్లించాలని గీతాంజలి శర్మ నోటీసుల్లో పేర్కొన్నారు.

## పోలీసుల అదుపులో కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్



త వైపీసీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోదాములో బియ్యం మాయం కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఆదివారం గోదాము మేనేజర్ మానస తేజను, సోమవారం కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కోటి రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కోటి రెడ్డికి ప్రమేయముందని పోలీసుల అనుమానిస్తున్నారు. పేర్ని నాని గోదాములో రేషన్ బియ్యం మాయమయ్యాయని కోటి రెడ్డి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యం నిల్వల మాయం అంశంలో తనపై అనుమానం రాకుండా పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. మానస తేజ, కోటి రెడ్డిని నేడు అరెస్ట్ చూపించే అవకాశముంది. నేడు మచిలీపట్నం జిల్లా కోర్టులో పేర్ని నాని సతీమణి జయసుధ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు రానుంది.

## 'ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరు?' డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విశ్వంభర, మంగళగిరి:** "రేషన్ బియ్యం మాయమైంది నిజం.. డబ్బులు కట్టింది వాస్తవం.. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరు?" అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.. అని నిలదీశారు. మంగళగిరిలో పవన్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు."వైసీపీ నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయి. అప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు, పనిచేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుంది.ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నాం. పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ఇప్పటివరకు దృష్టి పెట్టాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఎన్డీఏ ఆధ్వర్యంలో చాలా బాధ్యతతో పనిచేస్తున్నాం. పదవులు అనుభవించడం కాదు.. బాధ్యతతో పనిచేస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం" అని పవన్ కల్యాణ్ చెప్పారు.

## తూర్పుగోదావరి జిల్లాలో రేవ్‌పార్టీ కలకలం

**విశ్వంభర, కోరుకొండ:** తూర్పుగోదావరి జిల్లాలో రేవ్‌పార్టీ కలకలం రేగింది. కోరుకొండ మండలం బూరుగుపూడి గేట్ సమీపంలోని కల్యాణ మండపంలో తెల్లవారుజామున రేవ్ పార్టీపై పోలీసు ప్రత్యేక సిబ్బంది దాడి చేశారు. దీనిలో పాల్గొన్న ఐదుగురు మహిళలు, 14 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రేవ్‌పార్టీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. నిందితులు ఓ ఫెర్టిలైజర్ కంపెనీకి చెందినవారిగా సమాచారం. వారు గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చినట్లు తెలిసింది.

## సీపీఎం మహాసభల్లో 35 తీర్మానాలు ఆమోదం

**విశ్వంభర, విశాఖ :** సీపీఐఎం విశాఖ జిల్లా 24వ మహాసభలు పెందుర్తి, సుజాతనగర్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో అత్యంత జయప్రదంగా జరిగాయని, ఈ మహాసభల్లో కార్మిక, రైతు, మహిళ, యువజ, విద్యార్థి వంటి వివిధ వర్గాల ప్రజా సమస్యలను పరిష్కరించాలని విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మీడియాకు తెలిపారు. సుమారు 35 తీర్మానాలు చేసి మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. జగదాంబ సెంటర్‌లో ఉన్న నండూరి ప్రసాదరావు భవనంలో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జీవీఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ గంగారావు, ఆర్.కె.ఎస్.వి.కుమార్, వి.కృష్ణారావులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.

### స్టీల్‌ప్లాంట్ ప్రమాదకరం

ఆర్సిలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వేంపాడు టోల్ గేట్ నుంచి రాజయ్యపేట ప్రాంతంలో పెట్టడం పర్యావరణానికి ప్రమాదకరమని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నరసింగరావు అన్నారు. నక్కపల్లి ప్రాంతానికి అత్యంత పర్యావరణ ప్రమాదకరమని 2000 సం?రంలోనే నిపుణుల కమిటీ నిర్ధారించిందన్నారు.

## అకాల వర్షం.. రైతులకు నష్టం

విశ్వంభర, ఆనందపురం: ఆనందపురం మండలంలోని సుమారు 50 ఎకరాల్లో పంట నేలకొరిగింది. మరో 300 ఎకరాల్లో వర్షం పడటంతో వరి కోసి చిన్న చిన్న కుప్పలుగా పెట్టారు. ముసురు వర్షంతో కుప్పల్లోకి నీళ్లు పోయి కుప్పలలో ధాన్యం చాలా వరకు రంగు మారినట్లుగా రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులకు కోరుతున్నారు.

## తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబు కీలక నిర్ణయం



విశ్వంభర, అమరావతి: తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించడంపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖలను అనుమతించేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. సోమవారం సీఎంతో బీఆర్ నాయుడు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై చంద్రబాబుతో చర్చించారు. వారానికి నాలుగు సిఫార్సు లేఖలు అనుమతించేందుకు చంద్రబాబు అంగీకరించినట్లు బీఆర్ నాయుడు తెలిపారు. వారానికి రెండు బ్రేక్ దర్శనాలు, రెండు రూ.300 దర్శనానికి సంబంధించిన లేఖలు అనుమతించేందుకు సీఎం అనుమతి ఇచ్చారని బీఆర్ నాయుడు వెల్లడించారు.

## విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

**విశ్వంభర, సబ్బవరం:** విద్యార్థుల సైన్స్ ప్రదర్శనకు సబ్బవరం నలుమూలల నుంచి 8 పాఠశాలల విద్యార్థులు, సైన్స్ టీచర్లు విజ్ఞాన ప్రదర్శనకు హాజరయ్యారు. వీటిలో రావులపాలెం పాఠశాల విద్యార్థులు తయారుచేసిన చెత్తను ఉపయోగించి విద్యుత్తును తయారు చేసే విధానం, అదే విధంగా సబ్బవరం అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు తయారుచేసిన పొల్యూషన్ తో నిండిన రోడ్లను బ్లాక్ చేసి ప్రత్యామ్నాయ మార్గాలలో పంపే విధానం అందరినీ ఆకట్టుకున్నాయి. సైన్స్ ఫెయిర్ ఏర్పాటుచేసిన సబ్బవరం ప్రభుత్వ హైస్కూలు టీచర్లు, విద్యార్థులు, ఎంపీపీ బోకం సూర్యకుమారి,ఎంపీటీసీ బయలుపూడి దేవు డు బాబు, ఎంఈఓ రవీంద్రబాబు, సబ్బవరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయిని రాధాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం ఆస్పత్రిలో గర్భిణి మృతి

విశ్వంభర, అల్లూరి జిల్లా: రంపచోడవరం ఆస్పత్రిలో సోమవారం ఓ నిండు గర్భిణి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మారేడుమిల్లి మండలం రామన్నవలసకు చెందిన లక్ష్మి పురిటినొప్పులతో రాత్రి 12 గంటలకు ఆస్పత్రిలో చేరారు. వైద్యులు అందుబాటులో లేక లక్ష్మి చాలా సేపటి వరకు అలాగే నొప్పులతో బాధపడుతూ ఉంది. కొంత సమయం తర్వాత మృతి చెందింది. వైద్యులు అందుబాటులో లేకనే లక్ష్మి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

## ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయరాదని వినతి

**విశ్వంభర, ఆదోని:** జిల్లాలో కురువ ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయరాదని డిమాండ్ చేస్తూ ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు దళిత సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించాయి. ధర్నాలో మాల మహానాడు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. బీసీ హోదా పొందుతూ, మాదాసి కురవ, మాదారి కురవ పేరుతో ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు కోరడం సరికాదన్నారు. ఇలాంటివారు ఆంధ్ర రాష్ట్రంలో లేరని మహారాష్ట్ర కర్ణాటక వంటి ప్రాంతాలలో ఉన్నారని గుర్తు చేశారు. అధికారులు వర్థిలకులోనే ఎస్సీ ధ్రువీకణ పత్రాలు జారీ చేస్తే ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఇరుసంగాల నాయకులు సాయిరాం, లక్ష్మీనారాయణ, బాలాజీ, శాంత రాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్

ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమం జరిగింది. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వాయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీవో నూర్జహాన్, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి కుమార్, ఆర్టీసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ చేతన్ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**విశ్వంభర, చౌడేపల్లి:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని దుర్గసముద్రానికి చెందిన బోడిగడ్ల చెంగప్ప (62) ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో చెంగప్ప అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకొన్న పోలీసులు కేసు నమోదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలం చౌడేపల్లె -బోయకొండ మార్గంలో చిన్నకొండమర్రి వద్ద ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పలమనేరు మండలం కీలపట్లకు చెందిన భార్య, భర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన శివకుమారి చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

## మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు

**విశ్వంభర, బేతంచర్ల:** బేతంచెర్ల మండల పరిధిలోని రంగాపురం గ్రామ సమీపంలో వెలిసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు భక్తులు సమర్పించిన ముడుపులు, కానుకలు, హుండీ లెక్కింపును ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

## నాలుగో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

**విశ్వంభర, బేతంచర్ల:** బేతంచర్ల పట్టణంలో రాయల్టీ బిల్లుల సమస్య రావడంతో కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడే ప్రమాదం ఉందని ట్రాక్టరు,గని పాలిష్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం నాయకులు మోహన్ రావు నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రైల్వే గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాలుగవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేతంచర్లలో చిన్న పరిశ్రమలు ఉండడంతో ఎంతోమంది నిరుద్యోగులు కార్మికులు నాపరాయి పరిశ్రమపై ఆధారపడి జూనోపాధి పొందుతున్నారని, రాయల్టీ బిల్లుల సమస్య ఉండడంతో ఎంతోమంది జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రాయల్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. ఈ క్రమంలో ట్రాక్టర్ పరిశ్రమల యజమానులు వలి, ధనం జయ మురళి రాఘవేంద్ర నరేంద్ర ఎర్ర భాష చంద్రమోహన్ చింతల నాగిరెడ్డి పాల్గొన్నారు.

## గిరిజనులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ కావాలి

**విశ్వంభర, కావలి:** గిరిజన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమలైనటువంటి గిరిజన సంక్షేమ పథకాలను తిరిగి కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. వైకాపా హయాంలో ఆ సంక్షేమాలను తెరమరుగు చేశారని వాపోయారు. కార్యక్రమంలో ఆయన వెంట తెలుగు మహిళ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు కుల్లూరు అశ్విని, నాయకులు యెహోవా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నిరంతరం కృషి చేయాలి

విశ్వంభర, బుట్టాయగూడెం: విద్యార్థులు మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించుకునేందుకు నిరంతర కృషి చేయాలని ఓఎన్ జీసీ డీజీఎం శ్యామ్‌నాథ్ అన్నారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కేఆర్ పురం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఓఎన్ జీసీ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ పై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ ఇన్ ఛార్జి డిప్యూటీ డైరెక్టర్ పీవీఎస్ నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షేడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధీర్ కుమార్, నైపుణ్యాభివృద్ధి నిపుణుడు శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, వెలుగు ఏపీడీ రాజ్ బాబు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శిరమయ్య తదితరులు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు కెరీర్ పెంపొందించుకునేందుకు ఉపయోగపడే పుస్తకాల కిట్టులు అందజేశారు.

## పిచ్చికుక్క దాడిలో.. నలుగురికి గాయాలు

విశ్వంభర, ముసునూరు: ఏలూరు జిల్లా ముసునూరులో సోమవారం ఉదయం ఓ పిచ్చి స్వైర విహారం చేసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మద్దాల కుమారి, పోలిమెట్ల వెంకటేశ్వరరావు, కొడవలి యాకోబు, పూజితలు నడుచుకుంటూ వెళ్తున్న వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితులు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

**విశ్వంభర, పీలేరు:** స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున యువకులు హెల్మెట్లు ధరించి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నియమాల పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ యుగంధర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## కూతురు మరణం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య

**విశ్వంభర, నలగండ్ల:** కూతురు మరణాన్ని తటుకోలేక పురుగు ముందు తాగి తండ్రి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాధ ఘటన బొల్లాపల్లి మండలం వెల్లటూరులో చోటుచేసుకుంది. నెల రోజుల క్రితం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని జెట్టి అనూష (16) కళాశాల భవనం పైనుంచి పడి చనిపోయింది. ఈ సంఘటనను జీర్ణించుకోలేక విద్యార్థిని తండ్రి జెట్టి హనుమంతరావు (44) వారం రోజుల కిందట పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో గ్రామంలో బంధువుల రోదనలు మిన్నంటుతున్నాయి.

## సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

**విశ్వంభర, నంద్యాల :** భారత రాజ్యాంగ నిర్మాత డా. బీ.ఆర్. అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు చౌడప్ప డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లా సర్వజన ఆసుపత్రి కూడలిలో వామపక్ష కేంద్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగ పట్ల, ప్రజాస్వామ్యం పట్ల అమిత్ షాకు గౌరవంలేవని విమర్శించారు. అమిత్‌షాకు కేంద్ర హోం శాఖ మంత్రిగా కొనసాగే హక్కులేదని, వెంటనే ఆయన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ ధర్నాలో నాయకులు నాగరాజు, మద్దులు, లక్ష్మణ్, పుల్లా నరసింహులు, మహమ్మద్ గౌస్, జైలాన్ పాల్గొన్నారు.

## అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా రాజీనామా చేయాలి:

**విశ్వంభర, కోవూరు:** అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో అవమానించిన అమిత్ షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శేషయ్య డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ దేశ వ్యాప్తంగా సీపీఎం చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం కోవూరులోని బజారు సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ భావజాలం గల భాజపా మొదటి నుంచి రాజ్యాంగాన్ని, జాతీయపతాకాన్ని గౌరవించడంలేదన్నారు. ప్రజాస్వామ్యవాదులు, కార్మికులు, రైతులు దళిత బహుజనులు ఐక్యంగా పోరాడి భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశ్వంభర, వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం ఉన్నత పాఠశాలలో గ్రిక్స్ క్రీడా పోటీలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె ప్రసంగించారు.

గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు

# రాష్ట్రాభివృద్ధిలో 'గేమ్ ఛేంజర్'

- మూడు దశల్లో ప్రాజెక్టు పూర్తి..
- సాగులోకి 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు
- సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** తెలుగు రాష్ట్రాల్లో 90శాతం ప్రాజెక్టులు టీడీపీ హయాంలో చేపట్టినవేనని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. దాదాపు అన్ని ప్రాజెక్టులు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే చేపట్టామన్నారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సమక్షంలో తెలుగు గంగ ప్రాజెక్టుపై ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు. అప్పట్లో శ్రీశైలం నుంచి కెనాల్ ద్వారా తెలుగుగంగకు నీళ్లు ఇవ్వడానికి ఎన్టీఆర్ సిద్ధమని చెప్పారన్నారు. అలా రాయలసీమకు తెలుగుగంగ నీళ్లు తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు.

"వెలిగొండ, తోటపల్లి ప్రాజెక్టులు నేనే ప్రారంభించాను. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నీటి కొరత, వర్ష పాతం ఎక్కువ. రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కరవు వల్ల సాగు దెబ్బతింటోంది. నీళ్లు ఇవ్వగలిగితే రాయలసీమను రత్నాలసీమగా చేయవచ్చు. గతంలో అనంతపురంలో అతి తక్కువ తలసరి ఆదాయం ఉండేది. ఉద్యాన పంటలతో ఆ జిల్లాలో తలసరి ఆదాయం 45 శాతానికి చేరింది. పట్టిసీమ చేపట్టిన తర్వాత సరైన సమయానికి పంటలు చేతికి అందే పరిస్థితి వచ్చింది. కృష్ణాలో నీళ్లు తగ్గాయి. గోదావరిలో నీటి ప్రవాహం ఉంది. కృష్ణా నది నుంచి 2,989 టీఎంసీల వరద ప్రవాహం సముద్రంలోకి వెళ్తోంది. నదుల అనుసంధానంతో కరవు, వరద పరిస్థితులు ఎదుర్కోవచ్చు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాలకు నీళ్లు ఇవ్వాల్సి ఉంది. గోదావరి నుంచి కృష్ణాకు కనీసం 200 టీఎంసీలు తీసుకురావాలి.

**బనకచర్ల గేమ్ ఛేంజర్..**

నీటిలభ్యతను బట్టి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్‌కు రోజుకు కనీసం 2 టీఎంసీలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్రానికి 'గేమ్ ఛేంజర్' అవుతుంది. బనకచర్లకు నీటిని తీసుకెళ్లగలిగితే నదుల అనుసంధానం పూర్తయినట్లే. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన రిజర్వాయర్ల అనుసంధానం కూడా పూర్తవుతుంది. రాష్ట్రంలో అదనపు ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. గోదావరి బనకచర్ల పూర్తయితే తెలుగుతల్లికి జలహారతి ఇచ్చినట్లే. ఈ ఏడాది 4,114 టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్లాయి. రాష్ట్రంలో రిజర్వాయర్ల సామర్థ్యం 983 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం రిజర్వాయర్లలో 729 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. జనవరి 1 నాటికి రిజర్వాయర్లలో 74 శాతం నీళ్లు ఉండటం రికార్డు. ఖరీఫ్ పంటలకు ముందస్తుగా నీరు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. వరదలు, తుపానుల కంటే ముందుగా పంట చేతికి వచ్చే వీలుంది" అని చంద్రబాబు తెలిపారు.

**మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు**

మూడు దశల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టాం. పోలవరం నుంచి కృష్ణా నదికి నీరు మళ్లించడం మొదటి దశ. రెండో దశలో బొల్లాపల్లి జలాశయం నిర్మించి నీళ్లు తరలిస్తాం. మూడోదశలో బొల్లాపల్లి నుంచి బనకచర్లకు నీటిని మళ్లిస్తాం. రాయలసీమకు బనకచర్ల గేట్‌వే కానుంది. ఈ ప్రాజెక్టుతో సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు లబ్ధి చేకూరుతుంది. రూ.80 వేల కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేస్తే రాష్ట్రానికి ఎంతో ఆదాయం వస్తుంది. డబ్బుంటే 3 ఏళ్లలో గోదావరిబనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేయొచ్చు. ఇది దేశంలోనే అతి పెద్ద సాగునీటి మౌలిక వసతి అవుతుంది. ప్రధాని మోదీకి ఈ ప్రాజెక్టు నివేదిక పంపిస్తున్నాం. ప్రాజెక్టుపై ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రితో మాట్లాడాం. కేంద్రమే ఈ ప్రాజెక్టు వ్యయాన్ని భరించలేదు. హైబ్రిడ్ మోడల్‌లో నిధుల సమీకరణకు ఆలోచిస్తున్నాం.

**7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు..**

గోదావరిబనకచర్లతో 80 లక్షల మందికి తాగునీరు అందుతుంది. 7.5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు 48వేల ఎకరాల భూసేకరణ అవసరం. ఇది చరిత్రను తిరగరాయబోయే ప్రాజెక్టు. చాలా సీరియస్‌గా తీసుకున్నాం. గోదావరి బనకచర్లతో భావితరాలకు నీటి సమస్య ఉండదు. ఈ ప్రాజెక్టుపై ప్రజల్లో కూడా చర్చ జరగాలి. ప్రైవేటు సంస్థలు చేపడితే ప్రభుత్వం చెల్లింపులు చేసే విధానాన్ని రాజస్థాన్‌లో అమలు చేశారు. రోడ్ల మాదిరిగా ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ ప్రైవేటు సంస్థలు చేపట్టాలి. వయబిలిటి గ్యాప్ ఫండ్ వరకు ప్రభుత్వం ఇస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పూర్తి చేసి 23 నెలల్లో టెండర్లు పిలుస్తాం. ప్రపంచం మొత్తం ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ వైపు ప్రయాణిస్తోంది. మనమూ ఆ దిశగా ప్రయాణం చేయాల్సి ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అదరగొట్టారు..


### 8వేల మంది సీఏలకు జాబ్ ఆఫర్లు..



**ఢిల్లీ:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా సీఏ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో అదరగొట్టారు. ఈ ఏడాది పలు నగరాల్లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 8వేల మందికి పైగా విద్యార్థులు కొలువులు సాధించారు. గతేడాది నవంబర్, ఈ ఏడాది మే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆకర్షణీయ వేతన ప్యాకేజీలతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఐసీఏఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ ధీరజ్ ఖండేల్వాల్ తెలిపారు.

ఈ ఏడాది ఫిబ్రవరి మార్చిలో నిర్వహించిన 59వ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 140 కంపెనీలు పాల్గొనగా 3,002 మంది విద్యార్థులు ఎంపిక కాగా.. మే జూన్ మధ్య జరిగిన 60వ ప్లేస్‌మెంట్ ప్రోగ్రామ్‌లో అత్యధికంగా 241 కంపెనీలు పాల్గొన్నాయని ఖండేల్వాల్ వెల్లడించారు. ఐసీఏఐ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌లో 4782మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. జాబ్ మార్కెట్లో సీఏలకు పెరుగుతున్న డిమాండ్‌కు ఈ గణాంకాలే నిదర్శనమన్నారు.

59వ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో డియాజియో ఇండియా అనే కంపెనీ అత్యధికంగా రూ. 29లక్షలు వార్షిక వేతన ప్యాకేజీకి ఎంపిక చేయగా.. 60వ డ్రైవ్‌లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ అనే కంపెనీ రూ.26.70లక్షల ప్యాకేజీ ఇచ్చి సీఏలను ఎంపిక చేసుకోవడం విశేషం. మొత్తంగా సగటు వార్షిక వేతన ప్యాకేజీ రూ.13.24లక్షల నుంచి 12.49లక్షలుగా ఉంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌తో పాటు తొమ్మిది ప్రధాన నగరాలతో పాటు 20 చిన్న చిన్న నగరాల్లోనూ ఈ డ్రైవ్‌లు నిర్వహించారు. సాధారణంగా 150 కంపెనీలే పాల్గొంటుండేవని అధికారులు తెలిపారు. మరోవైపు, వచ్చే ఏడాది జనవరి 2425 తేదీల్లో ఓవర్సీస్ ప్లేస్‌మెంట్స్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు ఐసీఏఐ ఏర్పాట్లు చేస్తోంది. యూఏఈ, ఆసియా, యూరప్ సహా పలు దేశాలకు సీఏలను పంపడమే లక్ష్యంగా నిర్దేశించుకొని ఆ దిశగా అడుగులు వేస్తోంది.



## కుంభమేళా తాత్కాలిక ఆస్పత్రిలో ప్రసవం..

### బాలుడికి 'మహాకుంభ్' అని నామకరణం

**ప్రయాగ్‌రాజ్:** మహా కుంభమేళా కు ప్రయాగ్‌రాజ్ సిద్ధమవుతోంది. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు 45 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కుంభమేళాకు వచ్చిన భక్తుల కోసం అన్ని సౌకర్యాలతో ఓ తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కుంభమేళాకు ముందు ఈ ఆసుపత్రిలో వైద్యులు తొలి ప్రసవం చేశారు.

గంగా నది ఒడ్డున డేరా నగరంలో నివసించే సోనమ్ (20) అనే మహిళకు ఆదివారం అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ప్రయాగ్‌రాజ్‌లోని తాత్కాలిక ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం ఆమెకు మగ బిడ్డ పుట్టాడని..కుంభమేళా జరిగే చోట పుట్టినందుకు చిన్నారికి 'మహాకుంభ్'గా నామకరణం చేశారని వైద్యులు పేర్కొన్నారు. అయితే బాలుడిని 'వేద్' అని పేరు పెట్టమని తాము సూచించామన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో 45 రోజుల పాటు మహా కుంభమేళా నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఆధ్యాత్మికత, సంస్కృతి, భద్రత, ఆధునికతల మేళవింపుగా ఈ వేడుకను నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సాంస్కృతిక శాఖ తెలిపింది. భక్తుల అవసరాలు, భద్రత కోసం యూపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు తాత్కాలిక వసతి కల్పించేందుకు వేలాది టెంట్లు, షెల్టర్లు, నీటిపై తేలియాడే 30 పాంటూన్ వంతెనలు, పటిష్ఠ నిఘా కోసం అధునాతన డ్రోన్లు మొదలైనవి ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

### న్యూఇయర్ కోసం

## రాహుల్ విదేశాలకు వెళ్లారా..?

### - బీజేపీ నేత పోస్టు వైరల్

**ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పై బీజేపీ నేతలు మరోసారి విమర్శలు గుప్పించారు. ఆయన కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు విదేశాలకు వెళ్లారంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు వారు నెట్టింట్లో పోస్టులు పెట్టగా.. హస్తం పార్టీ తిప్పికొట్టింది. "మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో దేశమంతా సంతాపం వ్యక్తంచేస్తోంది. ఈ సమయంలో కొత్త సంవత్సరం కోసం రాహుల్ గాంధీ వియత్నాం వెళ్లారు. రాహుల్ తన ప్రయోజనాల కోసం మన్మోహన్ సింగ్ మరణాన్ని రాజకీయం చేశారు" అని భాజపా నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా విమర్శలు చేశారు. "లోక్‌సభా పక్షనేత అర్థాన్ని రాహుల్ మార్చివేశారు.మీడియా కథనాల ప్రకారం ఆయన విదేశీ పర్యటనకు వెళ్లారు" అని షెహజాద్ పూనావాలా వ్యాఖ్యలు చేశారు. దీనిపై కాంగ్రెస్ స్పందించింది. "మీరు ఇలాంటి తప్పుదోవ పట్టించే రాజకీయాలను ఎప్పుడు మానుకుంటారు..? మోదీ ప్రభుత్వ మంత్రులు డాక్టర్ సాహెబ్ (మన్మోహన్ సింగ్) కుటుంబంతో వ్యవహరించిన తీరు సిగ్గుచేటు. రాహుల్ గాంధీ వ్యక్తిగత పర్యటనకు వెళ్తే.. మీరు ఎందుకు బాధపడుతున్నారు? కొత్తసంవత్సరంలో అయినా బాగుపడండి" అని కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

# పీఎస్ఎల్వీ- సీ60 ప్రయోగం విజయవంతం

### నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లిన వాహకనౌక



**విశ్వంభర, శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన పీఎస్ఎల్వీసీ60 ప్రయోగం విజయవంతమైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లిన వాహకనౌక.. టార్గెట్, ఛేజర్ ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సరిగ్గా సోమవారం రాత్రి 10:00:15 గంటలకు నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) పేరిట జంట ఉపగ్రహాలను భూ కక్ష్యలో అనుసంధానం చేయనున్నారు. అంతరిక్షంలోనే వ్యోమనౌకలను డాకింగ్, అన్ డాకింగ్ చేయగల సాంకేతిక అభివృద్ధే లక్ష్యంగా ఈ ప్రయోగం చేపట్టింది. పీఎస్ఎల్వీ ద్వారా ప్రయోగించిన రెండు చిన్న వ్యోమ నౌకలను అంతరిక్షంలోనే ఒకదానితో ఒకటి డాకింక్ చేయించడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం.

భూ ఉపరితలం నుంచి 470 కిలోమీటర్ల ఎత్తున వృత్తాకార కక్ష్యలో 2 వ్యోమ నౌకలు స్వతంత్రంగా ఏకకాలంలో డాకింగ్ అయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. చంద్రుడిపై వ్యోమగామిని దించడం, జాబిల్లి నుంచి మట్టిని తీసుకురావడం, సొంత అంతరిక్ష కేంద్రం నిర్మించాలన్న భారత్ కల సాకారం కావాలంటే.. వ్యోమ నౌకల డాకింగ్, అన్ డాకింగ్ సాంకేతికత ఎంతో అవసరమని ఇస్రో పేర్కొంది. ఈ డాకింగ్ ప్రక్రియ విజయవంతం అయితే ఈ సాంకేతికతను కలిగిన నాలుగో దేశంగా భారత్ నిలవనుంది. ఇప్పటికే అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈ సాంకేతికతను కలిగి ఉన్నాయి.

**జనవరి 7న డాకింగ్ జరిగే అవకాశం: సోమనాథ్**

పీఎస్ఎల్వీసీ60 ప్రయోగం విజయవంతం కావడంపై ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగంలో భాగస్వాములైన శాస్త్రవేత్తలను అభినందించారు. వాహక నౌక 2 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టినట్లు చెప్పారు. స్పేడెక్స్ శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెట్టడం మిషన్‌లో తొలి భాగమని చెప్పారు. డాకింగ్ ప్రక్రియకు మరో వారం సమయం పడుతుందని, జనవరి 7న డాకింగ్ జరిగే అవకాశం ఉందని సోమనాథ్ తెలిపారు.

## అతిశీని తాత్కాలిక సీఎంగా చెప్పడం బాధించింది : దిల్లీ ఎల్జీ



ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశీని తాత్కాలిక సీఎంగా ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పేర్కొనడంపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తనను బాధించిందన్నారు. ఒక ముఖ్యమంత్రిగా కేవలం ఆతిశీకే కాదని.. రాష్ట్రపతి ప్రతినిధిగా తనకూ అవమానకరమని అన్నారు. కేజ్రీవాల్ చేస్తున్న ప్రకటనలు దిల్లీ ప్రభుత్వ తీరుపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంటూ సీఎంకు లెఫ్టినెంట్ గవర్నర్ సుదీర్ఘ లేఖ రాశారు.

"కొన్ని రోజుల క్రితం మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడుతూ మిమ్మల్ని (అతిశీ) తాత్కాలిక ముఖ్యమంత్రిగా పేర్కొన్నారు. అది నాకు చాలా అభ్యంతరకరంగా అనిపించింది. ఇది మీతో (సీఎం) పాటు మాకు కూడా అవమానకరమే. కేజ్రీవాల్ చెప్పిన తాత్కాలిక ముఖ్యమంత్రి అనే పదం రాజ్యాంగంలో ఎక్కడా లేదు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించేదే" అని పేర్కొంటూ ముఖ్యమంత్రి అతిశీకి రాసిన లేఖలో లెఫ్టినెంట్ గవర్నర్ పేర్కొన్నారు.

సీఎంకు వ్యక్తిగతంగా ఈ లేఖ రాస్తున్నట్లు చెప్పిన ఎల్జీ.. ముఖ్యమంత్రి అతిశీపై ప్రశంసలు కురిపించారు. మునుపటి ముఖ్యమంత్రి మాదిరిగా కాకుండా అనేక శాఖలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. పాలనాపరంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం అతిశీని నెగటీవ్‌గా చిత్రీకరిస్తూ ప్రచారం చేయడం తనను ఎంతో నిరాశకు గురిచేసిందన్నారు.






# మదనపల్లె ఫైళ్ల దగ్ధం కేసులో కీలక పరిణామం

- ప్రధాన నిందితుడు సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన గౌతమ్‌తేజ్ అరెస్టు
- అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

**విశ్వంభర, మదనపల్లె:** అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్ల దహనం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు, అక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన గౌతమ్‌తేజ్‌ను ఏపీ సీఐడీ అరెస్టు చేసింది. పలమనేరులో అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు చిత్తూరు కోర్టులో హాజరుపరిచారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. జులై 21న మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉన్నట్లు కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో ప్రమాదం జరగడానికి ముందు అక్కడ పని చేసిన ఆర్డీవో, ఇతర అధికారులను పోలీసులు వారం రోజుల పాటు విచారించారు. ప్రాథమిక ఆధారాలు లభ్యం కావడంతో ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు.

# కన్నప్ప నుంచి హీరోయిన్ ప్రీతి ముఖుంధన్ పోస్టర్ రిలీజ్

డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి ప్రతీ సోమవారం ఒక అప్డేట్ వస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. చెప్పినట్టుగానే ఈ భారీ ప్రాజెక్టు నుంచి ప్రతీ సోమవారం ఓ కీలక అప్డేట్ వదులుతున్నారు. సినిమాలోని విభిన్న పాత్రలను పోషించిన దిగ్గజ నటీనటుల పోస్టర్‌లను రిలీజ్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి మోహన్ బాబు, మోహన్ లాల్, మధుబాల, శరత్ కుమార్, దేవరాజ్ వంటి వారు పోషించిన పాత్రల పోస్టర్స్ రిలీజ్ చేసి అంచనాలు పెంచిన కన్నప్ప టీం.. తాజాగా మరో బ్యూటిఫుల్ పోస్టర్ వదిలింది.

ఈ సినిమాలో హీరోయిన్ ప్రీతి ముఖుంధన్ రోల్ ఎలా ఉండబోతుందో తెలుపుతూ తాజాగా బ్యూటిఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కన్నప్పలో ఆమె నెమలిగా కనిపించబోతుంది. అందంలో సహజం, తెగింపులో సాహసం, ప్రేమలో అసాధారణం, భక్తిలో పారవశ్యం, కన్నప్పను సర్వస్వం, చెంచు యువరాణి నెమలి అంటూ తాజాగా వదిలిన ఈ పోస్టర్ పై రాసిన పదాలు ఈ క్యారెక్టర్ పట్ల క్యూరియాసిటీ పెంచుతున్నాయి. విడుదల చేసిన కాసేపట్లోనే ఈ పోస్టర్ వైరల్ గా మారింది.

కన్నప్ప చిత్రంలో డా.మోహన్ బాబు, మోహన్ లాల్, ప్రభాస్, బ్రహ్మానందం, బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ లాంటి భారీ తారాగణం నటిస్తుంది. ఎంతో అంకితభావంతో విష్ణు మంచు కన్నప్ప పాత్రను పోషిస్తున్నారు. మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ డైరెక్ట్ చేస్తున్నారు. "కన్నప్ప" సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చే విజువల్ వండర్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ధైర్యవంతుడైన యోధుడు శివుని భక్తుడైన కన్నప్ప కథను అద్భుతంగా మలుస్తున్న చిత్ర యూనిట్.. ఏప్రిల్ 25, 2025న ఈ సినిమాను విడుదల చేయబోతోంది.



# సంక్రాంతికి వస్తున్నాం..

## పొంగల్ సాంగ్ విడుదల

విక్టరీ వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ ఫుల్ కొలాబరేషన్‌లో చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' మొదటి రెండు పాటలు చార్ట్ బస్టర్ కావడంతో థర్డ్ సింగిల్ పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫెస్టివ్ బ్యాంగర్ థర్డ్ సింగిల్ బ్లాక్ బస్టర్ పొంగల్ పాటని మేకర్స్ విడుద చేశారు.

ఈ పాటలో జనవరి చలి వాతావరణం, రంగోలీల వంటి సంక్రాంతికి ముందు జరిగే ఉత్సవాలతో సీన్ ని అద్భుతంగా సెట్ చేశారు. వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పండుగను ఘనంగా జరుపుకుంటూ ఫ్రేమ్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఎనర్జీ అదిరిపోయింది.

ఈ పాట రూరల్ పొంగల్ వేడుకలను అందంగా ప్రజెంట్ చేసింది. సరస్వతీపుత్ర రామజోగయ్య శాస్త్రి సాహిత్యం పండగ ప్రాముఖ్యతను, ఐక్యత, వేడుకలను అద్భుతంగా వర్ణించింది. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అద్భుతమైన పండుగ మూడ్‌కు పెర్ఫెక్ట్ గా వుంది, వెంకటేష్, ఇద్దరు హీరోయిన్స్ సాంప్రదాయ వస్త్రధారణలో ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ తో అదరగొట్టారు.

గ్రామీణ సంస్కృతిని వర్ణించే గ్రాండ్ సెట్, సాంగ్ కి కలర్ ఫుల్ వైబ్‌ని యాడ్ చేసింది, పొంగల్ ఉత్సవాల్లో ఆడియన్స్ ని ముంచెత్తుతుంది. గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్‌తో కూడిన ఈ ట్రాక్ పర్ఫెక్ట్ పొగల్ సాంగ్ గా సీజన్‌కు సరైన టోన్‌ను సెట్ చేస్తుంది.

ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సమీర్ రెడ్డి నిర్వహిస్తుండగా.. ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్, డిజైనర్ తమ్మిరాజు, ఎడిటర్, స్క్రీన్ ప్లే: ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ. యాక్షన్ సన్నివేశాలకు రియల్ సతీష్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని జనవరి 14న సంక్రాంతి కానుకగా గ్రాండ్ గా విడుదల చేయనున్నారు.

ఈ చిత్రం లో వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, సాయి కుమార్, నరేష్, వీటీ గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్ మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి నటిస్తున్నారు.



## సోషల్ మీడియాలో దూసుకుపోతున్న బంగారు అయ్యప్ప పాట

ఆర్ఆర్ఆర్ ప్రొడక్షన్స్ నిర్మాణంలో నిర్మితమైన బాలస్వామిని బంగారు అయ్యప్ప పాట నక్షత్ర స్టూడియో ద్వారా రిలీజ్ అయి సోషల్ మీడియాలో 25 మిలియన్స్ పైగా వ్యూస్ తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా నక్షత్ర మీడియా ఛైర్మన్ రాజశేఖర్ ఆ పాట రాసిన పరమేశ్ పాటపాడిన చిన్నారి తన్వికి, సంగీత దర్శకుడు సత్యదీప్, కొరియోగ్రాఫర్ హరికాంత్ రెడ్డి , నృత్యం చేసిన చిన్నారులకు ఆస్ బెస్టాస్ కాలనీ లోని అయ్యప్ప స్వామి దేవస్థానంలో చిరుసత్కారం చేశారు. ఈ వేడుకకు మాస్ట్రీ స్టార్ జేడీ చక్రవర్తి అతిథిగా విచ్చేసి లిరిక్ రైటర్ సంగీత దర్శకుడికి, పాట పాడిన చిన్నారిని, నర్తించిన చిన్నారులను, కొరియోగ్రాఫర్ ను మిగతా టెక్నిషియన్స్ అందరిని నక్షత్ర టీమ్ వారిని జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం జేడీ చక్రవర్తి మాట్లాడుతూ.. ఇలా మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి ఎంకరేజ్ చేస్తూ.. వారికంటూ ఓ ప్లాట్ ఫాం క్రియేట్ చేసినందుకు నక్షత్ర మీడియా అధినేత రాజశేఖర్‌కి యాంకర్ గంగను అభినందించారు. కార్యక్రమంలో కెమరామెన్ సత్య సతీష్, ఎడిటర్ మనోజ్, డిజైనర్, సయ్యద్ ఫయాజ్ నక్షత్ర టీమ్ షఫీ, అక్షయ్, గోపినాథ్, రితిక, నిఖిత, గీత తదితరులు పాల్గొన్నారు.



## 'బాపు' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్




కాక్రమేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ తన మూడవ ప్రొడక్షన్ ని అనౌన్స్ చేసింది. ఇది డార్క్ కామెడీడ్రామా, హ్యూమర్, ఎమోషన్స్ యూనిక్ బ్లెండ్‌తో ప్రేక్షకులను అలరించనుంది. బ్రహ్మాజీ లీడ్ రోల్స్ లో ఒకరుగా నటిస్తున్న ఈ చిత్రానికి దయా దర్శకత్వం వహిస్తున్నారు. రాజు, సీహెచ్ భాను ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఆమని, బలగం సుధాకర్ రెడ్డి, ధన్య బాలకృష్ణ, మణి ఏగుర్ల, అవసరాల శ్రీనివాస్ కథలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రానా దగ్గుబాటి 'బాపు' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం లాంచ్ చేశారు. పోస్టర్‌లో హాయిగా డైనింగ్ చైర్‌లో కూర్చున్న ఓ తండ్రి చుట్టూ ఒక కుటుంబం గుమిగూడి, అతనికి ఇష్టమైన వంటకాలను వడ్డించడం కనిపిస్తోంది. ఫ్యామిలీ మెంబర్స్ డిఫరెంట్ ఎక్స్ ప్రెషన్స్ తో కనిపించడం ఆసక్తికరంగా వుంది. బాపు నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఓ వ్యవసాయ కుటుంబం యొక్క ఎమోషనల్ జర్నీగా వుంటుంది. ఓ కుటుంబ సభ్యుడు ఇతరుల మనుగడ కోసం తమ జీవితాన్ని త్యాగం చేయవలసి వచ్చినప్పుడు ఫ్యామిలీ డైనమిక్స్ ఎలా మారుతుందో డార్క్ కామెడీ, హ్యూమర్, ఎమోషనల్ గా హత్తుకునే నెరేటివ్ తో సినిమా ఉండబోతోంది.

## ప్రధానికి ధన్యవాదాలు : అక్కినేని కుటుంబం

ప్రధాని నరేంద్ర మోదీకి అక్కినేని నాగ చైతన్య, ఆయన భార్య శోభిత ధూళిపాళ్ల ధన్యవాదాలు తెలిపారు. దీనికి కారణం ఆదివారం మోదీ తన మన్‌కీ బాత్ కార్యక్రమంలో లెజెండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావును ప్రశంసించడమే. తెలుగు సినిమా స్థాయిని పెంచిన నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని, ఆయన తన సినిమాల్లో భారతీయ విలువలు, సంప్రదాయాలను, సంస్కృతిని చక్కగా చూపించేవారని మోదీ కొనియాడారు. దీనిపై చైతూ, శోభిత సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అక్కినేని నాగేశ్వరరావు కళా నైపుణ్యాన్ని, తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను మీరు అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. మీ నుంచి ప్రశంసలు పొందడం మా అదృష్టం. మీకు హృదయపూర్వక ధన్యవాదాలు అని చైతూ, శోభిత పోస్టులు పెట్టారు.

కాగా, తన తండ్రిని ప్రధాని మోదీ ప్రశంసించడం పట్ల హీరో నాగార్జున కూడా కృతజ్ఞతలు తెలుపుతూ ఇప్పటికే పోస్ట్ చేశారు. "ఐకానిక్ దిగ్గజాల సరసన మా నాన్న గారిని కూడా గౌరవించినందుకు ప్రధాన మంత్రి గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అది కూడా, మా నాన్న గారి శతజయంతి వేళ ఈ ప్రస్తావన తెచ్చినందుకు ధన్యవాదాలు. భారతీయ సినీ రంగంపై ఆయన దూరదృష్టి, ఆయన అందించిన సేవలు అనేక తరాల వారికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి. ఇవాళ మీ ప్రత్యేక ప్రస్తావనతో మా కుటుంబానికి, మా నాన్న గారి నటనను ప్రేమించే అసంఖ్యాక అభిమానులకు అమిత సంతోషం కలిగింది" అని నాగార్జున తన పోస్టులో రాసుకొచ్చారు.





# 2025పై ఆశలు పెట్టుకున్న నిధి అగర్వాల్



న్యూ ఇయర్ కోసం క్యూరియస్‌గా వెయిట్ చేస్తోంది బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నిధి అగర్వాల్. ఆమె నటించిన రెండు బిగ్ టికెట్ మూవీస్ రెబెల్ స్టార్ ప్రభాస్ రాజా సాబ్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హరి హర వీరమల్లు నెక్స్ట్ ఇయర్ రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. ఈ రెండు ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్స్ తనను ఆడియెన్స్ కు మరింత రీచ్ చేస్తాయని నిధి అగర్వాల్ ఆశిస్తోంది. రాజా సాబ్ సినిమాను మూవీ టీమ్ ఎంతో డెడికేటెడ్‌గా రూపొందిస్తున్నారని, ప్రభాస్‌తో కలిసి వర్క్ చేయడం మర్చిపోలేనని నిధి చెబుతోంది. అలాగే పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో హరి హర వీరమల్లు సినిమాలో నటించడం ఎంతో హ్యాపీగా ఉందని తెలిపింది. ఈ రెండు భారీ చిత్రాలతో పాటు తెలుగు, తమిళంలో మరికొన్ని సర్ ప్రైజింగ్ మూవీస్‌ను న్యూ ఇయర్‌లో అనౌన్స్ చేయనుంది నిధి అగర్వాల్.

## ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌తో దిల్ రాజు భేటీ



ప్రముఖ నిర్మాత దిల్ రాజు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలుసుకున్నారు. సోమవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ అభివృద్ధి గురించి చర్చించినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. రామ్ చరణ్ కొత్త సినిమా గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ఆంధ్ర ప్రదేశ్ లో నిర్వహించాలని భావిస్తున్నట్లు దిల్ రాజు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని పవన్ కల్యాణ్ ను ఆహ్వానించినట్లు తెలిపారు. దీనికి పవన్ ఓకే చెప్పారని వివరించారు. దిల్ రాజు, పవన్ ల భేటీపై గేమ్ ఛేంజర్ నిర్మాణ సంస్థ ట్విట్టర్ ద్వారా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపింది. కాగా, సంక్రాంతి కానుకగా జనవరి 10వ తేదీన గేమ్ ఛేంజర్ సినిమా విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్న ఈ సినిమాకు సంబంధించిన విశేషాలు, ప్రచార చిత్రాలు సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com